ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 22.08.2025 | సంపుటి : 12 | సంచిక : 34 | పేజీలు : 12 | వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## తెలంగాణ అన్నదాతపై

# కేంద్రం వివక్ష





### యూరియా కొరతకు కోటా సరఫరా చేయకపోవడమే కారణం

- రైతుల్లో అసంతృప్తి పెరిగితే లాభిస్తుందని మోడీ సర్కార్ కుట్ర
- ఇప్పటికే సీజన్ గడిచిపోతోందని కర్షకుల్లో ఆందోళన
- ఇంకా 3 లక్షల మెట్రిక్ టన్నులు అందించాల్సివున్న కేంద్రం
- బీజేపీ, మిత్రపక్షాల రాష్ట్రాల్లో మాత్రం సరిపడా కేటాయింపులు
- గతేడాది వరద సాయంలోనూ తెలంగాణకు రిక్తహస్తమే..!

**తెలంగాణపై బీజేపీ ప్రభుత్వానికి ఉన్న ఉద్దేశం మరోసారి రుజువైంది. ఒకవైపు సీజన్ దాటిపోతోందని రైతులు యూరియా కోసం ఆందోళన చేస్తుంటే.. నిల్వలు ఉన్నప్పటికీ సరఫరా చేయకుండా మీనమేషాలు లెక్కిస్తోంది. స్వయంగా ప్రభుత్వ పెద్దలే పలుమార్లు మొరపెట్టినప్ప టికీ సరిపడా కేటాయింపులు చేయకుండా మొండివైఖరి ప్రదర్శిస్తోంది. గడిచిన ఏడాది కూడా వరద సాయంలోనూ వివక్ష చూపిన మోడీ సర్కార్.. ఇప్పుడు తెలంగాణ రైతాంగంపై కత్తికట్టినట్టుగా వ్యవహరిస్తోంది. దేశంలోనే వరి ఎక్కువగా పండిస్తున్న తెలంగాణ అంటే అక్కసా..? లేక ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం ఉచితంగా ఇస్తున్నదని కడుపుమంటనా..? రైతుల్లో అసంతృప్తి పెరిగితే రాబోయే రోజుల్లో తమకు కలిసొస్తుందనా..? తెలియదుగానీ రాష్ట్రంపై మోడీ ప్రభుత్వం మొదట్నుంచీ శీతకన్ను వేస్తోంది. కొన్నేళ్లుగా దక్షిణాది రాష్ట్రాలకూ సహాయ సహకారాలు అందించడంలోనూ దూరం దూరంగానే ఉంటోంది.**



**యూరియా కోసం అన్నదాత వేతలివి..**

వనపర్తి జిల్లా ఆత్మకూరు పీఏసీఎస్ వద్దకు ఉదయమే రైతులు భారీగా చేరుకొని యూరియా కోసం చెప్పులు, ఇటుకలను క్యూలో పెట్టి నిరీక్షించారు. గంటల తరబడి నిలబడి యూరియా కోసం ఎదురుచూసిన ఓ రైతు అలసటతో ఇలా వరుసలోనే నిద్రపోయాడు.

| | |
|---|---|
| ఇవ్వాల్సింది.. | 9.80 లక్షల మెట్రిక్ టన్నులు |
| ఇచ్చింది.. | 5.8 లక్షల మెట్రిక్ టన్నులే.. |

**స్పెషల్ కరస్పాండెంట్, తెలంగాణ (జనంసాక్షి)**
ఏన్డీయేపక్షాల పట్ల ఒకలా.. ప్రతిపక్ష ప్రభుత్వాల పట్ల మరోలా అన్నట్టుగా మోడీ సర్కార్ పలు రాష్ట్రాలపై వివక్ష చూపుతోంది. తెలంగాణలో ఇద్దరు కేంద్ర మంత్రులున్నప్పటికీ 'కేటాయింపులు' శూన్యమన్నట్టుగా మారింది. కేంద్రంలో యూరియా నిల్వలున్నా.. రాష్ట్రా నికి సరిపడా ఇవ్వకుండా రైతుల ఆందోళనకు కారణ మవుతోంది. గత రెండేండ్లుగా తెలంగాణలో సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. గతంతో పోలిస్తే



కాంగ్రెస్ సర్కార్ ఏర్పడినప్పటి నుంచి గత సాగు విస్తీర్ణా నికి కంటే 20 శాతం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. సాగు విస్తీర్ణం పెరిగిన దరిమిలా యూరియా వినియోగమూ ఈఏడాది 21 శాతం ఎక్కువై న్నట్టు లెక్కలు చెబుతున్నాయి. సీజన్ ప్రారంభానికి ముందే అంటే మార్చి, ఏప్రిల్‌లోనే ఈ సీజన్‌కు సంబంధించిన కావాల్సినంత యూరియాను సరఫరా చేయాలి. కేంద్రం అంచనాల ప్రకారం రాష్ట్రానికి ఈ సీజన్‌లో 9.80లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపాలి. కానీ ఇప్పటి వరకు పంపింది మాత్రం 5.18 లక్షల మెట్రిక్ టన్నులే.

మిగతా 2లో..



### ఉపరాష్ట్రపతి పదవికి జస్టిస్ సుదర్శన్ రెడ్డి

# నామినేషన్

#### కార్యక్రమంలో పాల్గొన్న సోనియా, రాహుల్,ఖర్గే

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**విపక్ష ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్‌కు చివరి తేదీ కావడంతో కాంగ్రెస్ అగ్రనేతల సమక్షంలో తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురు ఇండియా కూటమి నేతలు హాజరయ్యారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామినేషన్‌ను బలపరుస్తూ సోనియా సహా 20 మంది ఎంపీలు సంతకాలు చేశారు. మరోవైపు అధికార ఎన్డీఏ

మిగతా 2లో..

### రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా

# చర్యలు తీసుకోవాలి

**వాటాకు తగిన విధంగా దక్షిణాది రాష్ట్రాలకు నిధుల పంపిణీ జరగడం లేదు**

**జిఎస్టి రేట్ రేషనలైజేషన్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**జీఎస్టీ కౌన్సిల్ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌ను ఏర్పాటు చేసి, జీఎస్టీ పన్ను స్లాబుల సవరణ మరియు పన్ను రేట్ల మార్పులపై సిఫారసుల బాధ్యతను అప్పగించింది. మంత్రుల బృందంలో సభ్యుడైన ఉప ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గురువారం ఢిల్లీలో మాట్లాడుతూ, జీఎస్టీ ప్రవేశపెట్టిన సమయంలో రాష్ట్రాల వార్షిక వృద్ధి రేటు 14%గా ఉండటంతో, వార్షికంగా 14% వృద్ధి కలుగుతుందని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వృద్ధి రేటులో లోటును పూరించడానికి, రాష్ట్రాలు స్థిరంగా 14% వృద్ధిని సాధించేందుకు, మొదటి 5 సంవత్సరాలపాటు జీఎస్టీ పరిహారం అందించే విధానం అమలులోకి వచ్చిందని వివరించారు. అయితే, ఇప్పటి వరకు 14% వృద్ధి స్థిరపడలేదని, ప్రస్తుతం రాష్ట్రాల వార్షిక వృద్ధి కేవలం 8 నుంచి 9% మధ్యలోనే ఉందని తెలిపారు. జీఎస్టీ రేట్ల సరళీకరణ, పన్ను భారం తగ్గించడం ఆహ్వానించదగ్గదే అయినప్పటికీ, రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా రక్షించే చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ సమావేశంలో స్పష్టంచేశారు. లేనిపక్షంలో, పేద



**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ లోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఉప ముఖ్యమంత్రి భట్టి ఎంపీలు బలరాం నాయక్, రామసహాయం రఘురాం రెడ్డి, మల్లు రవి**

మరియు మధ్యతరగతి ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర ప్రజల కోసం చేపడుతున్న మౌలిక వసతుల ప్రాజెక్టులు దెబ్బతింటాయని హెచ్చరించారు. అలాగే, ఆదర్శ వృద్ధి


మిగతా 2లో..

### కాలేజీల్లో విద్యా ప్రమాణాల మేరకే ఫీజుల పెంపు

- ఇంజినీరింగ్ కాలేజీలపై ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఈమేరకు నిబంధనల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు

**హైదరాబాద్(జనంసాక్షి):** ఇంజినీరింగ్, వృత్తి విద్యా కాలేజీల్లో ఫీజుల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కళాశాలలు అందించే అకౌంట్స్‌తో పాటు ఆయా కళాశాల్లో విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని మాత్రమే ఫీజులు నిర్ధరించాలని నిర్ణయించింది. ఈమేరకు ఫీజుల పెంపునకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేస్తూ

మిగతా 2లో..



# చర్యలు ఎప్పుడు తీసుకుంటారు?

**ఘోష్ నివేదిక ఆధారంగానా లేదా అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చ తర్వాతనా..?**
- ఏజీని ప్రశ్నించిన హైకోర్టు
- కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై విచారణ రేపటికి వాయిదా


**హైదరాబాద్(జనంసాక్షి):**కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. కేసీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ఆర్యామ సుందరం వాదనలు వినిపించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిబంధనలు పాటించలేదని కోర్టుకు వివరించారు. నోటీసులు సరైన విధానంలో ఇవ్వలేదన్నారు. అంతేకాకుండా నివేదికను కేసీఆర్, హరీశ్‌రావుకు ఇవ్వలేదని చెప్పారు.

మిగతా 2లో..

# ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

- ఉభయ సభలు నిరవధిక వాయిదా
- మొత్తం 12 బిల్లులకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఆన్‌లైన్‌గేమింగ్ బిల్లు2025 ఎట్టకేలకు పార్లమెంట్‌లో పాసైంది. ఇవాళ రాజ్యసభలో ఆ బిల్లుకు ఆమోదం దక్కింది. విపక్షాలు తీవ్ర ఆందోళన చేపడుతున్న నేపథ్యంలోనే బిల్లును పాస్ చేశారు. ఎటువంటి చర్చ లేకుండానే బిల్లుకు పచ్చజెండా ఊపారు. కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఆన్‌లైన్‌లో జరిగే అన్ని రకాల మనీ గేమ్స్‌ను నిషేధిస్తూ ఈ బిల్లును రూపొందించారు. అయితే ఈ బిల్లు ద్వారా ఈస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమింగ్‌ను మాత్రం ప్రమోట్ చేస్తున్నారు. విపక్ష సభ్యులు ఇచ్చిన సవరణలను తోసిపుచ్చుతూ.. ఇవాళ రాజ్యసభలో ఆ బిల్లుకు ఆమోదం దక్కింది. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు బుధవారం లోక్‌సభలో క్లియరెన్స్ దక్కిన విషయం తెలిసిందే. ఆన్‌లైన్ మనీ గేమ్స్, బ్యార్ బ్యాంక్స్, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు చెందిన వాణిజ్య ప్రకటనపై కూడా నిషేధం విధించారు. డబ్బులు డిపాజిట్ చేసి ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడే విషయం తెలిసిందే. గెలిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయన్న ఆశతో



ఈ క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతోంది. జూలై 21 నుంచి నేటి వరకు జరిగిన కార్యకలాపాలు- ఈ సమావేశాల్లో 14 బిల్లులను ప్రవేశపెట్టిన కేంద్రం- ఆపరేషన్ సిందూర్‌పై జూలై 28, 29 తేదీల్లో జరిగిన ప్రత్యేక చర్చ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ సమావేశాల్లో ప్రతిపక్ష ఎంపీల ప్రవర్తనపై అసహనం వ్యక్తం చేసిన స్పీకర్ ఓం బిర్లా, ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు గందరగోళం సృష్టించాయి. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు స్పీకర్ ఓం బిర్లా. ఆ తర్వాత కూడా పరిస్థితి మారకపోవడంతో నివధికంగా వాయిదా వేశారు.

మిగతా 2లో..

### 5%,18% శ్లాబులకు

# ఓకే..

**జీఎస్టీలో మార్పుల ప్రతిపాదనకు మంత్రుల బృందం ఆమోదం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణల విషయంలో కీలక ముందడుగు పడింది. పరోక్ష పన్నుల విధానంలో రెండు శ్లాబులు ఉంచాలన్న కేంద్రం ప్రతిపాదనలకు మంత్రుల బృందం ఆమోదం తెలిపింది. 12, 28 శాతం శ్లాబులు తొలగించి.. 5, 18 శాతం

మిగతా 9లో..






### రూ. 400 కోట్ల విలువైన ఆక్రమణ స్థలానికి

# హైడ్రాతో విముక్తి

#### మాదాపూర్‌లో అక్రమ కట్టడాలు

#### ఫిర్యాదుతో స్పందించి కూల్చివేసిన హైడ్రా

**హైదరాబాద్(జనంసాక్షి):** హైడ్రా దాడితో నగరంలో భారీ విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం నుండి బయటపడింది. ప్రజావాణజలో వచ్చిన ఫిర్యాదను ధృవకీరించి సకాలంలో స్పందించింది. దీంతో కోట్ల విఉలువైన ప్రభుత్వ భూమిని కాపాడగలిగారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాదాపూర్ ప్రాంతంలోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో పార్కులతో పాటు- రహదారులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. 22.20 ఎకరాల్లో సుమారు 100 ప్లాట్లతో అనుమతి

మిగతా 2లో..

### ప్రపంచ ఇంధన మార్కెట్‌ను

# స్థిరీకరిస్తున్నాం

#### రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై జైశంకర్ స్పందన

#### భారత్‌లో పెట్టుబడులు రష్యా కంపెనీలకు పిలుపు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రపంచఇంధన మార్కెట్‌ను స్థిరీకరించేందుకు రష్యా నుంచి చమురు కొనుగోలు సహా ఆయా చర్యలు తీసుకోవాలని కొన్నేళ్లుగా అమెరికా చెబుతోంది. మేం అగ్రరాజ్యం నుంచి కూడా చమురు కొనుగోలు చేస్తున్నాం. ఆ పరిమాణం కూడా పెరిగిందని జైశంకర్ తెలిపారు. ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉన్న జైశంకర్.. ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి సెర్గీ లావ్రోవ్, ఫస్ట్ డిప్యూటీ- ప్రైమ్ మినిస్టర్ డెనిస్ మంటురోవ్ తదితరులతో భేటీ- అయ్యారు. భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఇరుదేశాలు నూతన మార్గాలు అన్వేషించి ముందుకుసాగాలని పేర్కొన్నారు.

మిగతా 2లో..



## విద్యా ప్రమాణాల మేరకే ఫీజుల పెంపు

ఉత్తర్వులు జారీ చేసింది. ఇంజినీరింగ్, వృత్తి విద్యా కళాశాలల్లో విద్యార్థుల హాజరు, ఫేషియల్ రికగ్నేషన్ అమలు, ఆధార్ ఆధారిత ఫీజుల చెల్లింపులు సహా విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహిస్తున్నారా అనే అంశాలను సైతం పరిగణనలోకి తీసుకోనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. కాలేజీలు నాణ్యమైన విద్య అందిస్తున్నాయా? ఆ కాలేజీల్లో విద్యార్థులకు ప్లేస్ మెంట్స్ ఎలా ఉన్నాయి అనే అంశాలపైనా దృష్టి సారించనుంది. జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్‌లు, ప్రభుత్వ నిబంధనలను ఏ మేరకు అమలు చేస్తున్నారనే అంశాలను సైతం పరిశీలించిన తర్వాతే కళాశాలల్లో ఫీజులను నిర్ధరించనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

## రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా చర్యలు తీసుకోవాలి

**– జీఎస్టి రేట్ రేషనలైజేషన్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

రేటు 14% పక్కన పెడితే గాని, ప్రస్తుత 8–9% వృద్ధి రేటును పక్కన పెడితే గాని, ప్రతిపాదనలు ఒంటరిగా పరిశీలిస్తే రాష్ట్రాలకు ప్రతికూల ఆదాయ వృద్ధికి దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంతేకాక, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు వంటి దక్షిణ రాష్ట్రాలు దేశ ఆదాయాలకు గణనీయంగా సహకరిస్తున్నప్పటికీ, జాతీయ ఆదాయంలో వాటి వాటాకు తగిన విధంగా నిధుల పంపిణీ జరగడం లేదని తెలిపారు. చివరగా, జీఎస్టీ సంస్కరణలలో భాగంగా రేట్ రేషనలైజేషన్ ప్రతిపాదనకు మద్దతు తెలిపినా, దానికి సరైన పరిహార యంత్రాంగం ఉండాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అందుకు, ప్రస్తుతం అమలులో ఉన్న పరిహార సెస్సు కొనసాగించి, దానివల్ల సమకూరే మొత్తాన్ని పూర్తిగా ఆయా రాష్ట్రాలకు ఇవ్వాలని ప్రతిపాదించారు. లేకపోతే, పరిహార సెస్సును రద్దు చేసి, సిగరెట్లు, మద్యం, విలాస వస్తువుల వంటి 'సిన్' లేదా లగ్జరీ ఉత్పత్తులపై జీఎస్టీ రేట్లు ప్రస్తుత స్థాయికి పెంచి, అదనంగా లభించే ఆదాయాన్ని రాష్ట్రాలకు కేటాయించాలన్నారు. దీనివల్ల సాధారణ పన్ను చెల్లింపుదారులపై భారం తగ్గడంతో పాటు, పేద, మధ్యతరగతి సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా కొనసాగించగలదని పేర్కొన్నారు.

## రూ. 400 కోట్ల విలువైన ఆక్రమణ స్థలానికి హైడ్రాతో విముక్తి

పొందిన ఈ లేఔట్‌లో 4 పార్కులుండగా దాదాపు 8,500 గజాలుగా ఉన్న రెండు పార్కులు కబ్జాకు గురయ్యాయి. అలాగే 5 వేల గజాల మేర రోడ్డు కూడా కబ్జాకు గురైంది. వీటికి తోడు.. 300ల గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన హోటల్ షెడ్డును కూడా హైడ్రా తొలగించింది. ఇలా మొత్తం 16000 గజాల స్థలాన్ని హైడ్రా కబ్జా చెర నుంచి కాపాడింది. దీని విలువ సుమారు రూ.400 కోట్ల వరకు ఉంటుందని అంచనా. 1995లో అనుమతి పొందిన ఈ లేఔట్‌ను 2006లో ప్రభుత్వం రెగ్యులరైజ్ కూడా చేసింది. ఇదే అదనుగా ఈ లేఔట్ ప్రకారం జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్ చేసిన పార్కులను జైహింద్‌రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేశారంటూ జూబ్లీ ఎన్‌క్లేవ్ లేఔట్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారించిన హైడ్రా అధికారులు కబ్జాలు వాస్తవమే అని నిర్ధరించుకున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు వాటిని గురువారం తొలగించారు. వెనువెంటనే పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు– సూచిస్తూ బోర్డులు కూడా పెట్టారు. పార్కులు, ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు– చేశారు. కబ్జాకు పాల్పడ్డవారిపై పోలీసు కేసులు పెడుతున్నట్టు– హైడ్రా అధికారులు తెలిపారు. హైటెక్ సిటీ నుంచి కొండాపూర్ రహదారికి ఆనుకొని మెటల్ చార్మినార్‌కు ఎదురుగా సుమారు 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి.. అనుమతి లేకుండా హోటల్ నిర్మించి అద్దెలను జైహింద్‌రెడ్డి అనే వ్యక్తి పొందుతున్నాడని జూబ్లీ ఎన్‌క్లేవ్ ప్రతినిధులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే స్థలంలో భారీ ప్రకటనల హోర్డింగ్ కూడా పెట్టి రెండింటి ద్వారా నెలకు రూ.4 లక్షల వరకూ ఆదాయం పొందుతున్నాడని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో హోటల్‌ను నిర్మించి అద్దె వసూలు చేస్తున్న వైనంపై గతంలో జీహెచ్ఎంసీ నోటీసులు కూడా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. 2006లో రెగ్యులరైజ్ అయిన లే ఔట్ అక్కడి ప్లాట్ యజమానులకు తెలియకుండా తర్వాత ఎలా రద్దవుతుందని వాపోయారు. యూఎల్‌సీ ల్యాండ్ అయితే ప్రభుత్వానికి చెందుతుందని.. మధ్యలో జైహింద్‌రెడ్డిది ఎలా అవుతుందని ఎన్‌క్లేవ్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆయనపై చాలావరకు ల్యాండ్ గ్రాబింగ్ కేసులున్నాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. దీంతో హైడ్రా గురువారం ఆక్రమణలను కూల్చివేసింది. అలాగే దీనిపై చర్యలకు కూడా ఉపక్రమించనుంది. హైడ్రా చర్యను లే ఔట్ యజమానులు అభినందించారు.

## ఆక్సియం మిషన్ సమాచారం గగన్‌యాన్‌కు ఎంతో ఉపయోగం: శుభాంశు శుక్లా

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అంతరిక్షయానం కోసం చాలా శిక్షణ తీసుకున్నట్లు భారత వ్యోమగామి కెప్టెన్ శుభాంశు శుక్లా తెలిపారు. దిల్లీలో ఆయన ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. అంతరిక్షంలో తన అనుభవాలను పంచుకున్నారు. "ఇది దేశం మొత్తానికి చెందిన మిషన్. క్షేత్రస్థాయిలో నేర్చుకున్న దాని కంటే.. అంతరిక్షంలో అనుభవం చాలా భిన్నంగా ఉంటుంది. అక్కడి నుంచి చూస్తే భూమి చాలా అద్భుతంగా కనిపించింది. యాక్సియం మిషన్ కోసం చాలా కష్టపడి పనిచేశాం. మన శాస్త్రవేత్తలు ఎంతో కష్టపడ్డారు. ఐఎస్ఎస్ నుంచి కొన్ని ఫొటోలు తీసుకొచ్చాం. ఏడాదిగా ఈ మిషన్ కోసం ఎంతో సమాచారం సేకరించాను. ఈ సమాచారం గగన్‌యాన్ మిషన్‌కు ఉపయోగపడుతుంది. ప్రతి భారతీయుడి కలను నెరవేర్చడం నాకు గర్వ కారణం" అని తెలిపారు.

# తెలంగాణ అన్నదాతపై కేంద్రం వివక్ష



ఇంకా 3.12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉంది. ఉక్రెయిన్ యుద్ధాలని ఇంకేవో కారణాలను చెబుతూ కేంద్రం సరిపడా యూరియా పంపలేదు. రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లో సాంకేతిక లోపాల కారణంగా ఉత్పత్తి ఆగిపోయింది. ప్రస్తుతం రాష్ట్రంలో మార్క్‌ఫెడ్ వద్ద 20వేల మెట్రిక్ టన్నులు, సొసైటీల వద్ద 16వేల మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్స్ వద్ద 35వేల మెట్రిక్ టన్నుల యూరియా ఉంది. అవసరం మేరకు సరఫరా చేస్తున్నామని ప్రభుత్వ అధికారులు ప్రకటిస్తున్నా.. అనేక జిల్లాల్లో రైతులు పడిగాపులు గాయాల్సిన దుస్థితి ఏర్పడింది.

### ఏప్రిల్ నుంచి కేటాయింపుల్లేవు..

మే చివరి వారంలో వర్షాలు ప్రారంభం కావడం, జూలై, ఆగస్టు నెలలో మంచి వర్షాలు కురువడం వల్ల రాష్ట్రంలో వరి, పత్తి, మిర్చి, పప్పు దినుసులు వంటి అనేక రకాల పంటలు రైతులు ఒకేసారి సాగు చేశారు. కానీ తెలంగాణ కేటాయించిన యూరియా స్టాక్ సరఫరాలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల కొరత ఏర్పడింది. చైనా, జర్మనీ, ఇరాన్, యుమాన్ వంటి పలు దేశాల నుంచి రావాల్సిన యూరియా సరఫరా కావడం లేదు. ఏప్రిల్ నెల నుంచి కేటాయింపుల మేరకు రాష్ట్రానికి యూరియా సరఫరా కాలేదు. మొత్తం మూడు లక్షల మెట్రిక్ టన్నుల తక్కువ సరఫరా జరిగింది. రెండు రోజుల క్రితం తెలంగాణ ఎంపీలు కలిసిన సందర్భంగా 62వేల మెట్రిక్ టన్నుల యూరియాను ఇస్తామని కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా హామీనిచ్చినా.. కేంద్రం అలసత్వం కారణంగా రెండు నెలలుగా తెలంగాణ అన్నదాతలు అరిగోస పడ్డారు.

### కుంటిసాకుల వెనుక మతలబు ఏంటో..?

సేంద్రీయ సాగు ప్రోత్సాహానికి పీఎం ప్రణామ్ కింద రసాయన ఎరువుల రాయితీలు క్రమంగా తగ్గిస్తున్నారు. ఇది కూడా సరఫరాను ప్రభావితం చేస్తున్నట్టు తెలుస్తోంది. సగటు వినియోగం ఆధారంగా కేటాయింపులు లేక డిమాండ్‌ను తీర్చడం లేదు. దీంతో రైతులకు సీజన్‌లో తిప్పలు ఎదురవుతున్నాయి. అయితే కేంద్రం చెబుతున్న పొంతన లేనిస మాధానాల వెనుక మతలబు వేరే ఉన్నట్టు స్పష్టమవుతోంది. రైతుల్లో అసంతృప్తులు పెరిగితే తమ పార్టీకి లాభిస్తుందనే కోణంలో బీజేపీ సర్కార్ వ్యవహరిస్తున్నట్టు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. బీజేపీయేతర రాష్ట్రాల్లో ఇదే ఫార్ములాను అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, రాబోయే రోజుల్లో ప్రజల్లో అసంతృప్తిని అనుకూలంగా మార్చుకోవాలని భావిస్తున్నట్టు విశ్లేషకుల అంచనా. కాంగ్రెస్ పాలిత కర్నాటకలోనూ కేటాయించిన యూరియాలో కేవలం సగం మాత్రమే సరఫరా చేసింది కేంద్రం. తెలంగాణ విషయంలో కాంగ్రెస్ మంత్రులు, ఎంపీలు కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తులు పంపినా సకాలంలో సరఫరా చేయక రైతులు రోడ్డెక్కేందుకు కేంద్ర సర్కార్ కారణమైంది. ఇది స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి నష్టం చేస్తుందని బీజేపీ పెద్దలు భావిస్తున్నారు. అయితే, తెలంగాణలో ఇద్దరు కేంద్ర మంత్రులున్నా స్థానిక రైతాంగం పరిస్థితిని కేంద్రానికి వివరించలేకపోయారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది వరద సాయంలోనూ తెలంగాణ ప్రభుత్వ వినతులను కేంద్రం పట్టించుకోకపోగా.. ఈసారి అన్నదాతల విషయంలోనూ అదే పరిస్థితి పునరావృతం చేయడం పట్ల తెలంగాణ ప్రజలు మోడీ సర్కార్‌పై మండిపడుతున్నారు.

## చర్యలు ఎప్పుడు తీసుకుంటారు?

కమిషన్ సమర్పించిన నివేదికను ప్రభుత్వం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. రాజకీయంగా భారత రాష్ట్ర సమితికి, కేసీఆర్‌కు నష్టం చేకూర్చేలా నివేదిక రూపొందించారని ఆరోపించారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విలేకరుల సమావేశంలో సీఎం కమిషన్ నివేదిక వివరాలను తెలిపారని అన్నారు. వెబ్‌సైట్‌లోనూ అప్‌లోడ్ చేశారని, కేసీఆర్‌కు మాత్రం నివేదిక కాపీలు ఇవ్వలేదని, దీనిపై ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందన లేదని కేసీఆర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తెచ్చారు. కమిషన్ నివేదికపై ప్రభుత్వం త్రిసభ్య కమిటీ ఏర్పాటుచేసిందని ప్రభుత్వం తరఫు న్యాయవాది తెలిపారు. అసెంబ్లీలో చర్చించేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి న్యాయస్థానానికి వివరించారు. ఇద్దరు పిటిషనర్లు అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అలాంటప్పుడు నివేదికను ఎందుకు బయటపెట్టారని ఏజీని హైకోర్టు ప్రశ్నించింది. మీడియా సమావేశంలో ప్రతి విలేకరికి 60 పేజీల నివేదిక ఇచ్చారని కోర్టుకు తెలిపారు. కోర్టుకు సమర్పించిన నివేదిక కాపీలు సరిగ్గా కనిపించడం లేదని సీజే అన్నారు. ప్రాధాన్యం దృష్ట్యా విచారణ ఇవాళే కొనసాగించాలని కేసీఆర్ తరఫు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటారా? అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చ తర్వాత చర్యలు తీసుకుంటారా? అని హైకోర్టు ధర్మాసనం.. ఏజీని ప్రశ్నించింది. ప్రభుత్వ నిర్ణయం చెప్పడానికి సమయం కావాలని ఏజీ సుదర్శన్‌రెడ్డి కోరారు. దీంతో విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.

## మేడారంలో స్మృతివనం

**రూ. 40కోట్లతో ఏర్పాటు**

**హైదరాబాద్(జనంసాక్షి):** మేడారం గ్రామంలో దాదాపు రూ. 40 కోట్ల వ్యయంతో 29 ఎకరాల విస్తీర్ణంలో సమ్మక్క, సారలమ్మ స్మృతి వనాన్ని నిర్మిస్తున్నట్టు– రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు తెలియ చేశారు. గురువారం సచివాలయంలో వారు మాట్లాడుతూ, వచ్చే జనవరి 28 వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు గతంలో మరెప్పుడూ లేనివిధంగా రూ.150 కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈసారి జాతరకు ముందస్తుగా నిధులు మంజూరు చేయడం వల్ల సకాలంలో జాతర పనులు పూర్తవుతాయని అన్నారు. సమ్మక్క, సారలమ్మ ల వివిధ చరిత్ర వారి పోరాటాలు, గిరిజన సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా మేడారం గ్రామంలో 29 ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేకంగా స్మృతి వనాన్ని నిర్మిస్తున్నట్టు– మంత్రి ధనసరి అనసూయ వెల్లడించారు. 13 వ శతాబ్దం నాటికి చెందిన మేడారం తల్లుల చరిత్ర, గిరిజన సంస్కృతిని తెలియ చేసే విధంగా ఈ స్మృతి వనం ఉంటు–ందని వివరించారు. మేడారంలో జంపన్న వాగు నుండి మేడారం గద్దెల వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డు ను విస్తరించి డివైడర్లు ఏర్పాటు– చేస్తున్నట్టు– చెప్పారు.


## ఉపరాష్ట్రపతి పదవికి జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామినేషన్

కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ బుధవారం నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోదీ పలువురు కేంద్ర మంత్రుల సమక్షంలో ఆయన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ ఏర్పడిన ఉపరాష్ట్రపతి పదవికి సెప్టెంబర్ 9న ఎన్నిక జరగనుంది. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ– ఉంది. ఈ నేపథ్యంలో రాధాకృష్ణన్ విజయం లాంఛన ప్రాయమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సంఖ్యా బలం దృష్ట్యా చూస్తే ఆయన ఎన్నిక ఏకపక్షంగా జరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఉప రాష్ట్రపతి ఎన్నికలో తమ ఉమ్మడి అభ్యర్థిగా జస్టిస్ బీ సుదర్శన్ రెడ్డి పేరును విపక్ష ఇండియా కూటమి ప్రకటించడంతో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏలో ముఖ్యంగా దక్షిణాది భాగస్వామ్య పక్షాలలో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిని, దేశంలోని ప్రముఖ న్యాయకోవిదుడిని తమ ఉమ్మడి అభ్యర్థిగా ఇండియా కూటమి ప్రకటించి తాము ఈ ఎన్నికల్లో లాంఛనంగా పోటీ చేయడం లేదన్న సందేశాన్ని ఎన్‌డీఏకి బలంగా పంపించాయి. లోక్‌సభ, రాజ్యసభలో అధికార ఎన్‌డీఏ కూటమికి అనుకూలంగా సంఖ్యాబలం స్పష్టంగా కనపడుతున్నప్పటికీ వ్యూహాత్మకంగా తాము ఎంపిక చేసిన అభ్యర్థితో కొన్ని రాజకీయ పార్టీలు పునరాలోచనలో పడే అవకాశం లేకపోలేదని ఇండియా కూటమి అంచనా వేస్తోంది. ఇది సైద్ధాంతక సమరమని డీఎంకే ఎంపీ కనిమొళి అభివర్ణించారు. ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న వ్యక్తికి వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని గౌరవించే అభ్యర్థిని తాము ఉమ్మడిగా ఎంపికచేశామని ఆమె పేర్కొన్నారు. అయితే తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి రెండుసార్లు ఎంపీగా పనిచేసిన సీపీ రాధాకృష్ణన్‌ని తమ అభ్యర్థిగా ఎన్‌డీఏ నామినేట్ చేసి ఎంకే స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకేలో గందరగోళాన్ని సృష్టించేందుకు ప్రయత్నించింది. తమిళనాడులో తమిళుల ఆత్మగౌరవం అన్నది చాలా భావోద్వేగాలతో ముడిపడిన అంశం కావడంతో స్థానిక సెంటిమెంటుకు, జాతీయ రాజకీయ లెక్కలకు మధ్య గీత గీయాల్సిన పరిస్థితి డీఎంకేకి ఏర్పడింది. విపక్షాల ఉమ్మడి అభ్యర్థికే తమ మద్దతని ప్రకటించిన డీఎంకే తమ నిర్ణయాన్ని రాజకీయంగా నిర్వచించాలే తప్ప భాషాపరంగా లేక ప్రాంతీయ ఆత్మగౌరవంతోనో చూడకూడదని పేర్కొంది. నలుగురు రాజ్యసభ సభ్యులున్న భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ఉప రాష్ట్రపతి అభ్యర్థిపై తన వైఖరిని ఇంకా నిర్ణయించలేదు. ఈ ఎన్నికలో ఎవరికి మద్దతు ఇవ్వాలన్న అంశంపై పార్టీ అధ్యక్షుడు కే చంద్రశేఖర్ రావు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఇక వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్ఆర్‌సీపీ తాను ఎన్‌డీఏ అభ్యర్థికే మద్దతు ఇస్తున్నట్లు– ప్రకటించింది. తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలన్న ఇండియా కూటమి అభ్యర్థనను ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తిరస్కరించారు. తాము ఎన్‌డీఏ అభ్యర్థికే మద్దతు ఇవ్వనున్నట్లు– తెలిపారు. రాజ్‌నాథ్ సింగ్ తమను సంప్రదించారని, ఎన్‌డీఏ అభ్యర్థికి మద్దతు ఇస్తామని ఆయనకు మాట ఇచ్చామని సుబ్బారెడ్డి చెప్పారు. ఒడిశాకు చెందిన బిజూ జనతా దళ్(బీజేడీ) ఉప రాష్ట్రపతి ఎన్నికలలో తమ వైఖరిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. మద్దతు కోసం నవీన్ పట్నాయక్ పార్టీని ఇండియా కూటమి నాయకులు ఇప్పటివరకు సంప్రదించలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## భారత్‌తో వాణిజ్య సంబంధాలను దెబ్బతీసుకోవద్దు

**విదేశాంగ విధానంలో ట్రంప్ సర్కారు కొన్ని మార్పులు చేసుకోవాలి: నిక్కీ హేలీ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్‌తో వాణిజ్య సంబంధాలను మెరుగుపరుచుకోవాలని అమెరికా రిపబ్లికన్ నేత నిక్కీ హేలీ పేర్కొన్నారు. ఇండియాను స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య భాగస్వామిగా భావించాలని ఆమె అన్నారు. న్యూస్‌వీక్ మ్యాగ్జిన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఇండియా వస్తువులపై 50 శాతం దిగుమతి సుంకాన్ని విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో నిక్కీ హేలీ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకున్నది. విదేశాంగ విధానంలో ట్రంప్ సర్కారు కొన్ని మార్పులు చేసుకోవాల్సి ఉంటుందని ఆమె అన్నారు. చైనాను అధిగమించే ఉద్దేశంలో.. భారత్‌తో వాణిజ్య రిలేషన్‌ను దెబ్బతీసుకోవద్దు అని ఆమె సూచించారు. రష్యా నుంచి ఇంధనం ఎగుమతి చేసుకుంటుందన్న ఆరోపణపై భారత్‌పై అదనపు సుంకాలు విధించేందుకు ట్రంప్ నిర్ణయించిన విషయం తెలిసిందే. భారత్‌తో వాణిజ్య బంధానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ఆ దేశంతో సంబంధాలను పెంచుకోవాలని ఆమె తెలిపారు. ఆసియాలో చైనా ఆధిపత్యాన్ని ఢీకొడుతున్న భారత్‌పై ఆంక్షలు విధించడం వ్యూహాత్మక తప్పిదం అవుతుందని ఆమె అన్నారు. చైనాతో వాణిజ్య బంధాన్ని తెంపుకున్న సమయంలో.. అమెరికాకు ఇండియా కీలకం అవుతుందన్నారు




# ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

అటు ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును ఆమోదించిన తర్వాత రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడింది. లోక్‌సభ వర్షాకాల సమావేశాల ముగింపు సందర్భంగా నినాదాలు, తగువులు, ప్లకార్డులు ప్రదర్శించడం వంటివి పార్లమెంట్ గౌరవానికి విఘాతం కలిగిస్తున్నాయని స్పీకర్ ఓం బిర్లా విచారం వ్యక్తం చేశారు. సభ్యులంతా మర్యాద, శాంతి, గౌరవం పాటించాలని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రతిపక్ష ఎంపీల ప్రవర్తన పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. సభా కార్యకలాపాలకు పదే పదే అంతరాయం కలిగించారని విచారం వ్యక్తం చేశారు. దాదాపు నెల రోజుల పాటు జరిగిన ఈ సమావేశాల్లో పెద్దగా చర్చ జరగలేదని, దీనిపై అందరూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మరోవైపు ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. బుధవారం లోక్‌సభలో ఈ బిల్లు ఆమోదం పొందగా గురువారం రాజ్యసభలో ఆమోదం లభించింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ రాజ్యసభలో ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు–2025ను ప్రవేశపెట్టారు. విపక్ష సభ్యుల నిరసనల మధ్య ఎటువంటి చర్చ జరగకుండానే మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదించారు. ఈ బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం లభిస్తే బిల్లు చట్టరూపం దాల్చనుంది. జులై 21 నుంచి ప్రారంభమైన వర్షాకాల సమావేశాలు గురువారంతో ముగిశాయి. ఈ సమావేశాల్లో కేంద్రం ప్రవేశపెట్టిన 14 బిల్లుల్లో 12 బిల్లులకు లోకసభ ఆమోదం తెలిపింది. ఆపరేషన్ సిందూర్‌పై అత్యధికంగా 37 గంటలపాటు జూలై 28, 29 తేదీల్లో ప్రత్యేక చర్చ నడిచింది. ఆగస్టు 18న భారత అంతరిక్ష కార్యక్రమ విజయాలపై కూడా ప్రత్యేక చర్చ మొదలైనా ప్రతిపక్ష ఎంపీల నిరసనల కారణంగా చర్చ పూర్తికాలేదు. ఈ సమావేశాల్లో చర్చించాల్సిన జాబితాలో 419 ప్రశ్నలు ఉన్నా, కేవలం 55 ప్రశ్నలపై మాత్రమే చర్చ జరిగింది. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై (%ా×=%) చర్చ చేపట్టాలంటూ ప్రతిపక్షాలు సభ మొదలైన నాటి నుంచి రోజూ కార్యకలాపాలకు అంతరాయం కలిగించాయి. మరోవైపు ప్రతిపక్షాల నిరసనల మధ్యే కేంద్రం 14 బిల్లులను సభలో ప్రవేశపెట్టగా అందులో 12 బిల్లులకు ఆమోదం తెలిపింది.

## నేపాల్ కొత్త పల్లవి

**లిపులేఖ్ ప్రాంతం తమదే అంటూ వాదన**

**తిప్పికొట్టిన భారత విదేశాంగ శాఖ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** లిపులేఖ్ ప్రాంతపై నేపాల్ అభ్యంతరం తెలపడంతో పాటు, ఇది తమ భూభాగమంటూ కొత్త వాదనను తెరపైకి తెచ్చింది. అయితే భారత విదేశాంగ శాఖ దీనిని తిప్పికొట్టింది. ఈ వాదనలో నిజలం లేదని తెలిపింది. భారత్–చైనాల మధ్య వివాదాలు పరిష్కరించుకునే దిశగా ఇరుదేశాలు అడుగులు వేస్తున్న క్రమంలో లిపులేఖ్ ప్రాంతం మీదుగా వాణిజ్య సరిహద్దులను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించుకున్నాయి. దీనిపై నేపాల్ అభ్యంతరం తెలిపింది. కాగా, భారత విదేశాంగ శాఖ దీనిపై స్పందిస్తూ ఈవిషయంలో నేపాల్ వాదనలు అసమగ్రంగా ఉన్నాయని స్పష్టంచేసింది. మహాకాళి నదికి తూర్పున ఉన్న లింపియాధుర, లిపులేఖ్, కాలాపానీలు తమ దేశంలో భాగమని నేపాల్ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లోక్ బహదూర్ ఛెత్రి పేర్కొన్నారు. తమ మ్యాప్‌లోను ఇదే స్పష్టమవుతుందని వాదించారు. ఇప్పటికే ఈవిషయాన్ని చైనా ప్రభుత్వానికి కూడా తెలియజేశామన్నారు. భారత్– నేపాల్‌ల మధ్య ఉన్న సరిహద్దు సమస్యను దౌత్యపరమైన చర్చలతో పరిష్కరించుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నేపాల్ వాదనలపై భారత విదేశాంగ శాఖ ప్రతినిధి జైశ్వాల్ తీవ్రంగా స్పందించారు. 'లిపులేఖ్ ద్వారా భారత్– చైనాల మధ్య సరిహద్దు వాణిజ్యం తిరిగి ప్రారంభించడంపై నేపాల్ అభ్యంతరం చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈవిషయంలో మా వైఖరి స్థిరంగా, చాలా స్పష్టంగా ఉంది. లిపులేఖ్ ద్వారా మా వాణిజ్యం 1954లో ప్రారంభమై.. కొన్ని దశాబ్దాల పాటు– సాగింది. ఆ తర్వాత పలు కారణాల వల్ల ఇటీ–వల దానికి అంతరాయం కలిగింది. ఇప్పుడు తిరిగి దాన్ని ప్రారంభించాలని ఇరుదేశాలు నిర్ణయించుకున్నాయి' అని పేర్కొన్నారు. నేపాల్ ప్రాదేశిక వాదనలను సమర్థించలేమన్నారు. దాని వాదనలపై ఎలాంటి చరిత్రాత్మక ఆధారాలు లేవన్నారు. కృత్రిమంగా చేపట్టిన సరిహద్దు మార్పులను తాము అంగీకరించబోమని ఉద్ఘాటించారు. ఈ సమస్యను దౌత్యపరమైన చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టంచేశారు. వివాదాల పరిష్కారం కోసం చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీ భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌లతో భేటీ– అయ్యారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్చలు జరిపారు. అనంతరం లిపులేఖ్, షిప్కి లా, నాథు లా మార్గాల ద్వారా వాణిజ్యాన్ని తిరిగి ప్రారంభించాలని, ఇందుకు ఇరుదేశాలు అంగీకరించాయంటూ ఓ ఉమ్మడి ప్రకటనను విడుదల చేశారు. లిపులేఖ్, కాలాపానీ, లింపుయాదురా ప్రాంతాలను తమ భూభాగాలుగా పేర్కొంటూ నేపాల్ 2020లో సరికొత్త మ్యాప్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. నాటి కేపీ శర్మ వోలీ ప్రభుత్వం దీనిపై తీర్మానం చేయడంతో పాటు–.. పార్లమెంటులో ఆమోదముద్ర కూడా వేసింది. అయితే భారత్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ.. నేపాల్ వాటిని బేఖాతరు చేసింది.



## ప్రపంచ ఇంధన మార్కెట్‌ను స్థిరీకరిస్తున్నాం

ఇందులో భాగంగా భారత్‌లోని కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించిన ఆయన.. తద్వారా వ్యాపారాన్ని మరింత విస్తృత పరచుకోవాలని పిలుపునిచ్చారు. రష్యా నుంచి చమురు కొనుగోలు ఆపాలని అమెరికా ఒత్తిడి తెస్తున్న వేళ ఈ కీలక పర్యటన చేపట్టిన జైశంకర్.. ఇరుదేశాలు సృజనాత్మకంగా ముందుకు సాగాలన్నారు. రష్యా నుంచి పెద్దఎత్తున చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్‌పై సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రష్యా నుంచి చమురు కొనుగోళ్ల వ్యవహారంలో అగ్రరాజ్యం చేస్తున్న వాదనలపై విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఇంధన మార్కెట్‌ను స్థిరీకరించేందుకు రష్యా నుంచి చమురు కొనుగోలు సహా అన్ని చర్యలు తీసుకోవాలని అమెరికా కొన్నేళ్లుగా చెబుతున్నట్లు– గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో అగ్రరాజ్యం వాదనల వెనుక ఉన్న లాజిక్ విషయంలో గందరగోళంగా ఉన్నట్లు– చెప్పారు. రష్యా చమురును భారీగా కొనుగోలు చేస్తున్న దేశం భారత్ కాదు. చైనా ఆ పని చేస్తోంది. అదేవిధంగా ఎల్ఎన్‌జీని కూడా మేం ఎక్కువగా కొనుగోలు చేయడం లేదు. ఐరోపా సమాఖ్య పెద్దమొత్తంలో దిగుమతి చేసుకుంటోంది. 2022 తర్వాత రష్యాతో అత్యధిక వాణిజ్య వృద్ధి నమోదైన దేశం కూడా భారత్ కాదు. కొన్ని దక్షిణ దేశాలు ఈ జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు.

### భారత్‌లో పెట్టుబడులు పెట్టండి

భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని రష్యా కంపెనీలకు భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ ఆహ్వానం పలికారు. తద్వారా వ్యాపారాన్ని మరింత విస్తృత పరుచుకోవాలన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళు నిలిపేయాలని.. లేదంటే అధిక పన్నులు విధిస్తామని భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు దిగుతున్న నేపథ్యంలో జయశంకర్ రష్యా పర్యటన కొనసాగుతోంది. రష్యాలో పర్యటిస్తున్న జైశంకర్.. రష్యా ఫస్ట్ డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్ డెనిస్ మంటురోవ్‌తో భేటీ అయ్యారు. వాణిజ్యం, ఆర్థిక, సాంకేతిక, సాంస్కృతిక అంశాలపై చర్చలు జరిపారు. భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు రష్యా, భారత్‌లు కొత్త మార్గాలు అన్వేషించాలని ఈ సందర్భంగా జయశంకర్ పిలుపునిచ్చారు. ఇరుదేశాలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత విస్తరించుకోవడంతోపాటు వివిధ అంశాల్లో సహకరించుకోవాలని జైశంకర్ అన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థ అని చెప్పిన జయశంకర్.. మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలతో విదేశీ వాణిజ్యానికి భారత్ కొత్త ద్వారాలు తెరిచిందన్నారు. భారత్‌లో రష్యా కంపెనీల వ్యాపార విస్తరణకు ఇది మరింత దోహదం చేస్తుందన్నారు. కాగా, ఈ ఏడాది చివరన భారత్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్ పర్యటించనున్నారు.

## మూసీ ప్రక్షాళన పక్కా దోపిడీయే..

**సుందరీకరణ పేరుతో భారీగా దోచుకునేందుకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం:కేటీఆర్**

**హైదరాబాద్(జనంసాక్షి):** మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకోవడానికి సిద్ధమవుతోందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం మూసీ అభివృద్ధి కోసం అన్ని ఏర్పాట్లు చేసి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అంచనాలను భారీగా పెంచి దోపిడీకి తెరలేపిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా గోదావరి నీటిని హైదరాబాద్‌కు దగ్గరలోని కొండపోచమ్మ సాగర్‌కు గత ప్రభుత్వం తీసుకొచ్చిందన్న ఆయన.. అక్కడి నుంచి గండిపేట చెరువుకు తరలించడానికి 2022లోనే రూ.1,100 కోట్లతో ఆమోదం తెలిపినట్టు గుర్తు చేశారు. మూసీలోకి చేరే 2000 ఎంఎల్డీ మురుగునీటి శుద్ధి కోసం 36 ఎస్టీపీల నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు.

## నాపై కుట్రలు కొనసాగుతున్నాయి

**కుట్రదారులే వేధింపులకు గురి చేస్తే ఎలా?: సింగరేణి కార్మికులకు కవిత బహిరంగ లేఖ**

**హైదరాబాద్(జనంసాక్షి):** సింగరేణి కార్మికుల కోసం పోరాడుతుంటే నాపై కుట్ర పన్నుతున్నారని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. భారత రాష్ట్ర సమితిలో జరుగుతున్న పరిణామాలు అందరికీ తెలుసు. నా తండ్రికి రాసిన లేఖను నేను అమెరికా వెళ్లినప్పుడు లీక్ చేశారు. నాపై కుట్రలకు పాల్పడుతున్న వారిని బయటపెట్టాలని కోరితే.. నాపైనే కక్షకట్టారు. ఆ కుట్రదారులే నన్ను వివిధ రూపాల్లో వేధింపులకు గురి చేస్తున్నారు. నేను అమెరికాలో ఉన్న సమయంలోనే గౌరవ అధ్యక్ష ఎన్నిక జరిగింది. చట్టవిరుద్ధంగా టీ–వీజీకేఎస్ సమావేశం నిర్వహించి ఎన్నుకున్నారని కవిత తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న కవిత ఈ మేరకు సింగరేణి బొగ్గు గని కార్మికులకు బహిరంగ లేఖ రాశారు. టీ–వీజీకేఎస్ గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన కొప్పుల ఈశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల చట్టాలకు విరుద్ధంగా పార్టీ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారన్నారు. రాజకీయ కారణాలతోనే ఈ ఎన్నిక జరిగిందని అన్నారు

# నోటిఫికేషన్ వేశారు ఎగ్జామ్ పెట్టడం మరిచారు

- సింగరేణిలో అంతర్గత జూనియర్ అసిస్టెంట్ ఎగ్జామ్ ఎప్పుడు?
- ఎగ్జామ్ ఏప్పుడా అని వేయికళ్లతో ఎదురు చేస్తున్న సింగరేణి కార్మికులు
- సింగరేణి అత్యున్నత అధికారి సిఎండి దృష్టికి తీసుకెళ్లిన ఫలితం శూన్యం
- ఏ ఒక్క కార్మిక సంఘం కూడా పట్టించుకోవట్లేదు



**భూపాలపల్లి, ఆగస్టు 21 (జనం సాక్షి):** సింగరేణిలో అంతర్గత జూనియర్ అసిస్టెంట్‌ల కోసం నోటిఫికేషన్ వేశారు ఎగ్జామ్ పెట్టడం మరిచారు. సింగరేణి వ్యాప్తంగా ఇంటర్నల్ జూనియర్ అసిస్టెంట్ ఎగ్జామ్స్ ఏప్పుడా అని వేయి కళ్ళతో సింగరేణి కార్మికులు ఎదురుచూస్తున్నారు. యజమాన్యం గానీ, కార్మిక సంఘాలు గానీ పట్టించుకోవడం లేదు.

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 360 జూనియర్ అసిస్టెంట్ అంతర్గత పోస్టులకు 2024 మార్చి నెలలో నోటిఫికేషన్ విడుదల చేయగా దానికి దాదాపు గా 7000 మంది కార్మికులు ఆన్లైన్లో అప్లై చేసుకున్నట్టు సమాచారం.

అప్లై చేసుకున్న నాటి నుండి నేటి వరకు ఎగ్జామ్ పై ఎలాంటి ఖచ్చితమైన సమాచారం లేదు , విడుదల చేసి సంవత్సరం పైన అవుతున్నప్పటికీ ఎగ్జామ్ నిర్వహించకుండా కాలయాపన చేస్తూ ఎగ్జామ్ కోసం ఎదురుచూస్తున్న కార్మికుల ఆశలకు గండి కొడుతున్నారు అసలు నిర్వహిస్తారా నిర్వహించరా ! అనే పలు అనుమానాలు కార్మికులు వ్యక్తం చేస్తున్నారు, ఇది ఇలా ఉండగానే మళ్ళీ ఈ పోస్టుల్లో కొన్ని వికలాంగుల కోసం కేటాయిస్తూ నోటిఫికేషన్ 2025 ఫిబ్రవరి నెలలో నోటిఫికేషన్ విడుదల చేసి అప్లికేషన్ ప్రాసెస్ కూడా పూర్తి చేశారు.

**సీఎండీ దృష్టికి తీసుకెళ్లి 6 నెలలు**

ఈ విషయంపై కార్మికులు సింగరేణి సీ ఎం డి కార్మికుల చైతన్య యాత్ర లో భాగంగా ఫిబ్రవరి నెలలో అన్ని ఏరియాలలో పర్యటించిన సందర్భంలో గనుల మీద పర్యటించినప్పుడు ప్రతి ఏరియాలో , ప్రతి గని నందు జూనియర్ అసిస్టెంట్ ఎగ్జామ్ ఎప్పుడు నిర్వహిస్తారు అని కార్మికులు వారి అడగడం జరిగింది. ఆ సమయంలో సీఎండీ తొందరలో నిర్వహిస్తామని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సింగరేణి కార్మికులు ఎక్కడ నలుగురు కలిసినా ఎగ్జామ్ ఎప్పుడు నిర్వహిస్తారని మాటనే వస్తుంది. సింగరేణి అత్యున్నత అధికారైన సిఎండి దృష్టికి తీసుకెళ్లి దాదాపుగా 6 నెలలు దాటినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో కార్మికులు నిరుత్సాహంలో ఉన్నారు.

**నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న సింగరేణి యాజమాన్యం**

ఈ విషయంలో సింగరేణి యాజమాన్యం ఎందుకు జాప్యం చేస్తుందో అర్థం కావటం లేదని అప్లై చేసుకున్న ఉద్యోగులు వారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . ఈ నోటిఫికేషన్ తర్వాత విడుదలైన అంతర్గత జె ఎం ఈ టి, ఎం జి టి తదితర ఎగ్జామ్స్ నిర్వహించి వాటి ఫలితాలు కూడా విడుదల చేసి పూర్తి సెలక్షన్ ప్రాసెస్ ముగిసిపోయి వారు వారి హెూదాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై సింగరేణి యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని కార్మికులు గుసగుసలాడుతున్నారు.

**ఏ ఒక్క సంఘం కూడా పట్టించుకోవట్లేదు**

సింగరేణి కార్మిక సంఘాల్లో ఏ ఒక్క సంఘం కూడా ఈ విషయాలపై యజమాన్యాన్ని నిలదీయడం లేదు. నిర్వహించడంలో ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించే దిశగా ఎప్పుడు ప్రశ్నించకపోవడం కనీసం నిర్వహించబోవడానికి సరియైన కారణాలు కూడా వెల్లడించకపోవడం కార్మికులను భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా కార్మిక సంఘాలు ఈ విషయంపై నిలదీయాలని కార్మికుల కోరుకుంటున్నారు. సింగరేణి యాజమాన్యం త్వరలో నిర్ణయం తీసుకొని ఎగ్జామ్ నిర్వహించాలని కోరుచున్నారు..

# కాంగ్రెస్ పార్టీలో విభేదాలు సాధారణం

- మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, ఆగస్టు21 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు సర్వసాధారణమని పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సాధారణ వర్గ విభేదాలను ప్రతిపక్షలు తప్పుడు కోణంలో చూస్తూ.. తప్పడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఏ పార్టీలో అయిన వర్గ విభేదాలు ఉంటాయని, సమయాన్ని బట్టి అవి బయటకు వస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె గురువారం మాట్లాడారు. వరంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ ముంపునకు గురవుతుండడానికి నాలాల ఆక్రమణే కారణమని గుర్తించినట్లు పేర్కొన్నారు. వాటికి సంబంధించి సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వరంగల్‌ను ముంపు ప్రాంతాలు లేని నగరంగా మార్చుతామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం నివేదికతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమాలు బట్టబయలయ్యాయని మంత్రి సురేఖ విమర్శించారు. నివేదికలో మాజీ సీఎం కేసీఆరే.. ప్రధాన సూత్రధారిగా తేలిందని ఆరోపించారు. నివేదికలో నిజాలు బయటపడ్డ బీఆర్ఎస్ నేతలు ప్రజలకు కళ్ళబుల్లి మాటలు చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు రాష్ట్ర ప్రజలకు విష ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు ఉన్న కేంద్రం నుంచి యూరియా తేలేకపోయారని విమర్శించారు. తెలంగాణలో మోదీ భజన చేయడంలో ఉన్న శ్రద్ధ వారికి రైతుల మీద లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీపై ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు తమ వైపే ఉన్నారని కొండా సురేఖ స్పష్టం చేశారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు చోరీ ఉద్యమానికి భారీ స్పందన వస్తోందని తెలిపారు. దొంగ ఓట్లతోనే అన్ని రాష్ట్రాల్లో బీజేపీ గెలుస్తోందని ఆరోపించారు. ప్రధాని మోదీకి మొదటి నుంచి తెలంగాణ అంటే ఇష్టం లేదని.. అందుకోసమే రాష్ట్రానికి యూరియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. యూరియా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# జులాయిగా మారి.. బెట్టింగ్ ఆడుతూ..

**తండ్రిని హత్య చేసిన కొడుకు**




**వనపర్తి, ఆగస్టు21 (జనంసాక్షి) :** కొందరు బెట్టింగ్‌కు అలవాటుపడి ఎంతటి దారుణాలకైనా తెగబడుతున్నారు. ఈక్రమంలో బెట్టింగ్ ఆడవద్దని చెప్పినందుకు తండ్రిని హత్యచేశాడు ఓ కొడుకు. వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లాలోని ఘన్‌పూర్ మండలం కోతులకుంట తండాకు చెందిన కేతావత్ హనుమంతు(37)కు భార్య, ఇద్దరు కొడుకులు రవీందర్(19), సంతోష్ ఉన్నారు. వీరు జీవనోపాధి కోసం గచ్చిబౌలిలోని ఎన్టీఆర్‌నగర్‌కు వలస వచ్చి జీవిస్తున్నారు. హనుమంతు మేస్త్రీగా పని చేస్తుండగా, పెద్ద కొడుకు రవీందర్ ఇంటర్ పూర్తి చేసి జులాయిలా తిరుగుతూ, బెట్టింగ్ ఆడుతూ డబ్బులు పోగొట్టుకున్నాడు. ఇటీవల అప్పులు పెరిగిపోవడం, కుమారుడి ఉన్నత విద్యకు డబ్బుల్లేక హనుమంతు సొంతూరులోని భూమి తాకట్టు పెట్టి రూ.6 లక్షలు తెచ్చాడు. ఈ డబ్బులపై కన్నేసిన రవీందర్ బ్యాంకులో వేస్తే భద్రంగా ఉంటుందని తన అకౌంట్‌లో రూ.2.5 లక్షలు జమ చేయించుకున్నాడు. ఈ డబ్బులను బెట్టింగ్ యాప్‌లో పెట్టి మొత్తం పోగొట్టుకున్నాడు. అకౌంట్‌లో ఉన్న డబ్బులు విత్ డ్రా చేద్దామని తండ్రి అడగ్గా స్నేహితుడికి ఇచ్చానని, త్వరలోనే ఇస్తాడని నమ్మించాడు. ఈ విషయంలో, అలానే బెట్టింగ్ ఆపాలని తండ్రి హనుమంతు, కొడుకు మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో తండ్రిపై కక్ష పెంచుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం తండ్రి డబ్బుల గురించి నిలదీయగా స్నేహితుడు ఇచ్చేందుకు వస్తున్నాడంటూ ఎన్టీఆర్ నగర్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు.తన స్నేహితుడు డబ్బులతో పాటు సర్‌ప్రైజ్ ఇస్తాడని చెప్పి తండ్రి కళ్లకు రవీందర్ గంతలు కట్టి మాటల్లో పెట్టి అప్పటికే తెచ్చుకున్న కత్తితో తండ్రి గొంతులో పొడిచాడు. తీవ్ర రక్తస్రావమై తండ్రి అక్కడికక్కడే కుప్పకూలి మరణించాడు.

# నేడు బీహార్, బెంగాల్లో మోడీ పర్యటన

**రెండు రాష్ట్రాల్లో 18 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం**



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21 (జనంసాక్షి) :** భారత ప్రధాని నరేంద్ర మోదీ బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో శుక్రవారం పర్యటించనున్నారు. పర్యటన సందర్భంగా రెండు రాష్ట్రాల్లో 18 వేల కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించ నున్నారు. బీహార్‌లో 13 వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులను, పశ్చిమ బెంగాల్‌లో 5,200 కోట్ల రూపాయల ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. బీహార్ పర్యటన సందర్భంగా రెండు రైళ్లను ప్రారంభిస్తారు. గయ, ఢిల్లీల మధ్య తిరిగే అమ్రిత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును.. వైశాలి, కోధర్మల మధ్య తిరిగే బుద్ధిస్ట్ సర్క్యూట్ ట్రైన్‌ను మోదీ ప్రారంభిస్తారు. అంతేకాకుండా ఎన్‌హెచ్ 31పై 8.15 కిలోమీటర్ల పొడవైన ఆంటా - సిమారియా బ్రిడ్జిని, గంగానదిపై 1.86 కిలోమీటర్ల ఆరు లైన్ల బ్రిడ్జిని కూడా ఆయన ప్రారంభిస్తారు. గంగానదిపై ఆరు లైన్ల బ్రిడ్జి కారణంగా మొకామా నుంచి బెగుసరాయ్‌కి డైరెక్ట్ కనెక్టివిటీ- ఏర్పడనుంది. ఈ బ్రిడ్జీల నిర్మాణం కోసం ప్రభుత్వం ఏకంగా 13వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు బీహార్ ప్రభుత్వం చెబుతోంది.'ఈ బ్రిడ్జి కారణంగా ఆ ఏరియాల్లో ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుంది. ఉత్తర బీహార్ అభివృద్ధి చెందుతుంది. ఇక్కడి వారు ముడి సరుకుల కోసం ఇతర అవసరాల కోసం జార్ఖండ్, దక్షిణ బీహార్ మీద ఎక్కువగా ఆధారపడుతున్నారు. వారికి చాలా మేలు జరుగుతుందని ఓ ప్రకటనలో ప్రభుత్వం తెలిపింది. ఇక, పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా నిర్మితమైన మెట్రో ట్రైన్ సర్వీసులను ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 4.15 గంటలకు మెట్రో సర్వీసును ప్రారంభిస్తారు. అంతేకాదు.. జెస్సోర్ రోడ్ నుంచి జై హింద్ భీమన్బందర్ ఎయిర్ పోర్టు వరకు మెట్రో రైలులో ప్రయాణిస్తారు.



# లొంగిపోయిన మావో అగ్రనేతలు



**హైదరాబాద్, ఆగస్ట్21 (జనంసాక్షి) :** మావోయిస్ట్ అగ్రనేతలు లొంగిపోయారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఎదుట ఇద్దరు సెంట్రల్ కమిటీ- మావోయిస్టు సభ్యులు లొంగిపోయారు. మావోయిస్టు సీనియర్ స్టేట్ కమిటీ- సభ్యురాలు కాకరాల సునీత సీపీ ఎదుట లొంగిపోయారు. ఆమె తండ్రి, ఒక విప్లవ రచయితల సంఘం నాయకుడిగా పని చేసినట్లు- పోలీసులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలును సీపీ వెల్లడించారు. వరవరరావు, గద్దర్ లాంటి విప్లవకారులు వారి ఇంటికి వస్తుండటంతో సునీత మావోయిస్టుల సిద్ధాంతాల వైపు మొగ్గు చూపారు. ఆమె 1986లో పీపుల్స్ వార్ పార్టీలో ఉన్నారు. 1986 ఆగస్టులో టీ-ఎల్ఎన్ చలం గౌతమ్ అలియాస్ సుధాకర్‌ను వివాహం చేసుకున్నారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో సెంట్రల్ ఆర్గనైజర్‌గా పనిచేశారు. 1992లో నల్లమల అడవుల్లోకి వెళ్లారు. 2001లో ఏవోబీ ప్రాంతానికి, 2006లో దండకారణ్యానికి బదిలీ అయ్యారు. చెన్నూరి హరీశ్ అలియాస్ రమణ కూడా గురువారం లొంగిపోయారు. ఆయన పదో తరగతి చదువుతున్నప్పుడు ఏటూరునాగారం బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో మావోయిస్టు సిద్ధాంతానికి ఆకర్షితులయ్యారు. 2024లో ఏసీఎంగా పనిచేశారు. వీరిద్దరూ ఎన్నో ఎన్‌కౌంటర్లలో పాల్గొన్నారు. జనజీవన స్రవంతిలో పాల్గొనడం మంచి పరిణామం అని సీపీ తెలిపారు. మావోలు జనజీవితంలోకి రావాలని, హింసను వీడాలని అన్నారు.

# జాతీయ రహదారిపై ఎమ్మెల్యే అనుచరుల హల్‌చల్



**బెల్లంపల్లి, ఆగస్టు21 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని కెమికల్ ఏరియా జాతీయ రహదారిపై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పీఏలు, క్యాడర్ హల్‌చల్ చేశారు. బహిరంగంగా మద్యం సేవిస్తూ డ్యాన్సులు చేస్తూ, చిందులు వేస్తూ కేరింతలు కొట్టారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రభుత్వ పీఏ రామకృష్ణ, డ్రైవర్ మోసిన్, శేఖర్, పీఏ గడ్డం ప్రసాద్, రామకృష్ణ, ఎమ్మెల్యే సన్నిహితుడు రమేష్, యూత్ నాయకుడు శ్యామ్ రోడ్డుపై చిందులు వేశారు. అటువైపుగా వెళ్తున్న వాహన చోదకులు, ప్రజలు భయభ్రాంతులకు గురై ఇబ్బందులు పడ్డారు. నడిరోడ్డుపై మద్యం సేవిస్తూ డ్యాన్సులు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో చిందులు వేసిన ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున వైరల్ అవుతోంది. ఇతరులకు ఇబ్బందులు కలగకుండా జల్సాలు చేసుకోవాలి కానీ ఇలా బహిరంగంగా చిందులు వేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఒక్క ఏడాదిలోనే లక్ష ఫిర్యాదులు

**న్యూఢిల్లీ, ఆగస్టు21 (జనంసాక్షి) :** భారతీయ రైల్వేలో ప్రయాణికుల సమస్యలు ఇటీవలే కాలంలో సర్వసాధారణమైపోయాయి. రైళ్లలో అందించే ఫుడ్ నాణ్యతకు మొదలు, టాయిలెట్స్‌లో నీళ్ల కొరత వరకూ ఏటా పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతుంటాయి. అయితే, రైళ్లలోని టాయిలెట్స్, వాష్ బేసిన్‌లలో నీళ్లు రావట్లేదని 2022-23లో ఏకంగా లక్షకుపైగా ఫిర్యాదులు వచ్చినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక వెల్లడించింది. అందులో దాదాపు 34 శాతం కేసులు పరిష్కరించినట్లు పేర్కొంది. సుదూరం ప్రయాణించే రైళ్లలో పరిశుభ్రతకు సంబంధించి 2018-19 నుంచి 2022-23 వరకు భారతీయ రైల్వే పనితీరుపై కాగ్ నివేదిక రూపొందించింది. ఇందులో 2022-23 ఏడాదిలోనే రైళ్లలోని టాయిలెట్‌లు, వాష్ బేసిన్‌లలో నీళ్లు లేవట్లేదంటూ దాదాపు 1,00,280 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపింది. అందులో 33,937 కేసులను సకాలంలో పరిష్కరించినట్లు తెలిపింది. నిర్దేశిత స్టేషన్లలో నీరు నింపడంలో వైఫల్యం కారణంగానే ఈ సమస్య తలెత్తుతున్నట్లు కాగ్ తన నివేదికలో వెల్లడించింది. ఇందుకు సంబంధించిన నివేదికను కాగ్ పార్లమెంట్‌కు బుధవారం అందించింది.

# అదుపులోకి రాని బంగారం ధరలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్21 (జనంసాక్షి) :** దేశంలో బంగారం ధరలు దూసుకుపోతున్నాయి. పెరిగేప్పుడు తారాజువ్వలా పెరుగతూ..తగ్గినప్పుడు తాబేలు నడకలా తగ్గుతున్నాయి. మొత్తంగా ట్యాక్స్ తగ్గినప్పుడు అమాంతంగా తగ్గినట్లు తగ్గినా పెరుగుదల మాత్రం ఆగడం లేదు. దీంతో బంగారం సామాన్యులకు అందుబాటులో లేదనే చెప్పాలి. ఇప్పటికే 10 గ్రాముల 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. లక్ష దాటేసింది. అయితే గతకొన్ని రోజుల క్రితం తులం బంగారం ధర ఏకంగా రూ. 92-94 వేలమార్క్‌కు చేరువై దడ పుట్టిచ్చిన విషయం తెలిసిందే. ఒకానొక సమయంలో తులం బంగారం ధర రూ. లక్ష దాటడం ఖాయం అంటూ వార్తలు కూడా వచ్చాయి. అవే ఇప్పుడు నిజం అయ్యాయి. గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం, ప్రస్తుతం దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,00,140గా ఉంది. 22 క్యారెట్‌ల 10 గ్రాముల బంగారం ధర రూ. 91,790గా ఉంది. ఇక కిలో వెండి ధర రూ.1,14,900కు చేరుకుంది. 10 గ్రాముల ప్లాటినం ధర కూడా స్వల్పంగా తగ్గి రూ.37,220కు చేరుకుంది.

# కర్నాటకకు చెందిన కుటుంబం ఆత్మహత్య

**హైదరాబాద్, ఆగస్ట్21 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో దారుణం చోటు-చేసుకుంది. మియాపూర్‌లో ఐదుగురు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. అనుమానాస్పద స్థితిలో ఉన్న మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా స్థానికులు చెబుతున్నారు. ఆత్మహత్య చేసుకున్నట్లు- పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతులను కర్ణాటక గుల్బర్గా జిల్లా సేడం మండలం రంజోలికి చెందిన లక్ష్మయ్య (60), వెంకట(55), అనిల్ (32), కవిత (24)గా గుర్తించారు. వీరితోపాటు- ఓ రెండేళ్ల చిన్నారి కూడా మృతి చెందినట్లు- పోలీసులు చెబుతున్నారు. శవాలను స్వాధీనం చేసుకుని పోస్ట్ మార్టమ్‌కు పంపారు.

# లైంగిక వేధింపుల ఆరోపణల్లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి రాజీనామా

**తిరువనంతపురం, ఆగస్టు21 (జనంసాక్షి) :** మలయాళం ఫిల్మ్ ఇండస్ట్రీలో మహిళలపై లైంగిక వేధింపుల ఆరోపణలు మరోసారి కలకలం రేపాయి. ఓ యువ రాజకీయ నాయకుడు తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ నట, మాజీ జర్నలిస్ట్ రిని ఆన్ జార్జ్ ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే, ఆ నాయకుడు ఎవరన్నది ఆమె క్లారిటీ ఇవ్వలేదు. బీజేపీ మాత్రం ఆ యువ రాజకీయ నాయకుడు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే రాహుల్ మమ్కూతతిల్‌గా తెలిపింది. ఈ ఆరోపణలతో రాహుల్ కేరళ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామాపై ఎలాంటి ఒత్తిడీ లేదని, వ్యక్తిగత బాధ్యతగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

# అధికారులపై దాడి చేస్తే ఉపేక్షించొద్దు

**ఏపీ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్**



**హైదరాబాద్, ఆగస్టు21 (జనంసాక్షి) :** అధికారులపై దాడి చేసింది ఎవరైనా ఉపేక్షించవద్దని, కఠిన చర్యలు తీసుకోలని ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులపై దాడి చేసిన ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారని.. ఈ విషయం చాలా మంచిదేనని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులపైన దాడి చేస్తే కఠిన చర్యలు ఉంటాయనే మంచి సందేశాన్ని పవన్ కల్యాణ్ ఇచ్చారని చెప్పుకొచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే రాజాసింగ్ ఓ ప్రకటన విడుదల చేశారు శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని కాపాడే బాధ్యత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పైన కూడా ఉంటుందని సూచించారు. శ్రీశైలం జ్యోతిర్లింగాన్ని దర్శించుకోవడానికి యావత్ భారతదేశం నుంచి భక్తులు చాలామంది వస్తారని.. కానీ దురదృష్టం ఏంటంటే గతంలో రాజకీయ పార్టీల నేతలు కొన్ని పాపాలు అక్కడ చేశారని గుర్తుచేశారు. శ్రీశైలం చాలా పెద్ద పవిత్ర స్థలం, కానీ ఈ పవిత్ర స్థలాన్ని అపవిత్రం చేయడానికి కుట్రలు చాలా కాలంగా జరుగుతున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వాలు తమ ఓటు బ్యాంకును పెంచుకోవడానికి ముస్లింలను శ్రీశైలం పవిత్ర ప్రాంతంలో స్థిరపరిచాయని షాకింగ్ కామెంట్స్ చేశారు. మునుపటి పార్టీలు తమ ఓటు బ్యాంకును పెంచుకోవడానికి క్రైస్తవ కుటుంబాలను శ్రీశైలం పవిత్ర ప్రాంతంలో స్థిరపరిచాయని సంచలన వ్యాఖ్యులు చేశారు.

# కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు

**యూరియా కోసం రైతులకు అగచాట్లు : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**



**నల్లగొండ, ఆగస్టు21 (జనంసాక్షి):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన నాటి నుంచి రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దానిలో భాగంగానే ఇప్పుడు యూరియా కష్టాలు అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. రైతులు నిద్రాహారాలు మాని చెప్పులు పెట్టుకుని అవస్థలు పడుతున్నారని అన్నారు. నల్లగొండలోని బీఆరెస్ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎకరానికి రూ.20 వేల పెట్టుబడి పెడితే ఒక్క బస్తా యూరియా మీద దిగుబడి ఆధార పడి ఉంది. కానీ ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు. కెసిఆర్ వేసవిలోనే గోదాముల్లో ఎరువులు నిల్వ చేసి పెట్టేవారు. వ్యవసాయ రంగం పై రెగ్యులర్ రివ్యూ చేస్తూ రైతుల ఇబ్బందులు పడకుండ జాగ్రత్త పడేవాళ్లమని గుర్తు చేశారు. కనీసం సీజన్‌లో నాలుగు సార్లు రివ్యూ జరిగేది రైతులు విత్తనాల కోసం, ఎరువుల కోసం ఇబ్బందులు పడడం దారుణం. గతంలో ధాన్యం కొనుగోళ్లకు రైతులు ఇబ్బంది పడ్డారు. కరెంట్ కోసం ఇబ్బందులు మొదలయ్యాయి. యూరియా కొరత వెనక కొంతమంది మంత్రులు, అధికారులు ఉన్నారని ఆరోపించారు. కమీషన్ల కోసం రైతులను ఇబ్బంది పెడుతున్నారు. ఎరువులను బ్లాక్ మార్కెట్ చేసేందుకు కమీషన్లు తీసుకుంటున్నారని విమర్శించారు. గతంలో నల్లగొండ మంత్రి ధాన్యం కొనుగోళ్లలోను కమీషన్లు తీసుకుని రైతులను గాలికి వదిలేసారు. గతంలో మేము వస్తే అన్ని తెస్తామన్నారు. ఢిల్లీకి 56 సార్లు వెళ్లిన సీఎం కనీసం ఎరువులు తేలేవా? అని ప్రశ్నించారు. పోలీసులతో పహారా, లాఠీఛార్జ్ లతో రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. ఢిల్లీకి వెళ్లి కాళ్లు పట్టుకుని పదవులు తెచ్చుకునే కాంగ్రెస్ నేతలకు..రైతులను కాళ్లు పట్టుకునే దుస్థితికి తెచ్చారని ధ్వజమెత్తారు. నల్లగొండ నియోజక వర్గంలో మంత్రి పూర్తిగా విఫలం అయ్యారన్నారు.



# చదువుల కల్పతరువు కాకతీయ యూనివర్సిటీ

## విశ్వవిద్యాలయానికి 50 వసంతాలు వైభవం

*ఉత్తర తెలంగాణలో మొట్టమొదటి ఉన్నత విద్యా కేంద్రంగా 1976 ఆగస్టు 19న ప్రారంభమైన కాకతీయ విశ్వవిద్యాలయం ఆగస్టు 19, 2025 నాటికి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిల్వర్ జూబ్లీ పండుగ ఘనంగా జరుపుకున్నది. కాకతీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్ ఉస్మానియా తర్వాత తెలంగాణలో పెద్ద విశ్వవిద్యాలయంగా పేరు గడించింది. ప్రారంభం రోజులలో మానవీయ శాస్త్రాల(హ్యుమానిటీస్) భవనం, ప్రధాన పరిపాలన భవనం, ఫిజిక్స్ విభాగం భవనం మాత్రమే ఉండేవి. దినదిన అభివృద్ధి దిశలో పయనిస్తూ నేడు ఆర్ట్స్ సోషల్ సైన్స్ ,కామర్స్, సైన్స్, విద్యా విభాగం, క్రీడా విభాగం, ఇంజనీరింగ్ విభాగాలతో పాటు, భారతదేశంలోనే కాకతీయ విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలకు గొప్ప పేరు ఉంది. ఇంత పెద్ద చరిత్ర కలిగిన కాకతీయ విశ్వవిద్యాలయం ఒకప్పుడు 500 మంది ఆచార్యులతో కళకళలాడుతూ, ప్రతి విభాగంలో 35 మంది విద్యార్థులతో తరగతి గదులు ఉండేవి.*

ఒకప్పుడు కాకతీయ విశ్వవిద్యాలయం మార్క్స్ ఆలోచన విధానాల తో ఉండే అధ్యాపక బృందాలు ఉండేవి. భారతదేశంలోనే కాకతీయ విశ్వవిద్యాలయం అంటే అది ఒక మార్క్స్ విశ్వవిద్యాలయం అనే వారు. అంతటి ఆలోచనపరులు, మేధావి వర్గం ఉండేది. ప్రస్తుతం కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యాబోధనకు అధ్యాపకులు కరువైనారు. కేవలం 75 మంది శాశ్వత ప్రాతిపదికన పని చేసే అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. మిగతా బోధకులు అందరూ ఒప్పంద అధ్యాపకులుగా, రోజువారి అధ్యాపకులుగా పనిచేస్తున్న వారి. మారిన కాల పరిస్థితులకు అనుగుణంగా నేడు ఆధునిక విద్య బోధన కొనసాగించే దిశలో తరగతి గది సిద్ధంగా లేదు. ప్రస్తుత పరిస్థితులను విద్యార్థులకు పరిచయం చేయడానికి శాశ్వత ప్రాతిపదికన అధ్యాపక నియమాకం లేక తరగతి గది విలవిల పోతుంది. 640 ఎకరాలలో విస్తరించిన కాకతీయ విశ్వవిద్యాలయం ఎర్రటి మట్టి వాసన ఉద్యమ స్ఫూర్తి కి నుదుటి సింధూరం గా ప్రతి విద్యార్థికి ఉపయోగపడింది.

ఈ గడ్డమీద చదువుకున్న విద్యార్థులు నేడు ప్రపంచ స్థాయిలో ఉన్నతమైన ఉద్యోగస్తులుగా పనిచేస్తున్నట్లు గర్వంగా చెప్పుకోవచ్చు. 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కాకతీయ విశ్వవిద్యాలయం నేడు అనేక ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయి. ముఖ్యంగా నిధుల లేమితో అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నది వాస్తవం. నేడు కేవలం కాకతీయ విశ్వవిద్యాలయమే కాకుండా దేశంలోని విశ్వవిద్యాలయాల పరిస్థితులు ఈ విధంగానే ఉన్నాయని చెప్పవచ్చు. ఒకప్పటి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు జి సి) అందించిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వము నుండి రావలసిన బ్లాక్ గ్రాంట్ ఎప్పటికప్పుడు అందుతుండేవి. ఆర్ట్స్ సోషల్ సైన్స్ కామర్స్ సైన్స్ ఫార్మసీ ఇంజనీరింగ్ వడ్డీ ప్రతిష్టాత్మకమైన కోర్సులు ఎన్ని ఉన్నప్పటికీ బోధన అధ్యాపకులు లేకపోవడం, అంతేకాకుండా పరిశోధన రంగం పూర్తిగా లేకుండా పోయింది. సైన్స్ విభాగాలలో ల్యాబ్లో పరిశోధన చేయడానికి కెమికల్స్ కొనుగోలు చేయడానికి నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న పరిశోధకులు నేడు మనకు కనబడుతున్నారు. ఎంతో గొప్ప చరిత్ర కలిగిన కాకతీయ విశ్వవిద్యాలయం నేడు నెట్టుకు రావడమే తప్ప ఆధునిక శాస్త్రీయ పరిశోధన విధానం, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యా బోధనలో నూతన పోకడలు తీసుకురావలసిన పరిస్థితులు నేటి తరానికి అవసరం. ప్రస్తుత సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనే దిశగా విశ్వవిద్యాలయాలు వేదికలుగా నిలువాల్సిన పరిస్థితులు ఉన్నప్పటికీ. కేవలం తూతూ మంత్రంగా సభలు సమావేశాలు వేదికలు నిర్వహించి చేతులు దులుపుకోవడమే జరుగుతుంది. సమర్థవంతమైన పరిపాలన వ్యవస్థ ఉన్నప్పటికీ, పిండి కొద్ది రొట్టె అన్నట్లుగా ఏమి అభివృద్ధి చేయాలన్న, ఆధునిక విద్యా విధానాన్ని రూపకల్పన చేపట్టాలన్న ఆర్థిక సహాయం లేకుండా పోయింది. ప్రతి సంవత్సరం పెరుగుతున్న విద్యార్థులకు అనుగుణంగా విద్యార్థులకు ఆస్తులు వసతి కల్పించాల్సిన పరిస్థితులు ప్రతి విశ్వవిద్యాలయంలో ఉంది, ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థికి బాధ్యతాయుతంగా అన్ని రకాల వసతులు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత పరిపాలకులదే. అయితే నిధుల లేమితో ఆశించిన స్థాయిలో హాస్టల్స్ నిర్మాణం లేకుండా పోయింది. ఒకప్పుడు పోతన హాస్టల్, ప్రతాపరుద్ర హాస్టల్, మహిళలకు ప్రత్యేకమైన ఒక హాస్టల్ మాత్రమే ఉండేది . అయితే నేడు పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) చదువుకోవడానికి పురుషుల కంటే, మహిళా విద్యార్థులు ఎక్కువగా ముందుకు వస్తున్నారు. వీరికి కావలసిన వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది. ఉన్నదాంట్లో సర్ది పెట్టుకోవలసిన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వ రంగ విశ్వవిద్యాలయాలు కేవలం రాష్ట్రంలో 11 మాత్రమే ఉన్నాయి. ఒకప్పుడు ప్రైవేటు విశ్వవిద్యాలయం అనే పేరు కూడా వినపడేది కాదు. నేడు ప్రైవేటు విశ్వవిద్యాలయాల పేర్లు ఎక్కువగా వినపడుతున్నాయి. ప్రభుత్వ రంగ విశ్వవిద్యాలయాల పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. ఒకప్పటి కాకతీయ విశ్వవిద్యాలయ పూర్వ వైభవ పరిస్థితులు ఇకముందు రావాలంటే సాధ్యం కాని పని అయినప్పటికీ. గుడ్డిలో మెల్లగా! అన్నట్లుగా పరిస్థితులను చక్కదిత్తే విధానాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవలసిన పరిస్థితులు ఉన్నాయి. ఎంతో ఆశతో విశ్వవిద్యాలయాలలో అడుగులు పెడుతున్న ఎంతోమంది మేధావి వర్గం తిరిగి నిరాశాన్ని స్పృహలతో వెనుతిరిగి పోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. చదువుకు తగ్గ ఉపాధి దొరకడం లేదన్న విద్యార్థులలో నెలకొన్న అసంతృప్తి కట్టలు తెచ్చుకుంటుంది. కాకతీయ విశ్వవిద్యాలయం అంటేనే ఒకప్పుడు రోమాలు నిక్కపొడుచుకునేవి. నేడు ఆ పరిస్థితి లేదు. దీనికి కారణం గత పది సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలించిన పాలకులు ఇందుకు కారణం. తెలంగాణ మలిదశ ఉద్యమం 2001 ఏప్రిల్ 27న ప్రారంభమైంది. నాటినుండి తెలంగాణ సాధించేవరకు ముందుండి కొట్లాడిన తెలంగాణ విద్యార్థులు నీళ్లు, నిధులు, నియమాకాలు సాధించే దిశగా అడుగులు వేసి తెలంగాణ సాధిస్తే తమ బతుకులు బాగుపడతాయి అన్న ఆశతో ప్రాణార్పణ చేసి ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణ ఎవరి పాలు అయింది. ఎవరు పరిపాలించారు? ఎవరి పాలనలో విశ్వవిద్యాలయాలు సర్వనాశనం అయినాయి? అన్న ప్రశ్నలు మనం ముందు వేలాడుతున్నాయి. సాధించుకున్న తెలంగాణ తెచ్చుకున్నది ఎందుకు? ఉద్యోగాలు వచ్చాయా! నిధులు వచ్చాయా! నీళ్లు వచ్చాయా? అన్న ప్రశ్నలే తప్ప మన ముందు ఏమి కనబడదు.

3. కేయూ అని ముద్దుగా పిలుచుకునే కాకతీయ విశ్వవిద్యాలయాన్ని ఎంతోమంది సమర్థవంతమైన ఉపకులపతుల పరిపాలనలో దినదిన అభివృద్ధి చెందుతూ వచ్చిందని చెప్పుకోవాలి. ప్రస్తుతం కాకతీయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం సమర్థవంతమైన పరిపాలనలో ఇటీవల 23వ స్నాతకోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతేకాకుండా సర్వోత్సవాలలో భాగంగా తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ కాంగ్రెస్ మూడు రోజుల సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత దేశ రక్షణ శాఖ పూర్వ సంచాలకులు డాక్టర్ సతీష్ రెడ్డి, తోపాటు సీసీఎంబి పూర్వ సంచాలకు లు డాక్టర్. మోహన్ రావు, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య. బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఇంతటి గొప్ప సైన్స్ కాంగ్రెస్కు ఆదిత్యం ఇస్తున్న కాకతీయ విశ్వవిద్యాలయం ఈ మూడు రోజులు సరోత్సవాల పండుగను ఘనంగా నిర్వహించుకోవడం పూర్వ విద్యార్థుల ందరూ ఎంతో గర్వంగా చెప్పుకుంటారు. ఏది ఏమైనా కాకతీయ విశ్వవిద్యాలయం అంటేనే ఒక గొప్ప ఉద్యమ గడ్డ!!.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

---

# అస్తిత్వ ప్రభంజనం జనగామ జిల్లా





నేనుంటున్న (జనగామ)టౌన్లో జరిగే అధికారిక, అనధికారిక సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలకు వెళ్ళేందుకు ఎప్పుడు ఉత్సుకత చూపేవాడినికాదు పెద్దగా వెళ్లొద్దు అని తీర్మానించుకున్నదేమి లేదు కాని, నాకున్న వినికిడి లోపమే అందుకు ప్రధానం అనుకోవచ్చు. "తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్"(జనగామ జిల్లా) 9వ వార్షికోత్సవం సందర్భంగా **అగ్రగామి** జాతీయ సామాజిక సాంస్కృతిక పత్రిక "జనగామ జిల్లా సమాచార దర్శిని" ప్రత్యేక సంచిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టింది. 44 సంవత్సరాల ప్రస్థానంలో "అగ్రగామి" జనగామ నందు అగ్రస్థానంలోనే వెలుగొందుతుంది. ఇప్పటి వరకు ఎన్నో "అగ్రగామి" ప్రత్యేక సంచికలను వెలువరించిన సంపాదకులు లయన్ కన్న పరశురాములు గారు ఎప్పటికి అభినందనీయులే.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిన్నటి రోజున మధ్యాహ్నం ఈ కార్యక్రమ ఆహ్వానం అందుకున్న 'కవి హృదయం సాహిత్య వేదిక' వాట్సప్ గ్రూప్ ద్వారా సంబంధితులందరికి తెలియపరచగలిగింది నిన్నటి ఉదయమే.ఆ సమయంలోనే డా. లింగంపల్లి గారు కూడా ఫోన్ చేసి నన్ను ఉద్దేశించి వస్తున్నారా అంటూ అడిగారు.ఎటు చెప్పలేక వర్షం లేకుంటే అన్నట్లుగా దాటవేసాను అప్పటికి. సుమారు నలుబది సంవత్సరాలుగా జనగామ టౌన్ లో అటుఇటుగా నివసిస్తున్న వాడినైనా,జనగామ జిల్లా భౌగోళిక, నైసర్గిక,చారిత్రక,సామాజిక, సాంస్కృతిక సంబంధిత విషయాలు బొత్తిగా తెలువని వాణ్ణే. తెలుసుకోవాలనే అభిలాష ఈ మధ్యనే అంటే..నా విశ్రాంతి జీవిత ఆరంభం నుండనే చెప్పుకోవచ్చు. నాలాంటి అభిరుచి కలిగినవాళ్లకు ఉపయుక్తంగా ఉండేదే అయ్యుంటుందని "జనగామ జిల్లా సమాచార దర్శిని" పుస్తకాన్ని వెంటనే చూడాలని కోరిక బహుళంగా కలిగింది నాలో.. అప్పటికి సమయం మధ్యాహ్నం అయ్యింది. తను(అరుణమ్మ) హన్మకొండకు ప్రయాణం అవుతుంది తల్లిని చూసి వస్తానని ఎలాగూ బస్టాండ్ వరకు వెళ్లి తనని బస్సు ఎక్కించి రావలసి ఉన్నందున అటునుంచి కలెక్టరేట్ దగ్గరే కాబట్టి వెళ్లాలనే నిర్ణయానికే వచ్చాను.

నేను హాల్లోకి అడిగిడేసరికే కార్యక్రమం మొదలై ఆహ్వానితుల చేతుల్లోకి ఆ పుస్తకం చేరింది.వెనుక వరసలో ఖాళీగా కనిపించిన కుర్చీలో కూర్చుని వేదికపై దృష్టి సారిస్తు,మరోవైపు పుస్తక అన్వేషణలో పడిపోయాను.కాసింత సమయంలోనే నాకు లభించింది ఆ పుస్తకం.వెను వెంటనే పుస్తకంలోని పేజీలను తిప్పేస్తు అభిలాషకు దగ్గరిగా ఉన్నవాటికింద పెన్నుతో మార్కింగ్ చేసుకుంటాన్నాను. అందులోని సమాచారాన్ని అన్వయించుకుంటే కిందివిధముగా కూర్పుకు దోహదపడగలిగింది.


జనగామ జిల్లాను.. చారిత్రక నేపథ్యంగా చూడ గలినట్లైతే, క్రీ.పూ యాబది వేల సంవత్సరాల కిందటే ఇక్కడ ఆదిమానవులు జీవించిన ఆధారాలు ఉన్నట్లుగాను, 'జనగామ' అనే పేరు "జైన్ గావ్" నుండి ఉద్భవించి నట్లుగా,జైన తీర్థంకర విగ్రహాలు బయటపడముతో ఈ ప్రాంతం జైనమత ప్రభావంతో వెలుగులోకి వచ్చినట్లుగా తెలుస్తోంది. పురావస్తు సంపదలో భాగంగా జిల్లా పరిధిలో సుమారు యాబది వరకు 'శాసనాలు' ఉనికిలో నిలిచాయని, వీటితోపాటు పురావస్తు అవశేషాలు అనేకం బయటకు వచ్చాయని, జనగామ జిల్లా కాలానుగుణంగా బౌద్ధం, జైనం, శైవ, వైష్ణవ సాంప్రదాయాలను ఆదరించినట్లు తెలుస్తుంది. కాలగమనంలో ప్రాచీన యుగం నుండి 18వ శతాబ్ధం వరకు అంటే! శాతవాహనూలు,ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, రాష్ట్రకూటులు, పశ్చిమ చాళుక్యులు,కందూరిచోళుల తరువాత మధ్యయుగంలో కాకతీయులు,పద్మనాయకులు,బహమనీలు, కుతుబ్షాహీలు ,ఆసీఫ్ జాహీల పాలనగా జనగామ చారిత్రక నేపథ్యం కలిగిన చైతన్య కూడలి. సాంస్కృతిక వారసత్వం,పురాతన మూలాలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ఆలయాలు, పర్యాటక కేంద్రాలుగా ప్రతిఘటన కోటలు అనేకం. తెలుగు సాహిత్యానికి మాతృస్థానం పాలకుర్కి, బమ్మెర, బసవన్న తత్వాలుగా "బసవపురాణం" సామాజిక ఆధార గ్రంథం. "మహాభాగవత పురాణం" తెలుగు అనువాద ఆధ్యాత్మిక ఆభరణం.

సాహితీ మూర్తులు ఎందరో.. స్వాతంత్రోద్యమ పోరాట ఉద్యమాల చరిత్ర కలిగిన ప్రాంతమై కూడ ఉన్నది.తిరుగుబాటు ఉద్యమాలకు పోరుగడ్డ.సాంస్కృతిక వికాసం బహుముఖీయం.ప్రభావశీల వ్యక్తులు, జిల్లా ప్రముఖులు విస్మరించలేనివారే అందరు.జిల్లా ఆవిర్భావంబీఉమ్మడి వరంగల్ జిల్లాకు ముఖద్వారంగా ఉన్న ఒకనాటి అస్తిత్వ పోరాటాల అడ్డ జనగామ పోరుగడ్డ,నేడు ఒక జిల్లా కేంద్రంగా ప్రభవిల్లుతున్నది."జనగామ జిల్లా సమాచార దర్శిని" సంక్షుప్త పరిచయం ఇది.

పాలడుగు రత్నాకర్ రావు

---

# ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో "తెలుగు" ఆత్మగౌరవం పనిచేస్తుందా?



భారత ఉపరాష్ట్రపతి ఎన్నికలు సెప్టెంబర్ 9, 2025న జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరఫున మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి తరఫున సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి పోటీలో నిలిచారు. ఈ ఇద్దరు అభ్యర్థుల వ్యక్తిగత నేపథ్యం, రాజకీయ సమీకరణలు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన "తెలుగు వాడు-గతంలో ఎన్టీఆర్ స్ఫూర్తి"తో "క్రాస్ ఓటింగ్" (ఆత్మ ప్రబోధం) విజ్ఞప్తి ఈ ఎన్నికలను ఆసక్తికరంగా మార్చాయి. ఈ నేపథ్యంలో, అభ్యర్థుల ప్రొఫైల్‌లను పరిశీలించి, క్రాస్ ఓటింగ్ అవకాశాలను విశ్లేషిద్దాం.

**సీపీ రాధాకృష్ణన్ ప్రొఫైల్ :**

సీపీ రాధాకృష్ణన్, 1957 అక్టోబర్ 20న తమిళనాడులోని తిరుప్పూ ర్‌లో జన్మించారు. వ్యాపార పరిపాలనలో బ్యాచిలర్ డిగ్రీ పొందిన ఆయన, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్వయం సేవకుడిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1974లో భారతీయ జనసంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా చేరారు. 1998-2004 మధ్య కోయంబత్తూరు నుంచి రెండుసార్లు లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యారు. 2003-2006 మధ్య తమిళనాడు బీజేపీ అధ్యక్షుడి గా, 2016-2019 మధ్య ఆల్ ఇండియా కాయిర్ బోర్డ్ చైర్మన్‌గా సేవలందించారు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా, గతంలో జారంద్, తెలంగాణ, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా పనిచేశారు. నదుల అనుసంధానం, అంటరానితనం నిర్మూలనం వంటి అంశాలపై 19,000 కిలోమీటర్ల పాదయాత్రలు చేసిన రాధాకృష్ణన్, దక్షిణ భారతదేశంలో బీజేపీ విస్తరణకు కీలక పాత్ర పోషించారు. ఓబీసీ వర్గానికి చెందిన ఆయన ఎంపిక, తమిళనాడు ఎన్నికల దృష్ట్యా బీజేపీ రాజకీయ వ్యూహంగా భావించబడుతోంది.

**జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ప్రొఫైల్ :**

1946 జూలై 8న ఆంధ్రప్రదేశ్‌లో జన్మించిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి, హైదరాబాద్ వాసి. 1971లో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా చేరారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2011లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. ఆయన న్యాయ రంగంలో సుదీర్ఘ అనుభవం, రాజకీయేతర నీతిగల వ్యక్తిత్వం ఇండియా కూటమికి బలమైన అస్త్రం. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆయన ఎంపిక, ప్రాంతీయ గుర్తింపును బలోపేతం చేసే వ్యూహంగా కనిపిస్తుంది.

**గెలుపు, క్రాస్ ఓటింగ్ అవకాశాలు:**

ఉపరాష్ట్రపతి ఎన్నికలు పార్లమెంటు ఉభయ సభల సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ద్వారా రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరుగుతాయి. ప్రస్తుతం ఎన్డీఏ కూటమికి సుమారు 422 ఎంపీల మద్దతు ఉండగా, ఇండియా కూటమికి 240 మంది సభ్యుల మద్దతు ఉంది. సంఖ్యాబలం పరంగా రాధాకృష్ణన్‌కు స్పష్టమైన ఆధిక్యం ఉంది. అయితే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలుగు వాడు కావడం, ఆయన న్యాయరంగ అనుభవాన్ని హైలైట్ చేస్తూ, తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం గతంలో పీవీ నరసింహారావుకు భారత ప్రధానమంత్రిగా అవకాశం వచ్చిన పుడు "తెలుగు" వాడు, దక్షిణాది రాష్ట్రాలకు అవకాశం వచ్చింది కాబట్టి ఆయన పీవీ నరసింహారావుకు పోటీ పెట్టకుండా అయిన గెలుపుకు సహకరించారు. కనుక అదే స్ఫూర్తితో తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కూడా క్రాస్ ఓటింగ్‌కు పిలుపునిచ్చారు. ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్, జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్, ఎంఐఎం నాయకుడు ఓవైసీలకు విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తి తెలుగు రాష్ట్రాల ఎంపీలను ఆకర్షించే అవకాశం ఉంది, ప్రత్యేకించి తెలుగుదేశం (టీడీపీ)కి చెందిన 16 లోక్‌సభ, 3 రాజ్యసభ సభ్యులు, జనసేనకు చెందిన 2 రాజ్యసభ సభ్యులు కీలకం కావచ్చు.

**విశ్లేషణ పరంగా చూస్తే:**

రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని కేంద్రీకరించినప్పటికీ, రాజకీయ సమీకరణలు క్రాస్ ఓటింగ్ ను సంక్లిష్టం చేస్తాయి. టీడీపీ, జనసేన ఎన్డీఏ కూటమిలో భాగమైనందున, వారు రాధాకృష్ణన్‌కు మద్దతివ్వడం రాజకీయ లాంఛనంగా కనిపిస్తుంది. అయితే బీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీ, ఎంఐఎం పార్టీ లు ఇండియా కూటమితో అనుబంధం లేకపోవడం వల్ల వారి సభ్యులు (బీఆర్ఎస్: 9 లోక్‌సభ, 3 రాజ్యసభబీ వైఎస్సార్‌సీపీ: 4 లోక్‌సభ, 9 రాజ్యసభబీ ఎంఐఎం: 1 లోక్‌సభ) స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవచ్చు. అయితే, రాజకీయ విధేయతలు, ఒత్తిళ్లు క్రాస్ ఓటింగ్‌ను అడ్డుకోవచ్చు.

జస్టిస్ సుదర్శన్ రెడ్డి రాజకీయేతర నేపథ్యం, న్యాయరంగ ప్రతిష్ఠ వారికి గౌరవప్రదమైన ఇమేజ్‌ను ఇస్తాయి. కానీ, రాధాకృష్ణన్ బీజేపీ రాజకీయ అనుభవం, ఎన్డీఏ సంఖ్యాబలం ఆయనకు ప్రయోజనకరం. తెలుగు ఆత్మగౌరవం అనే భావన "భావోద్వేగ ఆకర్షణ" కలిగి ఉన్నప్పటికీ, రాజకీయ కూటముల విధేయతలు, ఎన్డీఏ ఆధిక్యం కారణంగా ప్రస్తుతం అయితే...క్రాస్ ఓటింగ్ అవకాశాలు పరిమితంగా కన్పిస్తున్నాయి. అందువల్ల, రాధాకృష్ణన్ గెలుపు అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి, అయితే రేవంత్ రెడ్డి విజ్ఞప్తి తెలుగు రాష్ట్రాల ఎంపీల మనస్సాక్షిని కదిలిస్తే, "తెలుగు వాడు" అనే సెంటిమెంట్ పని చేస్తే అలాగే బీజేపీ గత 11 ఏళ్ళ పాలనలో దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయాలు ను గుర్తు చేసుకుంటే... ఆసక్తికరమైన ఫలితం సాధ్యమవుతుంది.(అయితే మన తెలుగు వాళ్ళకు "తెలుగు" అనే భాషాభిమానం" కానీ ... అలాగే "తెలుగు వాడు" అనే "జాతి" అభిమానం కానీ ఉండవు. మన తెలుగు వాళ్ళలో "తెలుగు తనం" చాలా తక్కువ. "మన చర్మం చాలా మందం". కూడా కదా !)

ఈ ఎన్నికలు తెలుగు జాతి ఆత్మగౌరవం, రాజకీయ వ్యూహం మధ్య సమతులతను పరీక్షిస్తాయి. జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రొఫైల్ ఆదర్శవంతమైనప్పటికీ, రాధాకృష్ణన్ రాజకీయ అనుభవం, ఎన్డీఏ సంఖ్యాబలం ఆయనకు ఆధిక్యతనిస్తాయి. క్రాస్ ఓటింగ్ అవకాశం ఉన్నప్పటికీ, రాజకీయ ఒత్తిళ్లు దాన్ని పరిమితం చేయవచ్చు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

---

బిఎస్ రాములు

# తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్య శిల్పి

**(బిఎస్ రాములు 75 - అమృతోత్సవం)**



సభలను నిర్వహించడం ప్రారంభించింది. జాషువా జయంతి సభతో కార్యక్రమాలు మొదలయ్యాయి. (1982లో వ్యవస్థాపక అధ్యక్షులుగా దరకమే ఐక్య వేదిక నిర్మించి రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించారు. అనేక కథా శిక్షణ తరగతులు, చర్చలు, సదస్సులు కూడా నిర్వహించారు. పాల్గొన్నవారి రచనలను సవరించి చక్కగా ముద్రించి ప్రోత్సహిస్తూ వస్తున్నారు. యువతరాన్ని సాహిత్యకారులుగా తీర్చిదిద్దడానికి కథ, పాట, ప్రసంగం, వ్యాసరచన తదితర ప్రక్రియల్లో శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షణా తరగతులకు ఒక పాఠ్య ప్రణాళిక ఉండాలనే ఉద్దేశ్యంతోనే 'కథలబడి' రాయడం జరిగింది. ఇలా సీనియర్ రచయితగా బిఎస్ రాములు బహుజన యువతను సాహిత్య రచన వైపు మళ్లించేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నారు.

ఆయన సుదీర్ఘ సాహితీ సేవలకు గుర్తింపుగా ఎన్నో గౌరవ పురస్కారాలు లభించాయి. వాటిలో ప్రధానంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, దాశరథి రంగాచార్య పురస్కారం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ పురస్కారం, త్రిపురనేని రామస్వామి స్మారక పురస్కారం, పాల్కురికి సోమన పురస్కారం, తెలంగాణ సారస్వత పరిషత్ పురస్కారం, దుద్దిల్ల శ్రీపాదరావు స్మారక పురస్కారం యుగకర్త బిరుదు ప్రధానం. మొదలైనవి. వీటికి తోడుగా ఎన్నో సంస్థల సత్కారాలు, సన్మానాలు లభించాయి. వీరి కథలపై 6 ఎమ్‌ఫిల్, 2 పిహెచ్‌డిలు వచ్చాయి. ఈ పరిశోధనల్లో కథల గురించే కాక కాలక్రమాను గతమైన దశల గురించి, శిల్పంలో క్రమేణా వచ్చిన దశల గురించి కూడా వివరణాత్మక విశ్లేషణ ఉంది. ప్రముఖ కథకుడిగా బిఎస్ రాములు తెలుగు సాహిత్యంలో తన స్థానాన్ని ఇలా సుస్థిరం చేసుకున్నారు.

కమ్యూనిజాన్ని భారతీయ సమాజం కోణంలో విశ్లేషించి, దేశ అవసరాలకు సరిపడే ప్రత్యామ్నాయ మార్గాలను సూచించిన బిఎస్ రచనలు ఇంగ్లీష్‌లో వస్తే వాటిపై దేశవ్యాప్త చర్చ జరిగేది. గొప్ప ప్రయోజనం ఒనగూరేది. ఈ నష్టం తెలుగు సాహిత్యాన్ని వీడడం లేదు. మన పుస్తకాలు ఇంగ్లీషులోకి వెళ్లక జాతీయ గుర్తింపు పొందడంలేదని సి నారాయణరెడ్డి గారు పదే పదే అనేవారు. మూడున్నర కోట్ల జనాభాగల కేరళలో క్రైస్తవం, మిషనరీ స్కూళ్ల కారణంగా ఇంగ్లీష్ తెలిసినవారు ఎక్కువ. అలా వారి పుస్తకాలు ఇంగ్లీషులో అనువాదమై ప్రపంచఖ్యాతి పొందుతున్నాయి. తరిమెల నాగిరెడ్డి 'తాకట్టులో భారతదేశం' ముందు ఇంగ్లీషులో వచ్చింది కాబట్టే ప్రముఖ గ్రంథంగా గుర్తింపు పొందింది. కంచె ఐలయ్య తన పుస్తకాలను ఇంగ్లీషులో రాయడం వల్ల వాటిపై విస్తృత చర్చకు అవకాశం లభిస్తోంది. భాషలోకి తర్జుమాతో పాటు అదే భాషలో చర్చలో పాల్గొనే స్థాయి రచయితకు అవసరం. అప్పుడే ఈ ప్రయత్నం సఫలీకృతమవుతుంది.

5. తత్వవేత్తగా జీవితం

చిన్నతనం నుండే తన రచనలను అచ్చులో చూసుకోవాలనే ఆశతోనే బి ఎస్ రాయడం మొదలెట్టారు. ఆ తర్వాత ఎదిగిన క్రమంలో సమాజం, దేశం బాగుపడాలని ఆర్ఎస్ఎస్‌లో చేరారు. దానిలోని మత ఛాందసాన్ని అవగతం చేసుకొని, ఇది తన మార్గం కాదని గ్రహించి బయటకు వచ్చారు. పేద ప్రజలకు మేలుచేయడం, సామాజిక న్యాయం కోసం విప్లవోద్యమం సరైన బాట అని భావించి అందులో కొనసాగారు. చివరకు ఎంతో నమ్ముకున్న నక్సలైట్ ఉద్యమ తీరుతెన్నులు నచ్చక బయటకు వచ్చారు. బీసీ,ఎస్సీ, ఎస్టీలు అధికారంలోకి రావాలని, తన శ్రమ, జ్ఞానం దానికే కేటాయించాలని అనుకున్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలతో మొదలై దేశంలో సాగిన జాతీయోద్యమాన్ని, కాంగ్రెసు పాత్రను, అంబేద్కరిజాన్ని అధ్యయనం చేశారు. 1977 నుండి బౌద్ధం చదవడం మొదలుపెట్టారు. సాంప్రదాయిక, వైదిక సాహిత్యం ఆర్ఎస్ఎస్ నుండి మొదలుకొని మొన్నటి విప్లవ సిద్ధాంతాల వరకు చేసిన అధ్యయనంతో ఆయనలో ఒక తాత్విక భూమిక ఏర్పడింది.

బిఎస్ పెదనాన్న మిట్టపల్లి రాజయ్య 50 ఏళ్ళ పాటు అచలతత్వ గురువు. ఆయనకు మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ మూడు రాష్ట్రాల్లో వేలాదిమంది శిష్యులుండేవారు. బాల్యంలో ఆ ప్రభావం కూడా పడింది. ఈ నేపథ్యంతో 'బౌద్ధం సోషలిజం మార్క్సిజం అంబేద్కరిజం ప్రతీత్య సముత్పాద' అనే పుస్తకంలో రెండున్నర వేల ఏళ్లుగా సాగుతూ వస్తున్న సోషలిస్టు భావ పరిణామాన్ని, నిర్మాణాలను, అవగాహనలను వివరించగలిగారు. 11 వ శతాబ్ది వరకు బౌద్ధమే సోషలిజాన్ని ఏవిధంగా ఆచరించిందో రాస్తూ, అంబేద్కర్ భారత రాజ్యాంగంలో సమసమాజాన్ని, లౌకిక తత్వాన్ని, శాంతియుత పరివర్తన, సామాజిక న్యాయం గురించి ఏమని చెప్పాడో అందులో క్రోడీకరించారు. అందులో మార్క్సిజం వెలికి తెచ్చిన అంశాలను కూడా వివరించారు. భావజాల పరిణామం లేకుండా మార్పు జరగదు, తాత్వికరంగంలోనే మొదట మార్పు రావాల్సి ఉంటుంది అనే దృష్టికోణంలో ఎక్కువ కృషి చేశారు. అదే కోణంలో బిఎస్ రచనల్లో తాత్వికత పాలు పెరిగింది. అంతర్లీనంగా అన్నిచోట్లా అది కనిపిస్తుంది. అందుకు కారణం తాత్విక రచనలు చేయడమే. ఏక కాలంలో ఫిలాసఫీతో పాటు ఫిక్షన్ రాసే అవసరాన్ని గ్రహించారు. ఈ మేళవింపు ఆయన వర్తమాన రచనల్లో కనబడుతుంది.

సామాజిక న్యాయం ద్వారా సామాజిక మార్పు సాధించడం, అసమానతలు రూపుమాపి, వివక్ష వెలివేతలు నిర్మూలించబడి, సమస్త వర్ణ వర్గ కుల మత భాష వివక్షతలన్నీ తొలగి పోయినప్పుడు మనుషులందరు సమానమే. మానవులంతా ఒక్కటే అనే మానవీయ దృష్టి బిఎస్ ఆలోచనల్లో వచ్చిన పరిణామాలన్నింటిలోను కొనసాగిన అంతస్సూత్రం. సామాజిక అసమానతలను పరిష్కరించుకుంటూ పోవడమే సోషలిజం. సమసమాజ నిర్మాణం, స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రాతృత్వం అందరికీ సమాన హక్కులు, అవి అందుకోలేని వారికి ప్రత్యేక ప్రాతినిధ్య ఏర్పాట్లు రిజర్వేషన్లు మొదలైన వాటికి భారత రాజ్యాంగం పెద్ద పీట వేసినందున రాజ్యాంగ పరిధిలో సాధించుకోవాల్సిన అన్నిటినీ ఎలా సాధించుకోవాలో చెప్పడం తన బాధ్యత అనుకున్నారు. 'గతి తర్క తత్వ దర్శన భూమిక', 'బౌద్ధం సోషలిజం మార్క్సిజం అంబేద్కరిజం', 'బహుజన తత్వం', 'అంబేద్కరిజం-సోషలిజం' మొదలైన తాత్విక రచనలు ఈ ప్రయత్నంలో వెలువడినవే.

'గతి తర్క తత్వ దర్శన భూమిక' బి ఎస్ తాత్విక రచనల్లో తొలి రచన. బి ఎస్ విప్లవ ఉద్యమజీవితం నేర్పిన పాఠాలతో ఆయన ఆలోచనాధోరణిలో వచ్చిన మార్పు ఇందులో ప్రధాన అంశం. విప్లవోద్యమ రహస్య జీవితంలోంచి బయటికి వచ్చిన మరుసటి సంవత్సరమే అంటే 1987లో రాసి బహిరంగ జీవితంలోకి వచ్చాక దీనిని 1991లో తన 42వ ఏట ప్రచురించారు. ప్రపంచంలోని సకల సంపదలు సృష్టించిన శూద్రులు అన్ని కాలాలలో, అన్ని సిద్ధాంతాల్లో, అన్ని ఉద్యమాల్లో వెనుకబడే ఉండగా, అగ్ర కులాలు అన్నింటా శాసించే నాయకత్వ పాత్రను పోషించడాన్ని బిఎస్ ఇందులో చర్చకు పెట్టారు. మన సమాజంలో అగ్ర కులాలు తమ ప్రాధాన్యత నిలుపుకోవడానికి పీడితులను తమ అధమ స్థాయి నుండి బయటికి రాకుండా ఎన్ని రూపాల్లో ప్రయత్నిస్తారో ఇందులో వివరించారు. విప్లవోద్యమాల్లో కూడా పాలక, అగ్రవర్ణ, పురుషాధిక్య భావాలు ఎంత బలంగా, ఎలా ఏర్పడ్డాయో, ఆ పరిధిలోనే విప్లవకార్యాచరణ ఎలా సాగుతున్నదో వివరించారు.

ఈ పుస్తకంలో రచయిత మార్క్సిజానికి, బ్రాహ్మణవాదానికి ఒకే గుణం ఉందంటారు. 'నేను చెప్పానని గాని, మరొకరు చెప్పారని గాని నమ్మకు. ఏది సత్యమో దాన్నే నమ్ము, ఆచరించు అని బుద్ధుడు బోధించాడు. మార్క్స్, ఎంగెల్స్ మాత్రం మేము సూచించిన దారే సరియైనది జీవితాంతం చెప్పారు. సమాజంలోని విచక్షణను, జ్ఞానాన్ని బుద్ధుడు గుర్తించాడు. వీరేమో తామే శాస్త్రీయంగా ఆలోచించేవారమని అన్నారు. బౌద్ధానికి, మార్క్సిజానికి జ్ఞాన సిద్ధాంతంలో ప్రజలపట్ల విశ్వాసంలో తేడా ఇదే. మార్క్సిజానికి ప్రజల జ్ఞానంపట్ల విశ్వాసం లేదు. బ్రాహ్మణిజం, మార్క్సిజం రెండూ అందరికన్నా మేమే గొప్ప అనుకుంటాయి. అందుకే ఇక్కడి బ్రాహ్మణవాదులు వెంటనే మార్క్సిజాన్ని పట్టేసుకున్నారు. తద్వారా ఈ దేశంలో మార్క్సిజం రూపంలోనూ బ్రాహ్మణవాదం కొనసాగడం మొదలైంది' అనే వాక్యాలు ఈ పుస్తకంలో బిఎస్ ప్రతిపాదించిన విషయాన్ని సూచిస్తాయి.

ఈ ప్రతిపాదనలతో విప్లవోద్యమ మనుగడే మారిపోయింది. అప్పటికే పార్టీలో ఎంతో కాలంగా పనిచేస్తున్న కింది కులాలవారు ఆలోచనలో పడ్డారు. ఒక్కొక్కరుగా పార్టీ వైఖరిని

తరువాయి రేపటి సంచికలో

- బద్రి నర్సన్
ఫోన్: 9440128169

# దిగజారుతున్న మీడియా విలువలను పరిరక్షించుకోవాలి

- టీయూడబ్ల్యూజే (ఐజేయు) రంగారెడ్డిజిల్లా అధ్యక్షులు ఎండి. సలీం

**షాద్‌నగర్, ఆగస్టు 21 (జనంసాక్షి) :** సమాజంలో దిగజారుతున్న మీడియా విలువలను పరిరక్షించుకునేందుకు జర్నలిస్టులందరూ ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని టియుడబ్ల్యూజే (ఐజేయు) రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండి సలీం అన్నారు గురువారం షాద్ నగర్ పట్టణ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్ లో టీయూడబ్ల్యూజే ఐజేయు షాద్ నగర్ శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు ముఖ్య అతిథిగా టియుడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర మఫిషియల్ కమిటీ చైర్మన్ గుడుపల్లి శ్రీనివాస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండి.సలీంలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎండి.సలీం మాట్లాడుతూ పడిపోతున్న మీడియా విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి జర్నలిస్టుపై ఉందన్నరు. సమాజంలో సోషల్ మీడియా వినియోగం ఎక్కువగా పెరిగిపోవడం వల్లనే మీడియాపై విలువలు తగ్గుతున్నాయని వివరించారు. సమాజంలో నాలుగవ స్తంభంగా ఉన్న జర్నలిజాన్ని కాపాడుకునేందుకు కృషి చేయాలని సూచించారు. మీడియా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుందని. ప్రస్తుతం మీడియాలో విప్లవాత్మక మార్పులు వస్తున్నా యని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టులు మీడియా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జర్నలిస్టుల చట్టాలకై ప్రెస్ అకాడమీ ఆఫ్ ఇండియా ట్రిబ్యూనల్‌గా పని చేస్తుందన్నారు. ఇది సుప్రీంకోర్టు అథారిటీలో పనిచేస్తుందన్నారు. మీడియా సమాచారాన్ని సేకరించటతో పాటు వ్యవస్థలో వినోదాన్ని ఆనందాన్ని పంచటంలో ప్రజల అవసరాలను తీర్చేదిగా ఉండాలని



వ్యాఖ్యనించారు. సమాజంలో ఎవరి మనోభావాలు దెబ్బతీసే విధంగా వార్తలు ఉండవద్దని సూచించారు. ప్రజా అవసరాలను తీర్చే విధంగా జర్నలిస్టులు పనిచేయాలనీ సూచించారు. రానున్న రోజుల్లో జర్నలిస్టుల సంక్షేమానికి మీడియా అకాడమీ పాటుపడుతుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రతకు పాటు పడుతుందన్నారు. ప్రజల ఆదరణ, గుర్తింపుతోనే జర్నలిస్టులకు రక్షణ కవచ మన్నారు. మీడియా ఎప్పుడు ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కార దిశగా కృషిచేయాలన్నారు. ప్రజా సమస్యలను, వాస్తవాలను ప్రతిబింబించే విధంగా వార్తలు ఉండాలన్నారు. సమాజంలో ఏవర్గాం మనోభావాలను దెబ్బతీ యవద్దన్నారు. దాటుతుందని, స్వీయ నియంత్రణ మనమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. సోషల్ మీడియా వేగంగా విస్తరిస్తుం దని, కొన్ని పర్యాయాలు హద్దులు దాటి ప్రవరిస్తుందన్నారు. సోషల్ మీడియాకు ప్రభుత్వం నుండి ఎలాంటి గుర్తింపు లేదన్నారు. సోషల్ మీడి యాను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొన్ని చట్టాలను తీసుకొచ్చే ఆలోచనలో ఉందని వివరించారు. వాస్తవాలను చెప్పటమే జర్నలిస్టులకు రక్షణ ప్రజలకు ప్రయోజనాకరంగా ఉంటుందనీ అన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇచ్చేందుకు కొత్త మార్గదర్శకాలు రూ పొందుతున్నాయని, త్వరలోనే కార్య రూపం దాల్చనుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, రక్షణ కోసం మీడియా అకాడమీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని పేర్కొన్నారు.

**షాద్ నగర్ డివిజన్ కమిటీ ఎన్నిక**

షాద్ నగర్ ప్రింట్ మీడియా నియోజకవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రింట్ మీడియా డివిజన్ అధ్యక్షులుగా బూర్గుల ఫణీంద్ర, (మెట్రో ఈవినింగ్) ఉపాధ్యక్షులుగా మల్లికార్జున్ (ప్రజాదర్బార్), బంగారు మల్లేష్ (ఆంధ్రజ్యోతి చౌదర్ గూడా), సంతోష్ (మన తెలంగాణ నందిగామ), ప్రధాన కార్యదర్శిగా నీరటి శివకుమార్ (అన్స్ ఇండియా షాద్ నగర్), ప్రచార కార్యదర్శిగా శేఖర్ యాదవ్ (ఆంధ్రజ్యోతి కేశంపేట), సంయుక్త కార్యదర్శిలుగా అల్వాల దర్శన్ గౌడ్ (నేటి ప్రభాత సూర్య), ఎం. అనిల్ కుమార్ (ప్రజాపక్షం కొత్తూరు), జగన్ (జై భారత్ న్యూస్ షాద్ నగర్),కోశాధికారిగా శ్రీనివాస్ (నేటి ప్రభాత సూర్య), కార్యవర్గ సభ్యులుగా యాదగిరి, సమీ, రవి, కార్తీక్, నూరుద్దీన్ లతోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కొనియాల భాస్కర్, సంయుక్త కార్యదర్శి దన్నారం రమేష్, ఈసీ మెంబర్ ఇలియాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ యాదవ్, ఎలక్ట్రానిక్ మీడియా షాద్ నగర్ డివిజన్ అధ్యక్షులు నరసింహ, ప్రధాన కార్యదర్శి ఫయాజ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, జర్నలిస్టులు విష్ణు, రాజు, కాజా సోయల్, రియాజ్, సాబీర్, శేఖర్, శ్రీకాంత్, సంతోష్ కుమార్, శంకర్, సంపత్ కుమార్ మల్లికార్జున్, శివకుమార్, రజాక్, శ్రావణ్ కుమార్ గౌడ్, నాగరాజు, ఎండి సలీం, శ్రీనివాస్, రమేష్, కిరణ్ కుమార్, వెంకటేష్ గౌడ్, రత్నం, గణేష్‌లు పాల్గొన్నారు.

# జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖలో సిబ్బంది పనిని సమర్థవంతంగా నిర్వహించాలి



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 21 (జనం సాక్షి) :** జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖలో సిబ్బంది పనితీరును సమర్థవంతంగా మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రభుత్వ ఆసుపత్రులు, పీ.హెచ్.సీల పనితీరుపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని అత్యంత ప్రాధాన్యతనిస్తోందని,ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కువ మంది ఓపి రోగులు ప్రయోజనం పొందేలా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బంది అందరూ తమ హాజరు నమోదు బయోమెట్రిక్ ద్వారా చేయాలని,ఈ నెలాఖరుకు అన్ని రిజిస్ట్రేషన్లు ఎన్రోల్ చేసి సెప్టెంబర్ 1వ తేదీ నుండి ప్రతి ఒక్కరు బయోమెట్రిక్ ద్వారా తమ హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు ప్రతి వారం రెండుసార్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను క్షేత్ర స్థాయిలో సందర్శించాలన్నారు. క్షేత్రస్థాయి పర్యటన సమయంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు హై రిస్క్ రోగులతో సంప్రదించి వారికి తగిన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆశ, ఏఎన్ఎంలు హైరిస్క్ రోగులను గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో డెలివరీల సంఖ్య పెంచేందుకు అన్ని స్థాయిల్లో చర్యలు తీసుకుని సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకాన్ని పెంపొందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య అధికారి సిద్ధప్ప, ప్రోగ్రామ్ ఆఫీసర్ సంధ్య రాణి, మెడికల్ ఆఫీసర్స్, ప్రోగ్రామ్ ఆఫీసర్స్, హెల్త్ సూపర్వైజర్స్, తదితరులు పాల్గొన్నారు.

# నీళ్లతో నిండిన కూకట్‌పల్లి నల్లచెరువు

- అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్
- అహ్లాదకరవాతావరణంలో సేదదీరుతున్న స్థానికులు

**హైదరాబాద్, ఆగస్టు 21 (జనంసాక్షి) :** కూకట్‌పల్లి నల్ల చెరువు వర్షపు నీటితో నిండింది. మంచి నీటితో ఆహ్లాదకరంగా మారింది. ఒకప్పుడు ఎలా ఉండేది. నేడు ఎలా అభివృద్ధి చెందింది అనేది చూడాలనుకుంటే కూకట్‌పల్లి నల్లచెరువును సందర్శించాల్సిందే. నిర్మాణ వ్యర్థాలతో నిండి.. మురికి కూపంగా మారి.. ఆఖరుకు చెరువు ఆనవాళ్లనే కోల్పోయిన దశ నుంచి.. నేడు సరికొత్త జలాశయంగా మారింది. కబ్జాల చెర నుంచి బయటపడింది. మురుగును వదిలించుకుంది. పేరుకుపోయిన చెత్తను తొలగించుకుంది. కేవలం నాలుగు నెలల్లో చెరువు రూపురేఖలు మారిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నిండుకుండలా కనిపిస్తోంది. అక్కడ నివాసం ఉన్న వాళ్లే అచ్చెరవొందేలా కూకట్‌పల్లి నల్ల చెరువు తయారయ్యింది. బోటు షికారుకు చిరునామా అయ్యింది. ఎన్ని ప్రయాశలో.. ఎన్ని ఎదురు దెబ్బలో.. మరెన్ని విమర్శలో.. వీటన్నిటినీ తట్టుకుని పని చేసిన హైడ్రా కష్టానికి ఫలితమైంది. హైడ్రా పని తనానికి నిదర్శనంగా నిలిచింది. చెరువు అభివృద్ధిపట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గొలుసుకట్టు చెరువులతో వరదను నివారించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తున్న హైడ్రా సిబ్బందిలో ఆత్మవిశ్వాశాన్ని నింపింది. గురువారం నల్ల చెరువును హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సందర్శించి అభివృద్ధి పనులను పర్యవేక్షించారు.

# ముంపు బాధితులకు ఇబ్బందులు పునారావృతం కాకుండా చూడాలి

- రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 21 (జనంసాక్షి) :** గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎటువంటి ప్రాణనష్టం,ఆస్తి నష్టం జరగకుండా జిల్లా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమని రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ ప్రశంసించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో పాటు అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు. వరదల వల్ల తలెత్తిన సమస్యలు, వాటి నివారణకు చేపట్టిన చర్యలు, సహాయక చర్యలపై శాఖల వారీగా అధికారులు సమగ్ర నివేదికలు సమర్పించారు.ఆర్ అండ్ బీ శాఖ అధికారులు వర్షాల కారణంగా రహదారులు దెబ్బతిన్న ప్రదేశాలను, వాటి పునరుద్ధరణ పనులను వివరించారు. మున్సిపల్ శాఖ అధికారులు తాగునీటి సౌకర్యాలు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను తెలిపారు. వైద్య



ఆరోగ్య శాఖ అధికారులు వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులు, వాగులు,ప్రాజెక్టుల నీటి మట్టాలపై సమాచారం అందించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేపట్టిన చర్యలను వివరించారు. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశుసంవర్ధక శాఖలు పంటలు, పశువులపై వర్షాల ప్రభావం, రైతులకు అందిస్తున్న సహాయం గురించి తెలియజేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజులుగా కురిసిన భారీ వర్షం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఆగస్టు 14న జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైందని, వరద నీటి ప్రవాహం కారణంగా లో లెవెల్ కాజ్‌వేలు మునిగిపోయాయని అన్నారు. జిల్లాలోని చెరువులు పూర్తిగా నిండినవి, వివరాలు తెలిపారు.అంతకుముందు నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని చర్ల తిరుమలపూర్ సిర్స వాడలో ,గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు, వరదల ప్రభావంతో జిల్లాలో దెబ్బతిన్న ప్రాంతాలను, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, సంబంధిత శాఖల అధికారులు కలిసి ప్రత్యక్షంగా సందర్శించారు. వరదల కారణంగా రహదారులు, చెరువులు, వాగులు, వంతెనలు, తాగునీటి సౌకర్యాలు, వ్యవసాయ పొలాలు, విద్యుత్ లైన్లు దెబ్బతిన్న ప్రదేశాలను పరిశీలించి అక్కడి పరిస్థితులను స్థానికులతో అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహాధర్నాను విజయవంతం చేయాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21 (జనంసాక్షి) :** ఈ నెల 23వ తేదీన హైదరాబాద్ లో తలపెట్టిన రాష్ట్రస్థాయి మహాధర్నాను విజయవంతం చేయాలని యుఎస్పిసి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నేతలు షాద్ నగర్ పట్టణంలో స్థానిక ఎమ్మర్సీ కార్యాలయ ఆవరణలో స్థానిక మండల విద్యాధికారి టి.మనోహర్ ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు రాష్ట్రంలో విద్యారంగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అన్ని క్యాడర్లు బదిలీలు పదోన్నతులు షెడ్యూల్ ను తక్షణమే విడుదల చేయాలని ఖాళీలు భర్తీ చేయాలని సిపిఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని స్కూలు ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్కు ఏకీకృత సర్వీస్ నిబంధన రూపొందించి కళాశాలల అధ్యాపకుల ఖాళీలలో శాశ్వత నియామకాలు చేపట్టాలని విద్యా రంగం, ఉపాధ్యాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో యుఎస్ పిసి డివిజన్ నాయకులు కె.వెంకటయ్య ఎన్.నర్సింలు గౌడ్ అర్జునప్ప రవీంద్రనాథ్ చంద్రశేఖర్ మధు మోహన్ భరత్ కుమార్ హరకృష్ణ అర్జునయ్య చంద్రశేఖర్ శివరాములు నర్సింలు కృష్ణ నర్సింలు లక్ష్మీదేవమ్మ మంజుల సమత వైష్ణవి రామకృష్ణ వినీత్ శివ బాలయ్య తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేరస్తులను వెంటనే పట్టుకుంటాం

- హత్య ఘటనా స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ
- ఆధారాల కోసం క్లూస్ టీం అన్వేషణ

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 21 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కేంద్రంలో హత్య జరిగిన జరిగిన సంఘటన స్థలాన్ని గురువారం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ స్వయంగా వెళ్లి పరిశీలించి, హత్య జరిగిన ఘటనపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అన్ని కోణాలలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. అదే విధంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు మరింత వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంటి సమీపంలోని సీసీ కెమెరాలను, చుట్టుపక్కల పరిస్థితులను ఆయన సిబ్బందితో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆధారాల ఆధారంగా కేసును త్వరితగతిన చేదిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వనపర్తి సిఐ కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, పానుగల్ ఎస్సై శ్రీనివాసులు ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# కాప్రా చెరువును పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్

**కాప్రా, ఆగస్టు 21 (జనం సాక్షి) :** కాప్రా చెరువు అభివృద్ధికి కృషి చేస్తానని ఎల్‌బి నగర్ జోనల్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డితో కలిసి ఆయనే కాప్రా చెరువును పరిశీలించారు. కాప్రా కాలనీవాసులు కాప్రా చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్ కాలనీవాసులు కోరారు . సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ కాప్రా చెరువు నీ అభివృద్ధి చేస్తా అని హామీ ఇచ్చారు. అనంతరం తన స్వంత నిధులతో ఎమ్మెల్యే తూము నిర్మాణం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాప్రా డిప్యూటీ కమిషనర్ జగన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, నవీన్ కుమార్ గౌడ్, మరాఠీ రవీందర్రావు, భాస్కర్ గౌడ్, బదురుద్దీన్, ఇంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# నా తండ్రి, తాత ఆశయాలు నెరవేరుస్తా..

- ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21 (జనం సాక్షి) :** నా తండ్రి చిట్టెం వెంకటేశ్వర రెడ్డి,తాత మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి ఆశయాలను నేరవేరుస్తానని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి అన్నారు.గురువారం తన తండ్రి స్వర్గీయ చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి జయంతి సందర్భంగా నారాయణపేట కొత్త గంజ్ వద్ద వెంకటేశ్వర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసినారాయణ పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకు మార్ రెడ్డి , పీసీసీ సభ్యుడు చిట్టెం అభిజయ్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందికి బ్లాకెట్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు.అలాగే ఉచిత డయాబెటిక్, పీడియాట్రిక్ శిబిరాలను ప్రారంభించారు. అనంతరం బస్సు సౌకర్యం లేని విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతం అభివృద్ధి కోసం తాత, తండ్రి ఎంతో కృషి చేశారని అన్నారు. ఇంకా మిగిలి ఉన్న వారి ఆశయాలను పూర్తి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రసాగర్ అమ్రాబాద్, ఎత్తిపోతల పథకం వెంటనే చేపట్టాలి

**షాద్‌నగర్, ఆగస్టు 21 (జనంసాక్షి) :** మహబూబ్ నగర్ జిల్లాకు అప్పర్ ప్లాట్ కు జరిగిన అన్యాయం మరేక్కడ జరగలేదని పాలమూరు వలస కూలీలుగా నిర్వాసితులుగా మిగిల్చడానికి ప్రభుత్వాల ఎందుకు పూనుకున్నాయని కృష్ణనది తీరంలో ఈ పరివాహక ప్రదేశంలో మనమే తొలిహక్కు దారులమని మనకు దక్కవలసిన మన నీటిని మనకు దక్కనీయకుండా తరలిస్తున్నారని ఇంజనీర్లు కూడా వాస్తవ పరిస్థితుల పరిశీలనతో న్యాయన్యాయ విచక్షణతో కాకుండా రాజకీయ ప్రేరేపితంగా పనిచేస్తున్నారని ప్రభుత్వాలు సాగునీటి పనుల్లో భాగమవుతున్న కాంట్రాక్టు కంపెనీలు రాజకీయ పార్టీలు నాయకులు అధికారులు ఎంతెంత అక్రమ సంపాదనకు తెగబడుతున్నారో మనం చూస్తూనే ఉన్నామని ఇంత కాలంగా సాగునీటి పారుదల మంత్రులు ఆయా ప్రభుత్వాలు ముఖ్యమంత్రులు మనకు నీరు లేకుండా చేసి మన జీవన ప్రమాణాలు పెరగకుండా చేశారని మన జిల్లా నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఈ అన్యాయ నిర్వహణలో భాగమైనారని తప్పితే దిన్ని నిలువరించడానికి చిన్న ప్రయత్నం కూడా చేయడం లేదని ఇప్పటికైనా అప్పర్ ప్లాట్ దిగవ రైతాంగానికి ఎగవన అప్పర్ ప్లాట్ రైతంగనికి మధ్య వివాదాలు తలెత్తకుండా చంద్రసాగర్ రిజర్వాయర్ ఆధారంగా నీరు లిఫ్ట్ చేసి అప్పర్ ప్లాట్ భూములకు సాగునీటి వసతి కల్పించాలని భూగర్భ జలం లోతులోకి వెళ్లిపోయి చిలుము నీరు మాత్రమే దొరుకుతున్న అపర్ ప్లాట్ ప్రజలు తాగునీటి సమస్య పరిష్కరించాలని ఈ సమస్య సౌర గిరిజన వికాస పథకంతో తీరాదని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదల కోసం



సమగ్రంగా వెంటనే ఒక ప్రత్యేక పథకంగా చంద్ర సాగర్ అమ్రాబాద్ ఎత్తిపోతల పథకం చేపట్టాలని గత మూడు దశాబ్దాలుగా కరువు వ్యతిరేక పోరాట కమిటీ పాలమూరు అధ్యయన వేదిక అప్పర్ ప్లాట్ ప్రజల సమస్యల పరిష్కార కృషిలో భాగమవుతున్నదని సాగునీటి సమస్య తీరితే అప్పర్ ప్లాట్ ప్రజలు నమ్మకంగా సేద్యం చేసుకుంటారని నమ్ముతున్నది అందులో భాగమే ఈ కరపత్ర ప్రచారం యావత్ తెలంగాణ సమాజం దీనికోసం పోరాడాలని విజ్ఞప్తి చేస్తూ పాలమూరు ఆధ్యాయన వేదిక మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో షాద్ నగర్ పట్టణంలో కరపత్రాలు విడుదల చేశారు ఈ కార్యక్రమంలో పాలమూరు ఆధ్యాయన వేదిక రంగారెడ్డి జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్ ప్రజాసంఘాల నాయకులు అర్జునప్ప మందారం నర్సింలు నరసింహులు గౌడ్ ,వలిగే కృష్ణ , బాలయ్య తిరుమలయ్య చంద్రశేఖర్ కృష్ణయ్య శివరాములు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. జలమండలి రెవిన్యూ పెంచడమే లక్ష్యంగా నూతన సంస్కరణలు ప్రవేశపెట్టనున్నట్లు జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ తో కలిసి గురువారం రోజున జూబ్లీహిల్స్ లోని జలమండలి థీమ్ పార్క్ లో రెవిన్యూ, ఐటీ విభాగ అధికారులతో మేథోమథన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ... ఇప్పటికే జలమండలి అందిస్తున్న నాణ్యత సేవలకు గాను ఇప్పటికే మంచి గుర్తింపు లభించిందని తెలిపారు. అలాగే జలమండలి ఆదాయం పెంచేందుకు రెవిన్యూ, ఐటీ విభాగాల్లో నూతన సంస్కరణలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రస్తుతం డొమెస్టిక్ కేటగిరీ కింద ఉన్న వాణిజ్య కనెక్షన్లను గుర్తించడం అవసరమని ఆయన అన్నారు. ఇందుకోసం జిహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలోని నాన్-రెసిడెన్షియల్ భవనాల జాబితా సేకరించి వాటిని వాటర్ సప్లై కనెక్షన్లతో పోల్చాలని సూచించారు. బోర్డుకు వచ్చే ఆదాయం కొత్త ప్రాజెక్టులకు సరిపోకపోయినా, నీటి సరఫరా మరియు సీవరేజ్ సేవల మెరుగుదలకు మాత్రం ఉపయోగపడుతుందని వివరించారు. అలాగే, ఎంతో ప్రయాసతో సుదూర ప్రాంతాల నుంచి తరలిస్తున్న విలువైన నీటిని తక్కువ ధరకు తాగునీరు సరఫరా చేస్తున్నదని ఆయన గుర్తుచేశారు. జలమండలి ఆదాయం పెరగడానికి.. మరింత మెరుగైన సేవల కొరకు రెవిన్యూ, ఐటీలో ప్రతిపాదించిన సంస్కరణలను జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ మేథోమథన సదస్సులో వివరించారు.

# ప్రజల వైద్యం పట్ల నిర్లక్ష్యం వద్దు

- మరికల్ పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్
- ప్రజల వైద్యం పట్ల నిర్లక్ష్యం తగదని జిల్లా కలెక్టర్ పట్నాయక్

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 21 (జనం సాక్షి) :** ప్రజల వైద్యం పట్ల నిర్లక్ష్యం వద్దని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం మరికల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేశారు.ఆస్పత్రి లో ఉన్న మందుల గదికి వెళ్లి నిల్వ ఉన్న వివిధ రకాల మందులను ఆమె పరిశీలించారు.ఎన్ని నెలలకు మందుల సరఫరా జరుగుతుందని మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసు కున్నారు.ఆస్పత్రి పరిధిలో ఉన్న 7 సబ్ సెంటర్ల కు మందులను పంపిస్తున్నారా లేదా అని ఆరా తీశారు.మందుల జాబితాను చూశారు. పక్కనే ఉన్న టీకాల గదిలోకి వెళ్ళి ఫ్రిజ్ లో నిల్వ ఉంచిన పలు వ్యాక్సిన్లను పరిశీలించారు. గది ముందు వేసిన కాలం చెల్లిన మందులను చూసి వాటిని ఎక్కడ పడితే అక్కడ పెడితే ఎలాగని ప్రశ్నించారు. వాటిని ఒక డబ్బాలో ప్యాక్ చేసి బయో వెస్టేజ్ వెహికిల్‌లో వేసి పంపించాలని సూచించారు. అనంతరం ఆమె ఆస్పత్రిలోని క్యాబోరేటరీ, ఇంజెక్షన్/ డ్రెస్సింగ్ రూమ్, ప్రసూతి గది, ఇన్ పేషెంట్ గదులను పరిశీలించారు.



ఆస్పత్రిలో నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతాయని, గత నెలలో ఎన్ని జరిగాయని అడిగి తెలుసుకున్నారు. ఇన్‌వార్డులో చికిత్స పొందుతున్న ఓ గర్భిణికి సంబంధించిన ఆరోగ్య వివరాల కార్డును పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి బయట నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని, రోగుల బంధువుల నిరీక్షణ గది చుట్టూ, అలాగే ఆస్పత్రి ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగింపు చేసి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఎంపీవో పావనికి సూచించారు.

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన**

మద్వార్ మార్గంలోని శాంతినగర్‌కాలనీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. అక్కడున్న రెండు ఇండ్లల్లో ఒక ఇల్లు ఇంకా బేస్ మెంట్ కూడా పూర్తి కాకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మరికల్ మండల కేంద్రానికి మంజూరైన 65 ఇండ్లల్లో కేవలం 11 ఇండ్ల నిర్మాణాలు బేస్ మెంట్ దశలోనే అది కూడా అసంపూర్తిగా ఉన్నాయని, ఇలాగైతే కుదరదని, ఇంకా బేస్ మెంట్ మార్కింగ్ కానీ వాటిని రద్దు చేయాలని ఆమె ఆదేశించారు. ఇసుక సమస్య, వర్షాల వల్ల ఇండ్ల నిర్మాణాలు ఆలస్యం అవుతున్నాయని అధికారులు తెలపగా వర్షాలు వారం రోజుల నుంచి కురుస్తున్నాయనీ, అంతకు ముందు ఏం చేశారని ప్రశ్నించారు. ఇసుక సమస్య ఉంటే అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య ను పరిష్కరించుకోవాలని, ఇప్పుడు ఇసుక సమస్య ఉందని చెప్తే ఎలాగని తహసిల్దార్ రామ్ కోటిని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని రూ.5 లక్షలతో అమలు చేస్తోందని కానీ మీరు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలాగని అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోనే మరికల్ మండలంలో మంజూరైన 251ఇండ్ల నిర్మాణాలలో చివరి స్థానంలో ఉందని వెంటనే ఇండ్ల నిర్మాణాలలో పురోగతి సాధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## సీఎంఆర్ రైస్ డెలివరీలను త్వరగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ రెవెన్యూ కీమ్యా నాయక్



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 21 (జనంసాక్షి) :** ఖరీఫ్ 2024-25 సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీలను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ కీమ్యా నాయక్ ఆదేశించారు. గురువారం పానగల్ మండలంలోని మేహరూన్, మల్లికార్జున రైస్ మిల్లులను ఆయన తనిఖీ చేసి, ధాన్యం నిల్వలు, ప్రాసెసింగ్ వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని నిర్ణీత గడువులోగా మిల్లింగ్ చేసి, బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని సూచించారు. డెలివరీలో జాప్యం జరిగితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.రైస్ మిల్లు యజమానులు సహకరించి, త్వరగా బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థకు అందించాలని కోరారు.పౌరసరఫరాల శాఖ డీఎం జగన్ మోహన్, డీసీఎస్ఓ కాశీ విశ్వనాథ్, తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి, తదితరులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.

## పారిశుధ్య పనుల కోసం స్థానిక సంస్థలకు తక్షణమే నిధులు మంజూరు చేయాలి



**మక్తల్, ఆగస్టు 21 (జనంసాక్షి) :** పారిశుద్ధ్య పనుల కోసం స్థానిక సంస్థలకు తక్షణమే నిధులు మంజూరు చేసి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు ఎస్ కిరణ్ అన్నారు. సీపీఐ(యం.యల్.) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మక్తల్ ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయి. ప్రభుత్వ నిధులు అందక పోవడంతో స్థానిక సంస్థలు మురికి కాలువలను శుభ్రం చేయలేకపోతున్నాయి. దీని ఫలితంగా మురికి కాలువలు దుర్వాసనతో నిండిపోయి దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ అపరిశుభ్ర వాతావరణం, దోమల బెడద వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని చోట్ల ఈ వ్యాధుల కారణంగా ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. ఈ తీవ్రమైన సమస్యపట్ల అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళనత కలిగిస్తోంది. కావున ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు పారిశుద్ధ్య పనుల కోసం అవసరమైన నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు భగవంతు, జి వెంకట్ రెడ్డి, కొలిమి రాములు, కళ్యాణం రాజు, అయ్యప్ప, లక్ష్మణ్, నరసింహ, రాజు, తోపాటు పాల్గొన్నారు.

# విద్యార్థులే లక్ష్యంగా మాదకద్రవ్యాల అలవాటు

- మాదకద్రవ్యాల మత్తులో పడి విద్యార్థులు నష్టపోవద్దు
- నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి సౌజన్య

**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 21 (జనం సాక్షి) :** విద్యార్థులే లక్ష్యంగా మాదకద్రవ్యాల అలవాటు చేస్తూ కొన్ని ముఠాలు విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేస్తున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి సౌజన్య అన్నారు.గురువారం మహిళా శిశు వికలాంగుల మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆద్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ క్రింద మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా పై వోక్సన్ యూనివర్సిటీ, కంకోల్,విద్యార్థినీ విద్యార్థులకు గురువారం అవగాహనా కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి సౌజన్య మాట్లాడుతూ... ఎన్‌డిపిఎస్ చట్టం పై అవగాహనా కల్పించడం



జరిగిందన్నారు. మాదకద్రవ్యాల సరఫరా ముఠాలు ప్రధానంగా విద్యార్థులనే లక్ష్యంగా చేస్తూ వారిని మాదకద్రవ్యాలకు అలవాటు చేసి వారి ద్వారానే మాదకద్రవ్యాల సరఫరా చేస్తున్నారని అన్నారు. విద్యార్థులు వాటి కోసం నేరాలకు పాల్పడి తమ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. సంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి లలితా కుమారి మాట్లాడుతూ... విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మాదకద్రవ్యాల పై విద్యార్థులకు అవగాహనా కల్పించుటకై వివిధ శాఖల సమన్వయము తో తెలంగాణా ప్రభుత్వము "మిషన్ పరివర్తన" కార్యక్రమమును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాలను సేవిస్తున్న లేదా విక్రయిస్తున్న "నషా ముక్త్ భారత్ అభియాన్" హెల్ప్ లైన్ నెం.14446 ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల దుర్వినియోగం పై జిల్లా అధికారులు పోస్టర్స్ ఆవిష్కరించారు. విద్యార్థులచే నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వోక్సన్ యూనివర్సిటీ డైరెక్టర్ శశికాంత్, ఉపాధ్యాయ యూనివర్సిటీ డీన్ అన్నం నేని శ్రీలత, శ్రీధర్ డైరెక్టర్ అండ్ సెక్యూరిటీ, కాంకోల్ మెడికల్ ఆఫీసర్ రాణి, ఎక్సైజ్ ప్రొహిబిషన్ సబ్ ఇన్స్పెక్టర్ సతీష్, జగదీశ్వర్ పోలీస్ అధికారి , మహిళా జిల్లా సాధికారత సమన్వయకర్త పల్లవి, మహిళా శిశు దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నానో యూరియా వాడకంపై అవగాహన



**చిలప్‌చేడ్, ఆగస్టు 21 (జనంసాక్షి) :** వ్యవసాయంలో నూతనంగా వస్తున్నటువంటి ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని రైతులు అలవర్చుకోవాలని అప్పుడే రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గి అధిక పంటల దిగుబడి పెరిగి అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని వ్యవసాయ సహాయ సంచాలకురాలు ఏడిఏ పుణ్యవతి అన్నారు.వారు మాట్లాడుతూ గురువారం నాడు చిలప్ చేడ్ గ్రామంలో రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. నానో యూరియా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేయబడినటువంటి ప్రత్యేక రకమైన ద్రవరూపమైన ఎరువు అన్నారు దీనివల్ల మొక్కల రంధ్రాల ద్వారా పోషకాలు నేరుగా మొక్కలోకి వెళ్లడం ద్వారా పంటలు దిగుబడిపై గణనీయమైన సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో రైతులు మోతాదుకు మించి ముఖ్యంగా రసాయన ఎరువులు అయినటువంటి యూరియాను మోతాదుకు మించి వాడడం ద్వారా నేల కాలుష్యంతో పాటుగా రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయని, అదే విధంగా సాంప్రదాయ పద్ధతిలో గుళికల రూపంలో వేసినటువంటి ఎరువుల్లో కేవలం 30 నుంచి 40 శాతం మాత్రమే పంట తీసుకోవడం జరుగుతుందని అన్నారు మిగతా ఎరువులు వృధాగా పోయే అవకాశం ఉంటుంది ఈ నానో టెక్నాలజీ ద్వారా తయారు చేసిన నానో యూరియా విధానంలో పత్ర రంధ్రాల ద్వారా నత్రజని ఎరువులు మొక్కలకు 70 నుంచి 80 శాతం సంగ్రహించడం ద్వారా చెరువుల వినియోగ సామర్థ్యం పెరిగి రైతుకు పంట దిగుబడిలో మంచి ప్రభావం చూపుతోందన్నారు ముఖ్యంగా రైతుకు అతి తక్కువ ఖర్చుతో ఈ ద్రవరూప ఎరువులు వాడడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పై వ్యవసాయ శాఖ ద్వారా క్షేత్రస్థాయిలో విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఏడిఏ పుణ్యవతి, ఏవో రాజశేఖర్ గౌడ్, ఏఈఓలు కృష్ణవేణి, అనిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే లయన్స్ క్లబ్ ధ్యేయం

- లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తరింపచేయాలి

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21 (జనం సాక్షి) :** ఉమ్మడి రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ అఫ్ నారాయణ్ పేట్ ఆధ్వర్యంలో గురువారం సివి ఆర్ భవనంలో విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణి చిల్డ్రన్స్ హాస్పిటల్ లో మున్సిపల్ కార్మికులకు దుప్పట్ల పంపిణి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలపంపిణి అన్నదానం సాయి హాస్పిటల్ లో ఉచిత షుగర్ చిన్న పిల్లలమెగా వైద్యశిభిరం తోపాటు వెంకటేశ్వర కంటి హాస్పిటల్ ఉచిత కంటి వైద్యశిభిరం,రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిభిరాలను ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి ప్రారంబించారు.ఈసందర్బంగా ఆమె మాట్లాడుతు సమాజ శ్రేయస్సుకు లయన్స్ క్లబ్ ఓ సైనికునిలా పనిచేస్తుందని లయన్స్ సేవాలు అభినందనీయమని లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సరిత హరి నారాయణ్ బట్టడ్ తో పాటు సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిట్టెం అభిజయ్ రెడ్డి మార్కెట్ చేర్మెన్ సదాశివారెడ్డి వైస్ చేర్మెన్ కొనంగేరి హన్మంతు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సలీమ్ మాజీ మార్కెట్ చేర్మెన్ బండి వేణుగోపాల్ లయన్స్ క్లబ్ కార్యదర్శి సాయినాథ్ కోశాధికారి రాధ సదానంద్ చారి గందె ఉమాకాంత్ శ్రీనివాస్ లాహోటి రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## పేట మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా పారిశుద్ధ్య పనుల కోసం స్థానిక సంస్థలకు తక్షణమే నిధులు మంజూరు చేసి ప్రజారోగ్యం పరిరక్షించాలని మునిసిపల్ కార్యాలయంలో ఆపార్టీ నాయకులు మునిసిపల్ మేనేజర్ హాజీమ్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్ర మానికి అధ్యక్షత కెంచ నారాయణ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ టౌన్ కార్యదర్శి మండల కార్యదర్శి బి. నరసింహ మాట్లాడుతూ నారాయణపేట మున్సిపల్ పరిధిలో అధిక వర్షాల వల్ల పట్టణం లో పారిశుద్ధ్య పరిస్థితులు అత్యంత అద్వానంగా ఉన్నాయని ప్రభుత్వ నిధులు అందకపోవడంతో స్థానిక సంస్థలు మురికి కాలువలను శుభ్రం చేయలేకపోతున్నాయి దీని ఫలితంగా మురికి కాలువలు దుర్వాసనతో నిండిపోయి దోమలు ఈగలు విపరీతంగా పెరిగిపోయాయి.ఈ అపరిశుభ్ర వాతావరణం, దోమల బెడద వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా డెంగు, మలేరియా వంటి జ్వరాలు ప్రబలి, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్నిచోట్ల ఈ వ్యాధుల కారణంగా ప్రాణాలు కోల్పోతున్న ఘటనాలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ తీవ్రమైన సమస్యల పట్ల అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యంగా వివరించడం ఆందోళన కలిగిస్తుంది. కావున ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాస్ లైన్ పార్టీ టౌన్ నాయకులు సాదిక్, నజీర్, సతీష్, రోషన్, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సవాలలో డీజేలకు అనుమతి లేదు

- జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్


**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 21 (జనం సాక్షి) :** ఉత్సవాల్లో డిజేలకు అనుమతి లేదని నారాయణపేట జిల్లా ఎస్పి యోగేష్ గౌతం స్పష్టం చేశారు. రాబోయే మిలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా నారాయణపేట జిల్లాలోని ముస్లిం మత పెద్దలతో ఎస్పీ కార్యాలయంలో శాంతి సమావేశం నిర్వహించారు. రాబోయే పండుగలు మిలాద్ ఉన్ నబి, వినాయక చవితి పండగల సందర్భంగా ప్రజలకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే పండుగలను ప్రజలంతా శాంతియుతంగా మత సామరస్యంతో కులమ తాలకు అతీతంగా తమ పండగలను జరుపుకోవాలని అందుకు పోలీస్ శాఖ నుండి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. నారాయణపేట జిల్లా పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మరియు మత పరమైన ఉత్సవాలలో డిజేలకు అనుమతి లేదని తెలిపారు. పెద్దలు, చిన్న పిల్లలు మరియు ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని డిజేలను నిషేధించడం జరిగిందని ఇది అందరూ పాటించాలని తెలిపారు. లేనియెడల



ఎవరైనా డీజేలు పెడితే సీజ్ చేసి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అలాగే పండుగల సందర్భంగా జెండాలు కట్టే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎప్పుడూ కట్టే దగ్గరనే కట్టాలని కొత్త స్థలాలలో జెండాలను కట్టరాదని సూచించారు. జండాలు కట్టే సమయంలో పోలీసులకు సమాచారం ఇస్తే మున్సిపల్ రెవెన్యూ అధికారులతో కలిసి ఏలాంటి సమస్యలు లేకుండా చూస్తారని తెలిపారు.అలాగే తమ పండుగలు అయిపోయిన వెంటనే జెండాలను తీయాలని లేని యెడల మున్సిపల్ అధికారుల సమక్షంలో జెండాలను తీయించడం జరుగుతుందని తెలిపారు.ముస్లిం మత పెద్దల సూచించిన సమస్యలను నోట్ చేసుకోవడం జరిగిందని మునుముందు పండగాలు సజావుగా జరిగేందుకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు.రాబోయే పండుగలకు పోలీస్ స్టేషన్లో పరిధిలో శాంతి సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని అప్పుడు అన్ని డిపార్ట్మెంట్లు, అన్ని మతస్తుల ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొని సమస్యలు తెలపాలని ఎస్పీ సూచించారు.ప్రజలంతా ఇతర మతస్తులను గౌరవిస్తూ తమ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.పండగల సమయంలో ఎవరికైనా, ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్న సంబంధిత పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. పండుగలు సజావుగా జరిగేందుకు పోలీస్ శాఖకు ప్రజలంతా సహకరించాలని ఎస్పీ కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ యండి రియాజ్ హుల్ హక్, సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు, జిల్లా పరిధిలోని ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు సరిపడేంత యూరియాను కేటాయించండి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రికి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 21 (జనం సాక్షి) :** హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్ నందు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి గద్వాల జిల్లాకు తక్షణమే తగినంత యూరియాను కేటాయిచాలని, అదేవిధంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల గురించి వినతి పత్రం అందజేసారు. గద్వాల అభివృద్ధికి సహకరించాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. మంత్రి సానుకులంగా స్పందించి త్వరలోనే జిల్లాకు తగినంత యూరియాను అందే విధంగా మిగతా సమస్యలను పూర్తి చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ బలోపేతం కోసం చర్యలు

- ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకల సదుపాయాలు
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 21 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలం బాబా నగర్ గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల, వసతి గృహం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, త్రాగునీరు, తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించి, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్య బోధన చేయడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గడ్ పూర్ గ్రామంలోని పల్లె దవాఖానాను సందర్శించి మందుల నిల్వలు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వైద్యులు, సిబ్బంది వృద్ధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. లబ్ధిదారులు నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో మాత్రమే ఇల్లు నిర్మించుకునేలా వారికి అవగాహన కల్పించాలని, నిర్మాణ పనులు చేపట్టి త్వరగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. చిన్న గోపాలపూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్య బోధనతో పాటు విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ర్యాలీ గ్రామంలోని ఎస్.సి. కాలనీలో జ్వరం బారిన పడిన 10 మంది నివాసం ప్రాంతాలను హౌసింగ్ పి.డి. బన్సీలాల్ తో కలిసి పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, నీటిని కాచి చల్లార్చి వడపోసి త్రాగే విధంగా ప్రజలకు వివరించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేయాలని తెలిపారు.

# గణేష్ మండపాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** గణేష్ మండపాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌లు అన్నారు. ఈ నెల 27వ తేదీన వినాయక చవితి పండుగ సందర్భంగా ఉత్సవాలను శాంతియుతంగా, భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహించేందుకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వినాయక చవితి ఉత్సవ శాంతియుత సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అధ్యక్షతన హిందూ సమాజ ఉత్సవ సమితి సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా, సామరస్యంతో ఉత్సవాలను నిర్వహించుకోవాలని అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సమన్వయం తో పనిచేసి ప్రశాంత వాతావరణంలో వినాయక చతుర్థి, మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు మతసామరస్యానికి ప్రతీకగా వేడుకలు జరిగేలా తోడ్పాటును అందిస్తామని అన్నారు. జిల్లాలో గత 50 సంవత్సరాల నుండి శాంతియుత వాతావరణంలో ఈ వేడుకలు జరుగుతున్నాయని ఈసారి కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శిస్తూ గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని అన్నారు. గతేడాది తరహాలోనే ఈసారి కూడా వినాయక నిమజ్జనం, మిలాద్-ఉన్-నబీ వేడుక వెంటవెంటనే వస్తున్నాయి అని భద్రతాపరమైన చర్యలకు జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద డీ.జే సౌండ్లను నిషేదించడం జరిగిందని , మండపాల వద్ద భక్తి పాటలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా నిర్వాహకులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా మండపాల వద్ద రాత్రి సమయంలోనూ నిర్వాహకులు తప్పనిసరిగా బస చేయాలని సూచించారు.ప్రజలు ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకూడదని, ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తేవాలని, ప్రతి ఒక్కరు సంయమనం పాటిస్తూ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ఎస్పీ సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల వద్ద సి.సి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

మట్టి విగ్రహాలను ప్రతిష్టించాలని తెలిపారు. గణేష్ మండపాల వద్ద సీ.సీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ఉంటుందన్నారు.గణేష్ వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు అందరి సమన్వయం తో విజయవంతం చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, డీఎస్పీ జీవన్ రెడ్డి, సబ్ కలెక్టర్ యువరాజ్, , ట్రైనీ కలెక్టర్ సలోని, ఆర్డీవో స్రవంతి, జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.



## పిఎం అవాస్ యోజన సర్వే పనులను నెలాఖరు లోపు పూర్తిచేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో పిఎం అవాస్ యోజన సర్వే పనులను ఈ నెలాఖరు లోపు పూర్తిచేసి ఆన్లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయం నుండి గృహ నిర్మాణ, ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 55,444 ఇండ్లు సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 3,359 ఇండ్లు మాత్రమే సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. సర్వే పనులను వేగవంతం చేసి ప్రతిరోజూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని సర్వే పూర్తి చేయాలని ఆయన సూచించారు. ప్రతి రోజు సర్వే నివేదికలు తనకు అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎంపిడీవోలు సర్వే పూర్తి చేయడాన్ని చాలా సీరియస్ గా తీసుకోవాలని తెలిపారు. కాటారం డివిజన్ లో చాలా నత్తనడకన జరుగుతున్నదని వేగం పెంచాలని ఆదేశించారు. వేగం పెంచేందుకు ఎంపిడీవోలకు అదనపు లాగిన్స్ కూడా ఇచ్చామని, డ్రైవ్ చేపట్టి పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, ఆయా మండలాల ఎంపిడిఓ లు పాల్గొన్నారు.

## మల్లూరు క్షేత్రం నూతన ఆలయ ఈవోగా మహేష్



**మంగపేట, ఆగస్ట్ 21 (జనంసాక్షి) :** మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన కార్యనిర్వహణాధికారి గా గురువారం బాధ్యతలు స్వీకరించిన మహేష్. ప్రస్తుతం మల్లురు క్షేత్రంలో కార్యనిర్వహణ అధికారిగా విధులు నిర్వహిస్తున్నటువంటి శ్రవణం సత్యనారాయణ ను దేవాదాయ ధర్మాదాయశాఖ ఉత్తర్వుల మేరకు బదిలీ చేయగా నూతన ఈవో గా మహేష్ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆలయ అర్చకులు నూతన ఈవో మహేష్ కు స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రస్తుత ఈవో శ్రవణం సత్యనారాయణ నూతన ఈవో మహేష్ ను కుర్చీలో కూర్చోబెట్టి బాధ్యతలను అప్పగించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చెన్నూరు ఎస్బిఐలో అవకతవకలు

- పరారీలో బ్యాంక్ క్యాషియర్ రవీందర్



**చెన్నూర్ ఆగస్ట్ 21 (జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని ఎస్బిఐ బ్యాంక్ బ్రాంచ్2 పాత బస్ స్టాండ్ లో అవకతవకలు జరిగినట్లుగా అధికారులు గుర్తించారు. ఉదయం నుండి బ్యాంకును లోపల నుండి మూసి వేసి పోలీసులు బ్యాంక్ అధికారులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. బ్యాంకును పరిశీలించిన రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా బ్యాంకు లోపల పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్టు తెలిపారు. అన్ని కోణాల్లో విచారణ చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. బ్యాంకులో ఎంత మేర అవకతవకలు జరిగాయో, ఆడిట్ పూర్తి అయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని, బ్యాంకులో క్యాషియర్ గా పని చేస్తున్న రవీందర్ మిస్సింగ్ లో ఉన్నాడు. చెన్నూరు ఎస్బిఐ బ్యాంక్ క్యాషియర్ రవీందర్ కొంత అమౌంట్ గల్లంతు చేసి పరారయ్యారు.

## వెజ్, నాన్ వెజ్ మార్కెట్ కోసం స్థల పరిశీలన

- కొత్త మార్కెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలి
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 21(జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలో నూతనంగా వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణమునకు ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ గురించి అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం బండారుపల్లిలోని జిల్లా పశు వైద్యశాఖ కార్యాలయ ఆవరణము ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఒకే మార్కెట్ ఉన్నందున, జిల్లా పశు వైద్య శాఖ కార్యాలయ ఆవరణంలో కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం వెజ్ నాన్ వెజ్ మార్కెట్ ను నిర్మించుటకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ సంపత్, పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, జిల్లా పశు వైద్య శాఖ అధికారి కొమురయ్య, ములుగు తహసిల్దార్ విజయభాస్కర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- సోషల్ మీడియా గ్రూపులో ఫుడ్ పాయిజన్ అయినట్లు వస్తున్న మెసేజ్ లు అవాస్తవం
- డిఈఓ రాజేందర్



**చిట్యాల, డిసెంబర్ 21 (జనంసాక్షి) :** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యా శాఖాధికారి రాజేందర్, ఇన్చార్జి జిల్లా వైద్యాధికారి సునీత అన్నారు. ఈ మేరకు గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని కొర్కిశాల కస్తూర్బా గాంధీ స్కూల్లో 8 మంది విద్యార్థులకు వైరల్ ఫీవర్, నలుగురు విద్యార్థులకు జ్వరంతో వాంతులు రావడంతో పిహెచ్సి హెల్త్ ఆఫీసర్ నాగరాణి హెల్త్ క్యాంప్ నిర్వహించి పిల్లలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో సోషల్ మీడియా గ్రూపులో ఫుడ్ పాయిజన్ జరిగిందని వస్తున్న సందేశాలపై వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడం కోసం డీఈవో రాజేందర్, ఇన్చార్జి జిల్లా వైద్యాధికారి సునీత, మొగుళ్లపల్లి ఎస్సై అశోక్ విద్యార్థులతో మాట్లాడి ఎస్ ఓ శైలజను వైరల్ ఫీవర్స్ కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. హొటల్ నుండి వచ్చే ఆహార పదార్థాలు అనుమతించొద్దని సూచన చేశారు. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెను ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎస్ ఓ శాలజకు పలు సలహాలు సూచనలు చేశారు. గతంలో ఫుడ్ పాయిజన్ కాగా,సోషల్ మీడియా గ్రూపులో మళ్లీ ఫుడ్ పాయిజన్ అయినట్లు వస్తున్న మెసేజీలు ముమ్మాటికి అవాస్తమని, పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దని అన్నారు.

## విద్యార్థులు శారీరక శ్రమ, యోగతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- జిల్లా వైద్యాధికారి గోపాలరావు



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 21(జనంసాక్షి) :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు ములుగు పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ స్కూల్ మరియు కాలేజ్ బాలికల తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియం హాస్టల్లో జరుగుతున్న ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని సందర్శించి విద్యార్థినిల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని హాస్టల్ నందు ఉన్న వెల్నెస్ సెంటర్ ను, వంటశాలలో వండుతున్న ఆహార పదార్థాల తీరుతెన్నులను, కూరగాయల నిల్వలను మరియు వాటర్ ట్యాంక్ ని పరిశీలించిన తరువాత విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎం అండ్ హెచ్ఓ గోపాలరావు మాట్లాడుతూ, పోషకాహారము, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, శారీరక శ్రమ, యోగ చేసినట్లయితే విద్యార్థులందరూ ఆరోగ్య వంతులు అవుతారని అప్పుడే ఉన్నత లక్ష్యాలతో కూడిన కొలువులను సాధిస్తారని విద్యార్థులకు హిత బోధ చేశారు. ఈ వర్షాకాలంలో దోమల వల్ల మలేరియా, డెంగ్యూ వ్యాధులు వస్తాయని వీటిని నియంత్రించుటకు ప్రతి విద్యార్థిని పూర్తిగా శరీరాన్ని కప్పి ఉంచే ఇది అయిపోయింది దుస్తులను వేసుకోవాలని, కిటికీలను సాయంత్రం ఐదు గంటలకే మూసివేయాలని, మస్కిటో కాయలను వాడాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 35 మంది విద్యార్థినీలకు వైద్య సేవలు అందించమని ఇందులో 10 మంది జ్వరంతో బాధపడుతుండగా వారికి మలేరియా డెంగ్యూ ఆర్డిటి పరీక్షలు నిర్వహించగా మలేరియా డెంగ్యూ నిర్ధారణ కాలేదని ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ నవ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమో సంపత్, రెసిడెన్షియల్ కాలేజ్ ప్రిన్సిపాల్ బి నర్మదా భాయ్, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, హెల్త్ సూపర్వైజర్ జాయ్ సి, ఆరోగ్య కార్యకర్తలు రవి, నర్సమ్మ, ఆశా కార్యకర్త రాజమణి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరతలేదు

రైతులందరికి అందుతాయి
కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**పాలకుర్తి, ఆగస్టు 21(జనంసాక్షి) :** యూరియా కోసం రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా కలెక్టర్ రిజ్వాన్బాషాషేక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలు, మన గ్రోమోర్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేసి సందర్శించారు. ఈ సం దర్భంగా రిజిష్టర్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్లో పర్టిలైజర్ల దుకాణాల్లో కూడా రైతులకు సరిపడు యూరియా ఉందని రైతులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఫర్టిలైజర్ వ్యాపారులు స్టాక్ బోర్డులు షాపు బయట. ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒక్కో రైతులు రెండు బస్తాలే కాదు రైతుకు సరిపడు యూరియా తీసుకెళ్లవచ్చని అన్నారు. మండల కేంద్రంలోని కళ్యాణమండపాన్ని కూడా సందర్శించి పరిశీలించారు. అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎప్పటికప్పుడు డీఆర్డీవో పీడీ వసంత జరగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించాలని ఆదేశించారు. పనులు పూర్తికాగానే కళ్యాణ మండపాన్ని మండల సమాఖ్యకు అప్పగించాలని ఆదేశించారు. ఆయన వెంట డీపీవో స్వరూప, డిఆర్డిఓ పిడి వసంత, ఏ డి ఏ పరశురాం, ఎంపీడీవో రవీందర్ తదితరులు ఉన్నారు.

## ఎరువుల సరఫరాలో అవకతవకలు లేకుండా చూడాలి

- జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్



**నిర్మల్ రూరల్, ఆగస్టు21 (జనంసాక్షి) :** జిల్లాలోఎరువుల సరఫరా లో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తెలిపారు.గురువారం నిర్మల్ గ్రామీణ మండలం చిట్యాలలోని అభయ కృషి ఎరువులు,విత్తనాల దుకాణాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన కిషోర్ కుమార్ మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.జిల్లాలో ఎరువుల కొరత లేదని, యూరియా,డీఏపీ సహా అవసరమైన ఎరువులు సరిపడా స్టాక్‌లో ఉన్నాయని తెలిపారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు మాత్రమే ఎరువులను వినియోగించాలని సూచించారు.ప్రతి షాపులో ఎరువుల రేటు చార్ట్ తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు.ఈ పరిశీలనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్,సంబంధిత అధికారులు,రైతులు పాల్గొన్నారు.

## నిధులను రోడ్ల విస్తరణలకు కేటాయించాలని మంత్రికి వినతి



**ఖానాపూర్ ఆగస్టు 21 (జనం సాక్షి) :** నియోజకవర్గంలో రోడ్ల బలోపేతం కోసం కాకుండా రోడ్ల విస్తరణ పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ వినతిపత్రం సమర్పించారు. ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రం నుండి బెల్లాల, తర్లపాడు, ఉట్నూర్ డివిజన్ కేంద్రం నుండి గుడిహత్నూర్, హస్నాపూర్ నార్నూర్ చౌరస్తా, కలమడుగు నుండి జన్నారం, జన్నారం నుండి కవ్వాల రోడ్ల బలోపేతానికి మంజూరు ఇచ్చారని అలా కాకుండా ఆ రోడ్లు వెడల్పుకు కేటాయించవలసిందిగా కోరుతూ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వెడ్మా బొజ్జు పటేల్ వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు రోడ్డు విస్తరణల కోసం వినతులు ఇచ్చారని వాటిని దృష్టిలో ఉంచుకొని మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరినట్లు ఎమ్మెల్యే వివరించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
22 ఆగస్టు 2025

# ఇన్వెస్టిగేషన్ మెళకువలు తప్పనిసరిగా నేర్చుకోవాలి

- ప్రతి కేసులో నాణ్యమైన ధర్యాప్తును చేయాలి
- ప్రజలకు వివిధ రకాల నేరాల గురించి అవగాహన కల్పించాలి
- పోలీస్ కార్యాలయంలో లో మంత్లీ క్రైమ్ రివ్యు సమావేశం
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 21 (జనం సాక్షి) :** పోలీసు అధికారులు ఇన్వెస్టిగేషన్ మెళకువలు తప్పనిసరిగా నేర్చుకోవాలని జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ పేర్కొన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అండర్-ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, మిస్సింగ్ మరియు ఎబ్.బి.డబ్ల్యూ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్వెస్టిగేషన్ లో వేగం పెంచాలని ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేయాలని అధికారులకు సూచనలు చేశారు. పోక్సో, అత్యాచార కేసులలో వీలైనంత తొందరగా ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలని, అందుకు భరోసా సెంటర్ సేవలను వినియోగించుకోవాలని అన్నారు. ఇన్వెస్టిగేషన్లో ఏవైనా సందేహాలు ఉంటే ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకొని, నివృత్తి చేసుకోవాలని, ఎన్.బి.డబ్ల్యూ పెండింగ్ కేసులలో సబ్-డివిజన్ పరిదిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పెండింగ్స్ తగ్గించాలని అన్నారు. ఎస్.హెచ్.ఓ లు ప్రతిరోజు సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బంది యోగక్షేమాలు తెలుసుకోవాలని, సిబ్బందికి సమస్యలున్నట్లైతే వెంటనే స్పందించాలన్నారు. మహిళా సిబ్బంది పట్ల మర్యాదగా నడుచుకోవాలని, పోలీసు స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారులతో



మర్యాదగా మాట్లాడాలని, వారి సమస్యను ఓపిగ్గా విని, వారి సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయవలసిందిగా సూచించడం జరిగింది. ఎస్.హెచ్.ఓలు తమ పరిధిలో గల అన్ని గ్రామాలను నెలలో ఒకసారైనా సందర్శించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ, మన చుట్టూ జరుగుతున్న వివిధ రకాల నేరాలు, ఆన్లైన్ మోసాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. బ్లూకోల్ట్స్ మరియు నైట్ పెట్రోలింగ్ సిబ్బంది "ఫింగర్‌ప్రింట్ డివైస్" లను వినియోగిస్తూ.. అనుమానాస్పద వ్యక్తుల ఫింగర్ ప్రింట్స్ సేకరించాలన్నారు. నూతన చట్టాలపై సిబ్బంది, అధికారులు అవగాహన కలిగి ఉండాలని, చిన్నపిల్లల్ని విచారించేటప్పుడు చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్లో, సాధారణ దుస్తువులు దరించి, ఫ్రెండ్లీ వాతావరణంలో విచారించాలని అన్నారు. సబ్-డివిజన్ పరిధిలో 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం" నిర్వహిస్తూ కొత్త వ్యక్తులను గుర్తించాలని, సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయాలని అధికారులకు సూచించారు. ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది కలిసి నేరం చేసినట్లయితే, వారిపై గ్యాంగ్ కేసులను నమోదు చేయాలని అన్నారు.

### గణేష్ చతుర్థి, మిలాద్-ఉన్-నబీ పండగలపై ప్రత్యేక నిఘా....

గణేష్ చతుర్థి, మిలాద్-ఉన్-నబీ పండగలు ఏక కాలంలో వస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆయా మండల కేంద్రాలలో పీస్ కమిటీ మరియు డిపార్ట్మెంటల్ కోఆర్డినేషన్ మీటింగ్స్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. సబ్-డివిజన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన త్వరితగతిన స్పందించడానికి "క్యూ.ఆర్.టి" (క్విక్ రియాక్షన్ టీం) లను ఏర్పాటు చేయాలని డీఎస్పీలకు సూచించారు. గణేష్ చతుర్థి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని లౌడ్ స్పీకర్స్, మైక్స్ పరిమిత లిమిట్లో, నిర్దిష్ట సమయం వరకే వినియోగించేలా మండప యజమానులకు గైడ్ చేయాలని అధికారులకు ఎస్పీ సూచించారు.

అనంతరం వివిధ కేసులలో నిందితులకు జీవిత ఖైదు పడేలా వాదనలు వినిపించిన, పి.పి శైలజ, విజయ్ శంకర్ రెడ్డి, సత్యనారాయణ, రాజేశ్వర్, సూర్ రెడ్డి లను ఎస్పీ అభినందించి, సత్కరించడం జరిగింది. అదే విధంగా వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించి, రివార్డ్ లు అందజేశారు. సమీక్షా సమావేశంలో సంగారెడ్డి డియస్పి సత్యయ్య గౌడ్, పటాన్ చెర్వు డియస్పి ప్రభాకర్, జహీరాబాద్ డియస్పి సైదా నాయక్, నారాయణ ఖేడ్ డియస్పి వెంకట్ రెడ్డి,సైబర్ క్రైమ్ డియస్పి వేణుగోపాల్ రెడ్డి, డీసీఆర్బీ డియస్పి సురేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్.బి ఇన్స్పెక్టర్ కిరణ్, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, ఎస్.నాబ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రావ్, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ రవి, జిల్లా ఇన్స్పెక్టర్స్, సబ్ఇన్స్పెక్టర్స్, తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వయంకృషితో ఎదగాలి



**ఘట్‌కేసర్, ఆగస్టు 21 (జనంసాక్షి) :** దేశానికి వెన్నెముక రైతు ఎలాగో, దేశాభివృద్ధికి యువత కృషితో, పట్టుదలతో అభివృద్ధిని సాధించాల్సిన అవసరం అంతే వుందని, ప్రపంచ దేశాలలో ఉన్న యువత కంటే భారతదేశంలోని యువత శాతం అత్యధికంగా ఉన్నదని, ఆ యువత మొత్తం కష్టపడితే ప్రపంచంలోనే అత్యధిక అభివృద్ధి దేశంగా తయారవుతుందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో యువత స్వయంకృషితో ముందుకు వచ్చి ఎదగాలనీ,. అందుకు ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుందని, యువకులు ఉన్నత విద్యను చదువుకోవడంతో పాటు, సమాజంలో పైకి రావాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సాయి ఇంటీరియల్ %డ% ఎంటర్ప్రైజెస్ వాణిజ్య సంస్థను ఈ సందర్భంగా ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం వేచి చూడకుండా తనకు నచ్చిన పనిని ఉపాధిగా మనసుకుని తాను పైకి రావడంతో పాటు పదిమందికి ఉపాధి కల్పించడం సంతోషదాయకమన్నారు. ములుగు ప్రాంతంలో పుట్టి పెరిగిన తరుణ్ అనే యువకుడు హైదరాబాద్ నగరానికి వచ్చి తనకు తెలిసిన విద్యలో ఇంటీరియర్స్, ఎంటర్ప్రైజెస్ డెకరేషన్స్ వాణిజ్య సంస్థ ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. స్థాపించిన వ్యాపారంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని అందుబాటు ధరల్లో ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బి- బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కోడూరి రమేష్ గౌడ్ , మార్క సాయి గౌడ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన నిర్మించుకోవాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 21 (జనం సాక్షి) :** తమకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు త్వరిత గతిన నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు.గురువారం ధన్వాడ మండల కేంద్రంలోని బీసీ కాలనీ నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను ఆమె పరిశీలించారు.ఆ కాలనీ లో మొత్తం నాలుగు ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగు తుండగా కలెక్టర్ మూడు ఇళ్లను చూశారు.ఒక ఇల్లు స్లాబ్ దశలో, మరో ఇల్లు బేస్ మెంట్, ఇంకో ఇల్లు స్లాబ్ పూర్తయింది. స్లాబ్ పూర్తయిన ఇంటిని చూసిన కలెక్టర్ ఆ ఇంటి లబ్ధిదారు రాలైన శారద ను శాలువాతో సన్మానించారు. ధన్వాడ మండలానికి 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా అందులో ధన్వాడ మండల కేంద్రానికి 102 ఇండ్లు మంజూరు అయ్యాయని వాటిలో స్లాబ్ పూర్తయిన మొదటి ఇల్లు మీదే అని ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెను అభినందించారు. ఇండ్లను దశల వారీగా త్వర త్వరగా నిర్మించుకుంటే డబ్బులు జమ అవుతాయని, మండలంలో మిగతా ఇండ్ల నిర్మాణాలను కూడా తొందరగా నిర్మించుకునేలా అధికారులు లబ్ధిదారులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

## ప్రజలకు ఉత్తమ సేవలు అందించండి

**తాండూరు, అగస్టు 21 (జనంసాక్షి) :** పట్టణ ఉత్తమ సేవలు అందించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. తాండూరు మున్సిపల్ కమీషనర్ విక్రమ్ సింహారెడ్డిని ఇక్కడి నుంచి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో యాదగిరిని నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని నూతన కమీషనర్ యాదగిరి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను సన్మానించి..



మొక్కను అందజేశారు.ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కమీషనర్ యాదగిరికి అభినందనలు తెలిపారు. తాండూరు మున్సిపల్ కమీషనర్ గా ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి దృష్టిసారించాలన్నారు. పార్టీలకతీతంగా సేవలను అందించాలని ఆదేశించారు. అనంతరం కమీషనర్ యాదగిరి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలందరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, ఆగస్టు 21 (జనం సాక్షి) :** ప్రజలందరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని యూరియా కావాలంటే ఇతర ఎరువులు కొనాలని రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఫర్టిలైజర్ దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. గురువారం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో మున్సిపాలిటీలో7 వార్డులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా పరిసరాలను పరిశీలించిన అనంతరం ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత వారం రోజులుగా భారీ వర్షాలు పడినాయని, వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించామన్నారు. మలేరియా డెంగ్యూ చికెన్ గున్యా వంటి వ్యాధులు దరిచేరకుండా ఉండాలంటే ప్రజలందరూ వ్యక్తిగత శారీరక పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారిస్తూ నీరు నిలవ లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటితో బాటు, వేడి వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని ప్రజలందరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలిస్తూ వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇండ్ల నిర్మాణ పనులు వేగం



పెంచి త్వరిత గతిన పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లాలో యూరియా సరఫరా పై ఆయన మాట్లాడుతూ జూలై ఆగస్టు మాసాలకు అవసరాన్ని తగ్గట్టుగా యూరియా నిల్వలు ఉన్నాయని వదంతులు నమ్మవద్దని సెప్టెంబర్ మాసానికి సంబంధించి 4వేల నుంచి 5 వేల మెట్రిక్ టన్నులు యూరియా ఇండెంట్ ఉన్నదని సెప్టెంబర్ లో కొనాల్సిన యూరియాను ఇప్పుడే కొనుగోలు చేసే విధంగా రైతులు క్యూ కడుతున్నారని రద్దీ నెలకొని ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రైతులందరికీ అవసరమైన యూరియా అందుబాటులో ఉంచుతామని ఫర్టిలైజర్ షాప్ యజమానులు ఇతర ఎరువులు కొంటే యూరియా ఇస్తామని రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జూబ్లీఎన్‌క్లేవ్‌లో ఆక్రమణలు తొలగింపు

- పార్కులతో పాటు రహదారులను కాపాడిన హైడ్రా

**హైదరాబాద్, ఆగస్టు 21 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మాధాపూర్ ప్రాంతంలోని జూబ్లీ ఎన్‌క్లేవ్‌లో పార్కులతో పాటు రహదారుల ఆక్రమణలను గురువారం తొలగించింది. 22.20 ఎకరాలలో దాదాపు 100 ప్లాట్లతో అనుమతి పొందిన ఈ లే ఔట్‌లో 4 పార్కులుండగా 2 కబ్జా(దాదాపు 8 వేల 500 గజాలు)కు గురయ్యాయి. అలాగే 5 వేల గజాల మేర రోడ్డు కూడా కబ్జా అయ్యింది. వీటికి తోడు.. దాదాపు 300ల గజాల ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలిసిన హోటల్ షెడ్డును కూడా హైడ్రా తొలగించింది. యిలా మొత్తం 16000 గజాల స్థలాన్ని హైడ్రా కాపాడింది. దీని విలువ దాదాపు రూ. 400ల కోట్ల వరకు ఉంటుంది. 1995లో అనుమతి పొందిన ఈ లే ఔట్ ను 2006లో ప్రభుత్వం రెగ్యులరైజ్ కూడా చేసింది. ఈ లే ఔట్ ప్రకారం %+నవీజ%కి గిఫ్ట్ డీడ్ చేసిన పార్కులను జైహింద్‌రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేశారంటూ జూబ్లీ ఎన్‌క్లేవ్ లే ఔట్ ప్రతినిధులు హైడ్రా



ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారించిన హైడ్రా అధికారులు కబ్జాలు వాస్తవమే అని నిర్ధారించుకున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు వాటిని గురువారం తొలగించారు. హైడ్రా ఏసీపీ శ్రీకాంత్, ఇన్స్పెక్టర్లు రాజశేఖర్, బాలగోపాల్ నేతృత్వంలో ఈ కూల్చివేతలు జరిగాయి. వెనువెంటనే పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు సూచిస్తూ బోర్డులు కూడా పెట్టారు. పార్కులు, ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేసారు. కబ్జాకు పాల్పడ్డవారిపై పోలీస్ కేసులు కూడా పెడుతున్నట్టు హైడ్రా అధికారులు తెలిపారు.

## ఇంజనీరింగ్ విద్యతో బంగారు భవిష్యత్

- జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డైరెక్టర్ కంఠం మహేందర్ రెడ్డి




**మొయినాబాద్, ఆగస్టు 21 (జనం సాక్షి) :** ఇంజనీరింగ్ విద్యలో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు బంగారు జీవితాలు ఉన్నాయని క్రమశిక్షణతో మెలిగినప్పుడే అవి మీకు వరిస్తాయని జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా హైదరాబాద్ మాజీ డైరెక్టర్ కంఠం మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం అందాపూర్ చౌరస్తాలోని జోగినిపల్లి బిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ లో చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ డేను ఆ విద్యాసంస్థల ఆర్కిటెక్చర్ కళాశాలల జాయింట్ సెక్రెటరీ, గాయత్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కంఠం మహేందర్ రెడ్డితో పాటు హరే రామ హరే కృష్ణ హైదరాబాద్ మూమెంట్ కృష్ణదాస్ ప్రభుజి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రపంచంలో ఉన్నతమైన విద్య ఇంజనీరింగ్ విద్య అని అన్నారు. ఈ విద్యలో అభ్యసించే విద్యార్థులు నాణ్యమైన విద్యను అందిపుచ్చుకోవాలన్నారు. అప్పుడే ఉద్యోగ అవకాశాలు భవిష్యత్తుకు లభిస్తాయని సూచించారు. క్రమశిక్షణ అలమరుచుకున్నప్పుడే. బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. నేటి పోటీ ఉద్యోగ విద్యలో విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యం గల పరిజ్ఞానంతో పరిశోధన అభ్యసించినప్పుడే ఉద్యోగాలను అందిపుచ్చుకుంటారని తెలిపారు. జోగినిపల్లి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని విధాలుగా ఏర్పాటు చేయడం జరిగిందని జాయింట్ సెక్రెటరీ గాయత్రి అన్నారు. కళాశాలలో పరిశోధనతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయడం జరిగిందని పేర్కొన్నారు. భాస్కరరావు విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ కృషితోనే ఉన్నత విద్య అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జెబీఆర్ఈసి కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్, టీవీఎస్ రమణమూర్తి, విద్యార్థులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియాను పంపిణీ చేయాలి



**అమరచింత, ఆగస్టు 21 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో దగ్గర యూరియా కోసం క్యూ లైన్ రైతులు తెలంగాణ చెరుకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఎస్ గోపి. తెలంగాణ రైతు సంఘం జిల్లా కోశాధికారి బి.వెంకటేష్. తెలంగాణ వ్యవసాయ జిల్లా ఉపాధ్యక్షులు.యస్.అజయ్ లు డిమాండ్ చేశారు. గురువారం నాడు ఆత్మకూరు మండల కేంద్రంలోని పిఎసిఎస్ వద్ద రైతులతో కలిసి వారు ఆందోళన నిర్వహించారు. వ్యవసాయ సీజన్లో రైతులు పొలాల్లో ఉండాల్సిన వారు యూరియా కొరత వల్ల రోజుల తరబడి వ్యవసాయ పనులను వదిలిపెట్టి పిఎసిఎస్ ఫర్టిలైజర్ షాపుల వద్ద రోజుల తరబడి రైతులు వేచి ఉన్నప్పటికీ యూరియా సరఫరా లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి అని వారు ఈ సందర్భంగా.విమర్శించారు అన్ని రాష్ట్రాలకు సమానంగా యూరియాను పంపిణీ చేయాల్సిన కేంద్ర లోని బీజేపీ. తెలంగాణ రాష్ట్రం పట్ల చిన్నచూపు తో కేటాయించిన యూరియా కంటే తక్కువగా సరఫరా చేయడంతో రాష్ట్రంలో రైతులుతీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలకు సైతం రైతులు లెక్కచేయక ఆయా పిఎసిఎస్ లు ఫర్టిలైజర్ల షాప్ లదగ్గర పగలనక రాత్రనక యూరియా కోసం లైన్లో నిలబడి చేతగాని దీనవస్థలో తప్పని పరిస్థితుల్లో రైతులు చెప్పులు లైన్లో పెట్టి విరామం తీసుకునే దుస్థితికి బిజెపి ప్రభుత్వం రైతులను దిగదార్చిందని విమర్శించారు. కేంద్రంపై రాష్ట్రం రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వాలు ఒకరికొకరు విమర్శించుకోవడానికి కాలయాపన సరిపోతుందని. కానీ యూరియా సరఫరా లో మాత్రం రైతులకు చుక్కలు చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన యూరియాను వెంటనే రవాణా ద్వారా పంపి రైతుల అవస్థలను తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనకు స్పందించి వచ్చినటువంటి సీఐ శివకుమార్ గారితో సంఘం నాయకులు మాట్లాడి అక్కడ ఉన్న ప్రతి రైతులకు యూరియా కు చిట్టి ల రూపంలో అందించే విధంగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈరోజు లైన్ లో ఉన్న రైతులందరికీ చిట్టీలు పంపిణీ చేయడం జరిగిందని వారికి రేపు యూరియా పంపిణి సరఫరా చేయబడుతుందని పి ఎస్ సి అధికారులు వివరించారు.

# గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేయండి

- అధికారులకు జెర్సీ సూచన

**శేరిలింగంపల్లి, ఆగస్టు 21 (జనంసాక్షి) :** రానున్న వినాయక చవితి మహా పర్వదినాన్ని పురస్కరించుకొని గణేష్ ఉత్సవాలకు అత్యంత పక ఏర్పాట్లు చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోరడే పేర్కొన్నారు. ఆగస్టు 27న వినాయక చవితి పండుగను మొదలుకొని నిమజ్జనానికి సంపూర్ణ ఏర్పాట్లను చేపట్టాలని జెడ్ సి గురువారం ఆదేశించారు. జోనల్ కమిషనర్ హేమంత్ బోర?డే పేర్కొన్నారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో గణేష్ నవరాత్రి మహెూత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతాయని, ఇట్టి విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలని, ఎటువంటి పొరపాట్లు అసౌకర్యాలకు తావు లేకుండా చూడాలని ఆయా విభాగాల అధికారులను ఆయన కోరారు. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి జోన్ పరిధి గణేష్ ఉత్సవకమిటీ ప్రతినిధులు, శేరిలింగంపల్లి జోన్ పరిధి ఆయా సర్కిల్లో అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వారితో మరియు జోనల్ కి సంబంధించిన అధికారులతో మీటింగ్ నిర్వహించారు.




అనంతరం మాట్లాడుతూ శేరిలింగంపల్లి జోన్ పరిధి మల్కం చెరువు, గోపి చెరువు, నల్లగండ్ల చెరువు, రాయసముద్రం చెరువు, సాకి చెరువు, గంగారం చెరువు, గౌతమ్ బేబీ పాండ్, కడియం కుంట, దుర్గం చెరువుతోపాటు ప్రధాన, అంతర్గత రహదారులను శుభ్రపరచాలని ఆయా విభాగాల నడుమ ఎటువంటి సమన్వయ లోపం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఉత్సవాల ప్రారంభం మొదలు నిమజ్జనంవరకు పరిపూర్ణమైన ఏర్పాట్లు చేయాలని, ప్రధానంగా పారిశుధ్య నిర్వహణను అత్యంత పకడ్బందీగా చేపట్టాలన్నారు. వినాయక ప్రతిమల నిమజ్జనానికి బేబి పాండ్లను సిద్ధం చేయాలని, వాటిల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను ముందస్తుగా తొలగించి శుభ్రపరచి గణేష్ విగ్రహాల నిమజ్జనానికి సంసిద్ధం చేయాలని సూచించారు. శోభాయాత్రలు జరిగే ప్రాంతాలలో రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని, గణేష్ మండపాల వద్ద, ఊరేగింపు వేదికలవద్ద విద్యుత్ దీపాలు, మంచినీరు, అవసరమైన మెడిసిన్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. చెరువుల పరిరక్షణకు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని, డెంగ్యూ కేసులు గుర్తించబడిన ప్రాంతాలలో నివారణ చర్యలు చేపట్టాలని ఎంటమాలజీ విభాగాన్ని ఆదేశించారు. సిఎస్ఆర్ కింద పచ్చదనం, పార్కుల నిర్వహణకు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా సర్కిళ్ల ఉప కమిషనర్లు, ఇంజినీరింగ్, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, ఎంటమాలజీ విభాగాలతోపాటు పోలీస్, ఫైర్ సెక్షన్, రెవెన్యూ, ఇరిగేషన్ తదితర విభాగాల అధికారులు గణేష్ ఉత్సవ కమిటీల కన్వీనర్‌లు, మెంబర్లు పాల్గొన్నారు.




# స్మార్ట్‌వాచీల మార్కెట్ డౌన్

**దేశీయంగా వేరబుల్ మార్కెట్ వరుసగా అయిదో త్రైమాసికంలోనూ నెమ్మదించింది. స్మార్ట్‌వాచీలు, ట్రూ వైర్‌లెస్ స్టీరియో ఇయర్‌బడ్స్ విక్రయాలు తగ్గడంతో ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అమ్మకాలు 9.4 శాతం క్షీణించి 2.67 కోట్లకు పరిమితమయ్యాయి.మార్కెట్ రీసెర్చ్ సంస్థ ఐడీసీ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.దీని ప్రకారం సరఫరా తగ్గినప్పటికీ వేరబుల్స్ సగటు విక్రయ ధర (ఏఎస్‌పీ) ఒక మోస్తరుగా 2.2 శాతం మేర పెరిగి 19.2 డాలర్లకు (సుమారు రూ. 1,700)కు చేరింది. 2025 ప్రథమార్థంలో వేరబుల్ డివైజ్ మార్కెట్ వార్షికంగా 6.3 శాతం తగ్గి 5.16 కోట్ల యూనిట్లకు పరిమితమైంది. ఏఎస్‌పీ పెద్దగా మార్పులు లేకుండా 18.7 డాలర్ల (సుమారు రూ. 1,630) స్థాయిలో కొనసాగింది. స్మార్ట్ రింగ్స్, స్మార్ట్ గ్లాసెస్, స్మార్ట్ రిస్ట్‌బ్యాండ్స్‌లాంటి కొత్త రకం వేరబుల్స్‌కి డిమాండ్ పెరిగింది.**



న్యూఢిల్లీ,జనంసాక్షి:అమ్మకాలు 4.8 శాతం తగ్గినప్పటికీ వేరబుల్స్ మార్కెట్లో 28 శాతం వాటాతో ఇమేజిన్ మార్కెటింగ్ (బోట్ బ్రాండ్) అగ్రస్థానంలో ఉంది. 13.1 శాతం వాటాతో నాయిస్ రెండో స్థానంలో నిల్చింది. విక్రయాలు 8.6 శాతం తగ్గాయి.గోబోల్ట్ (గతంలో బోల్ట్) అమ్మకాలు 21.8 శాతం పెరిగాయి. 10.9 శాతం మార్కెట్ వాటా ఉంది. ఒప్పో, వన్‌ప్లస్ వాటా చెరి 8 శాతంగా, రియల్‌మి వాటా 6.5 శాతంగా ఉంది.ఇక స్మార్ట్‌వాచీల అమ్మకాలు వరుసగా ఆరో త్రైమాసికం లోనూ క్షీణించాయి. జూన్ క్వార్టర్‌లో 28.4 శాతం తగ్గి 66 లక్షల యూనిట్లకు పరిమితమయ్యాయి. మొత్తం వేరబుల్స్ మార్కెట్లో వీటి వాటా 31.5 శాతం నుంచి 24.9 శాతానికి తగ్గింది. బౌల్ట్ మినహా మిగతా అన్ని బ్రాండ్ల (నాయిస్, బోట్, టైటాన్, ఫైర్ బోల్ట్) స్మార్ట్‌వాచీల అమ్మకాలు తగ్గాయి.2022, 2023లో భారీగా వృద్ధి చెందిన స్మార్ట్‌వాచీల మార్కెట్ ప్రస్తుతం కన్సాలిడేట్ అవుతోంది.ఇయర్‌వేర్ కేటగిరీ స్వల్పంగ్ 1.2 శాతం తగ్గి 1.99 కోట్ల యూనిట్లకు పరిమితం అ యింది. ట్రూలీ వైర్‌లెస్ స్టీరియో (టీడబ్ల్యూఎస్) సెగ్మెం ట్ అమ్మకాలు 1.2 శాతం తగ్గినా, 71.2 శాతం వాటా తో అగ్రస్థానంలో కొనసాగింది. నెక్‌బ్యాండ్ స్టయిల్ ఇయర్‌వేర్ మరింతగా 16.1 శాతం మేర పడిపో యింది. ఓవర్-ది-ఇయర్ సెగ్మెంట్ అమ్మకాలు 97.4 శాతం ఎగిసి 15 లక్షల యూనిట్లకు పెరిగాయి. టీడబ్ల్యూఎస్ విభాగంలో 31.9 శాతం వాటాతో బోట్ అగ్రస్థానంలో, 14.9 శాతం వాటాతో బోల్ట్ రెండో స్థానంలో ఉన్నాయి. బోట్ అమ్మకాలు 6.9 శాతం తగ్గాయి.స్మార్ట్ రింగ్స్ విక్రయాలు 2.8 శాతం పెరిగి 75,000కు చేరాయి. అల్ట్రాహ్యూమన్, గేబిట్, ఆబో సంస్థలు సంయుక్తంగా 65 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో కొనసాగాయి.మెటా, లెన్స్‌కార్ట్ కొత్తగా ప్రవేశపెట్టిన మోడల్స్ దన్నుతో స్మార్ట్ గ్లాసెస్ అమ్మకాలు 4,000 నుంచి ఏకంగా 50,000 యూనిట్లకు పెరిగాయి.స్మార్ట్ రిస్ట్‌బ్యాండ్స్ విక్రయాలు 118.5 శాతం పెరిగి 83,000 యూనిట్లకు చేరాయి.



## లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

**జనంసాక్షి:**గురువారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 142.87 పాయింట్లు లేదా 0.17 శాతం లాభంతో..82,000.71 వద్ద, నిఫ్టీ 33.20 పాయింట్లు లేదా 0.13 శాతం లాభంతో 25,083.75 వద్ద నిలిచాయి. ఇజ్మో లిమిటెడ్, డీపీ వైర్స్, కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్, బీఎఫ్ యుటిలిటీస్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. యూవై ఫిన్‌కార్ప్, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, హింద్ రెక్టిఫైయర్స్, బీఎస్ఈ లిమిటెడ్, మాస్టర్ ట్రస్ట్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో నిలిచాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.95 | ₹ 4.97 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 92,300 (22 క్యారెట్లు) | ₹ 1,00,750 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్
₹ 1,26,000

## పర్పెచువల్ ఫ్యూచర్స్ లాంచ్ చేసిన
# జియోటస్

- జీరో ట్రాన్సాక్షన్ ఛార్జెజ్ ఆఫర్
- కేవలం రూ.100 తోనే క్రిప్టో ఫ్యూచర్స్ ట్రేడింగ్

***దేశంలోని ప్రముఖ క్రిప్టో ఎక్స్ఛేంజ్ జియోటస్ కొత్తగా ట్రేడర్ల కోసం పర్పెచువల్ ఫ్యూచర్స్ తన ఫ్లాట్ ఫారంలో అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ సేవలు తమ 12 లక్షల మంది ఇన్వెస్టర్లకు అందుబాటులోకి వస్తాయని కంపెనీ చెప్పింది. భారతీయ క్రిప్టో ఇన్వెస్టర్ల పెట్టుబడి అవసరాలకు అనుగుణంగా అవసరమైన ఉత్పత్తులను తీసుకురావటాని కంపెనీ ప్రయత్నిస్తోంది. కొత్తగా ఫ్యూచర్స్ ప్రవేశపెడుతున్న క్రమంలో ప్రారంభ ఆఫర్ కింద సెప్టెంబర్ 30, 2025 వరకు ట్రాన్సాక్షన్లు ఉచితంగా ఎలాంటి ఛార్జీలు లేకుండా అందుబాటులో ఉంటాయని కంపెనీ వెల్లడించింది.***

హైదరాబాద్(జనంసాక్షి):ఇన్వెస్టర్ల ఎక్స్‌పీరియన్స్ పెంచేందుకు జియోటస్ కొత్తగా పర్పెచువల్ ఫ్యూచర్స్ అందుబాటులోకి తీసుకొస్తోంది. దీని ద్వారా ఇన్వెస్టర్లు తమకు నచ్చిన క్రిప్టో కాయిన్స్ రియల్ టైంలో ట్రేడింగ్ చేసేందుకు అవకాశం కల్పించబడుతోంది. కేవలం రూ.100 కనీస పెట్టుబడి నుంచి దీనిని ప్రారంభించవచ్చుని కంపెనీ వెల్లడించింది. లైవ్ మార్కెట్ అప్ డేట్స్, సురక్షితమైన బ్యాకెండ్ ఇన్ ఫ్రాతో వీటిని జియోటస్ లాంచ్ చేస్తోంది. ఇది పెట్టుబడిదారులు కొత్త ఉత్పత్తులను అధిక నమ్మకంతో ట్రేడింగ్ చేసేందుకు వీలు కల్పించనుంది.వాస్తవానికి క్రిప్టో పర్పెచువల్ ఫ్యూచర్స్ అనేది ఒక కొత్త తరం ఇన్వెస్ట్మెంట్ ఉత్పత్తి. సాధారణంగా ఉండే ఫ్యూచర్స్ మాదిరిగా వీటికి ఎలాంటి ఎక్స్పైయిరీ డేట్ ఉండదు. ట్రేడర్లు తమకు కావాల్సినంత కాలం వాటిని హోల్డ్ చేసుకోవచ్చు. పైగా దీని వల్ల ప్రతిసారి గడువు సమయానికి వాటిని పొడిగించుకునే ఇబ్బంది కూడా ఉండదు.ప్రస్తుతం దేశంలో క్రిప్టో పెట్టుబడిదారుల సంఖ్య రోజురోజుకూ భారీగా పెగుతున్న క్రమంలో వారికి అవసరమైన, అనుకూలించబడిన క్రిప్టో పెట్టుబడి ఉత్పత్తులను తీసుకురావటం తమ లక్ష్యం అని జియోటస్ సీఈవో విక్రమ్ సుబ్బురాజ్ అన్నారు. భారత ప్రభుత్వ నియమనిబంధనలకు అనుగుణంగా తమ జియోటస్ ఫ్లాట్ ఫారం పనిచేస్తుందని.. దీనిని మరింత శక్తివంతంగా, సురక్షితంగా ముందుకు తీసుకెళుతున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం ఫ్యూచర్స్ లాంచ్ ద్వారా దేశంలోని కొన్ని ఎక్స్ఛేంజీలు అందిస్తున్న సౌకర్యం తమ ఇన్వెస్టర్లకు కూడా అందించబడుతుందని అది కూడా సున్నా రేటుకే అన్నారు సుబ్బురాజ్. 2017లో స్థాపించబడిన జియోటస్ కంపెనీ ప్రస్తుతం స్పాట్, ఎస్ఐపీ, స్టేకింగ్, ఫ్యూచర్స్ వంటి విభిన్న ఉత్పత్తులను క్రిప్టో ఇన్వెస్టర్లకు అందుబాటులో ఉంచినట్లు సుబ్బురాజ్ వెల్లడించారు. ద్వారా దేశంలో సురక్షితమైన క్రిప్టో ఎకో సిస్టమ్ నిర్మించటానికి జియోటస్ నిరంతరం కృషి చేస్తోందని అందుకే లక్షల మంది ఇన్వెస్టర్లకు ప్రథమ ఎంపికగా తమ ఎక్స్ఛేంజీ మారిందని సీఈవో విక్రమ్ సుబ్బురాజ్ వెల్లడించారు.



## ఎన్ఐపీఎం హైదరాబాద్ చాప్టర్ చైర్మన్‌గా 'చిక్కాల'


హైదరాబాద్(జనంసాక్షి):భారతదేశంలోని ప్రఖ్యాత మానవ వనరుల సంస్థ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్, వెర్చ్ కన్సల్టింగ్ ఎల్ఎల్పీ సీఈఓ డాక్టర్ చిక్కాల వేణు గోపాల్ రావును ఆ సంస్థ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్‌గా నియమించింది. ఆయనకు ఫార్మా, ఐటీ రంగాలలో రెండు దశాబ్దాలకు పైగా అనుభవం కలదు. ఈ సంస్థలో వివిధ స్థాయిల్లో విశిష్ట సేవలందించారు. హ్యూమన్ రిసోర్సెస్, ఇండస్ట్రియల్ రిలేషన్స్‌లో విస్తృత పరిజ్ఞానం ఉంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్‌గా నియమితులు కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ చాప్టర్‌ను సదస్సులు, వర్క్‌షాప్‌లు, కాన్ఫరెన్స్‌లు, జ్ఞాన వేదికల ద్వారా ప్రొఫెషనల్ కమ్యూనిటీని శక్తివంతం చేయడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తద్వారా ఆధునిక హెచ్ఆర్, ఐఆర్ పద్ధతులపై అవగాహన కలుగుతుందన్నారు. ఎన్ఐపీఎం జాతీయ అధ్యక్షుడు ఎం హెచ్ రాజా, కార్యదర్శి పీఆర్ బసవరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

## స్టార్‌లింక్ ఇంటర్నెట్ కోసం ఆధార్ వెరిఫికేషన్

**జనంసాక్షి:**ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ శాటిలైట్ కమ్యూనికేషన్స్.. ఈ-కేవైసీ వెరిఫికేషన్ కోసం ఆధార్‌ను ఉపయోగించడానికి యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియాతో భాగస్వామ్యం కుదుర్చుకుంది.దీన్నిబట్టి చూస్తే.. భారతదేశంలో శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.స్టార్‌లింక్ ఇప్పటికే టెలికమ్యూనికేషన్స్ విభాగం ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ నుంచి భారతదేశంలో తమ కార్యకలాపాలను ప్రారంభించడానికి కావలసిన అనుమతిని పొందింది. అయితే జాతీయ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా టెక్నాలజీ.. మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం వంటి కొన్ని ఆన్-ది-గ్రౌండ్ సన్నాహాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వీటిని కూడా త్వరలోనే పూర్తి చేయడానికి కావాల్సిన ఏర్పాట్లను కంపెనీ పూర్తి చేస్తోంది.

# ఎన్నాళ్లీ ట్రా'ఫికర్'

- చినుకు పడితే చాలు కిలోమీటర్ల మేర వాహనాల క్యూ
- రోజుకు సగటున 10 లక్షల వాహనాల చక్కర్లు
- ఇందులో లక్ష వెహికిల్స్ ఐటీ ఉద్యోగులవే..
- గచ్చిబౌలి-మియాపూర్, హైటెక్ సిటీ-జేఎన్‌టీయూ,
- టోలిచౌకి-రాయదుర్గం మార్గాల్లో హెవీ ట్రాఫిక్
- ఇతర రోజుల్లో కంటే మంగళ, బుధ, గురువారాల్లో 25 శాతం ట్రాఫిక్ ఎక్కువ
- కార్ పూలింగ్, ప్రజా రవాణా వినియోగించడమే ఉత్తమం



**హైదరాబాద్,జనంసాక్షి:**ఊరికి పశ్చిమాన ఉన్నవి ఆ ప్రాంతాలు.. ఐటీ కారిడార్లు.. హైదరాబాద్‌కు తలమానికం.. నగరానికి మణిహారం.. ఐటీకి ఆలవాలం.. లక్షలాది ఉద్యోగులు.. దాదాపు అంతకు రెట్టింపు వాహనాలు.. వీఐపీల రాకపోకలతో బీజీ బీజీ.. ఇంతేనా! ఆ ప్రాంతాలు ఐటీ కారి'డర్'కు.. ట్రా'ఫికర్'కు కేరాఫ్ కూడా. వానొచ్చినప్పుడు చూడాలి వాటి సొగసు.. చినుకు పడితే వణుకే.. ప్రయాణమంటే ప్రయాసే.. అడుగుడుగునా అవస్థలే.. రహదారులన్నీ వాహనాల బారులే.. ఫ్లై ఓవర్లు ఉన్నా.. అండర్ పాస్‌లున్నా.. చాలా వెడల్పాటి రోడ్లున్నా.. తప్పని ట్రా'ఫికర్'. నగరవాసికి నరకం చూపుతున్న ట్రాఫిక్ సమస్యకు ముగింపెన్నడో.. హైదరాబాద్‌లో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ముఖ్యంగా ఐటీ సంస్థలు ఉండే పశ్చిమ హైదరాబాద్‌లో అయితే వాహన విస్ఫోటంతో నగరవాసికి పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ఐటీ కారిడార్లలోని రహదారులపై రోజుకు 10 లక్షల వాహనాలు చక్కర్లు కొడుతుంటాయి. ఇలాంటి బిజీ రోడ్లపై తేలికపాటి వర్షాలకే కిలోమీటర్ల మేర ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది.హైదరాబాద్‌లో ఉన్న సుమారు 15 వేల ఐటీ, ఐటీఈఎస్ కంపెనీల్లో 9,05,715 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. చాలా ఐటీ సంస్థలు ఉద్యోగుల కోసం హైబ్రిడ్ విధానాన్ని అవలంబిస్తున్నాయి. దీంతో ఉద్యోగులు వారంలో 2-3 రోజులు ఆఫీసు నుంచి, మిగిలిన రోజుల్లో ఇంటి నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే చాలా మంది ఐటీ ఉద్యోగులు వీకెండ్స్‌కు ముందు, తర్వాత రోజులైన శుక్ర, సోమవారాల్లో ఇంటి నుంచి పనిచేసేందుకే ఇష్టపడుతున్నారు. మంగళ, బుధ, గురువారాల్లో మాత్రం ఆఫీసులకు వస్తున్నారు. దీంతో సోమ, శుక్రవారాలతో పోలిస్తే మిగిలిన రోజుల్లో ఐటీ కారిడార్లలోని రహదారులపై వాహనాలు కిక్కిరిసిపోతున్నాయని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల అధ్యయనంలో వెల్లడైంది. సోమ, శుక్ర వారాలతో పోలిస్తే మంగళ, బుధ, గురువారాల్లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇందులోనూ మంగళ, బుధవారాల్లో 20-25 శాతం, గురువారాల్లో 10-15 శాతం రోడ్లు వాహనాలతో బిజీగా ఉంటాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల మధ్య రోడ్ల మీద వాహనాలు కిక్కిరిసిపోతున్నాయి. ఐటీ కారిడార్లలో రోజుకు 10 లక్షల ఆటోలు, బస్సులు, కార్లు, బైక్‌లు తిరుగుతుంటాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఇక్కడ ప్రయాణించాలంటే వణుకే. ఈ నాలుగు గంటల్లో సుమారు లక్ష వాహనాల్లో ఐటీ ఉద్యోగులు ప్రయాణిస్తుంటారు. వారం మధ్య దినాల్లో ట్రాఫి క్ రద్దీ విపరీతంగా ఉంటుంది. సోమ, శుక్ర వారా ల్లో ఐటీ ఉద్యోగులు హైబ్రిడ్ విధానంలో ఇంటి నుంచే పని చేస్తుండగా.. మంగళ, బుధ, గురువారాల్లో మాత్రం ఆఫీసులకు వెళుతున్నారు. దీంతో నివాస ప్రాంతాలతో అనుసంధానమై ఉండే ఐటీ కారిడార్లలో ట్రాఫిక్ రద్దీ 25 శాతం అధికం. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఏటా ఇచ్చే అనుమతుల్లో 60 శాతానికి పైగా భవన నిర్మాణ అనుమతులు ఐటీ కారిడార్లలోనే ఉంటాయి. అయితే ఆ మేరకు ఆయా రహదారుల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి జరగడం లేదు. భవిష్యత్తు అవసరాలను ఏమాత్రం దృష్టిలో పెట్టుకోకుండా ఇబ్బడిముబ్బడిగా అనుమతులు ఇస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే వెస్ట్ హైదరాబాద్‌లో 30 అంతస్తులకుపైగా హైరైజ్ భవనాలు వందల సంఖ్యలో నిర్మాణమవుతున్నాయి. వచ్చే 4-5 ఏళ్లలో ఐటీ కారిడార్లలో కొత్తగా 25 లక్షల గృహాలు అందుబాటులోకి వస్తాయని అంచనా. ఈ కారిడార్లలో నివాసముండే కుటుంబాల్లో ఇంటికి 2-3 కార్లు ఉంటున్నాయి. ఈ లెక్కన లక్షల వాహనాలు కొత్తగా రోడ్ల మీదికి వస్తాయి. ఇప్పుడున్న రద్దీనే తట్టుకోలేక చేతులెత్తేస్తున్న ప్రభుత్వ విభాగాలు భవిష్యత్తు పరిణామాల గురించి కూడా ముందస్తుగా ఆలోచిస్తే బాగుంటుందని నిపుణులు సూచిస్తున్నారు. ఎడతెరిపిగా వర్షాలు కురిసే రోజుల్లో ఐటీ సంస్థలు వేర్వేరు లాగిన్, లాగ్ అవుట్ వేళలను అవలంబించాలి.సాధ్యమైనంత వరకు మెట్రో, ఎంఎంటీఎస్, బస్సులు వంటి ప్రజా రవాణాను ఉద్యోగులు వినియోగించేలా సంస్థలు ఆదేశించాలి.ఒకే ప్రాంతం, ఒకే సంస్థలో పనిచేసే ఉద్యోగులు ఎవరికివారు సొంత వాహనాల్లో ఆఫీసులకు వెళ్లే బదులుగా ముగ్గురు, నలుగురు కలిసి ఒకే కారులో ప్రయాణించేలా ఏర్పాట్లు చేసుకోవాలి. యాజమాన్యాలు ఉద్యోగులకు ప్రతి రోజు ఆఫీసులో విధిగా నిర్వహించే మీటింగ్స్‌ను ఆన్‌లైన్ లేదా వర్చువల్ విధానంలో చేయడం ఉత్తమం.ఐటీ కారిడార్లలో రోడ్లు, డ్రైనేజీల్లో చెత్తాచెదారం, సిమెంట్ కాంక్రీట్ వంటి వాటితో నిండిపోయి వర్షపు నీటి ప్రవాహ మార్గాలను అడ్డుకోకుండా మున్సిపల్, హైడ్రా, పోలీసులు సమన్వయంగా పనిచేయాలి. హైబ్రిడ్ విధానంలో ఉద్యోగులు వారంలో తప్పనిసరిగా మూడు రోజులు ఆఫీసుకు రావాలనేది యాజమాన్యాల నిబంధన. వానాకాలం, ఇతరత్రా అత్యవసర రోజుల్లో ఈ నిబంధనల్లో సడలింపులు ఇచ్చేలా సంస్థలను అధికారులు ఆదేశించాలి.ఆఫీసు నుంచైనా, ఇంటి నుంచైనా ఉద్యోగుల పని వేళలు, ఉత్పాదకతలో ఎలాంటి మార్పులు లేనప్పుడు సాధ్యమైనంత వరకు ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ఇవ్వడమే మేలు. దీంతో రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గడమేకాకుండా యాజమాన్యాలకూ ఉద్యోగుల రవాణా ఖర్చులు తగ్గుతాయి.గతంలో రాజకీయ, సినీ, క్రీడా, వ్యాపార ప్రముఖులు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి ప్రాంతాల్లో నివాసం ఉండేందుకు ఇష్టపడేవారు. అయితే ఇప్పుడు ఆయా ప్రాంతాలు వాణిజ్య ప్రాంతాలుగా మారడంతో వారంతా కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైటెక్ సిటీ, మాదాపూర్ వంటి పశ్చిమ హైదరాబాద్‌కు వలస వెళుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో నిరంతరం వీఐపీల కదలికల కారణంగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. గతంలో సినిమా ఫంక్షన్లు ఎల్బీ స్టేడియంలో జరిగేవి. కానీ, ఇప్పుడు హైటెక్స్, హెచ్ఐసీసీ వంటి ఐటీ కారిడార్లలోని ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. ఫలితంగా అభిమానుల తాకిడితో రోడ్లన్నీ స్తంభించిపోతున్నాయి. హెచ్ఐసీసీ, హైటెక్స్, నోవాటెల్, జేఆర్సీ, సంధ్య వంటి కన్వెన్షన్లలో నిత్యం ఏదో ఒక భారీ కార్యక్రమంఉంటుండటంతో ఐటీ కారిడార్లు బిజీ బిజీగా మారుతున్నాయి.



## ప్రపంచంలోనే టాప్ 10 చమురు కంపెనీలు

**జనంసాక్షి:**పునరుత్పాదక ఇంధనం అభివృద్ధిపై పెట్టుబడులు పెరుగుతున్నా, సాంప్రదాయక ఇంధన వనరులకు డిమాండ్ తగ్గట్లేదు. ఇది ప్రపంచ చమురు, గ్యాస్ రంగం అపారమైన ఆర్థిక, వ్యూహాత్మక వృద్ధిని సూచిస్తోంది.ఆగస్టు 2025 నాటికి పరిశ్రమలో అత్యంత విలువైన కంపెనీగా సౌదీ అరేబియా ప్రభుత్వ యాజమాన్యంలోని సౌదీ ఆరామ్‌కో 1.55 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువతో ప్రపంచంలోనే టాప్‌లో నిలిచింది. భారత్‌కు చెందిన ఓఎన్‌జీసీ 34.33 బిలియన్ డాలర్లతో 45వ స్థానంలో ఉంది. మార్కెట్ విలువ పరంగా చమురు వాణిజ్యానికి సంబంధించి ప్రపంచంలోనే టాప్ కంపెనీల గురించి కింద తెలియజేశాం.పైసమాచారం కంపెనీస్‌మార్కెట్‌క్యాప్.కామ్‌లోనిది. నిత్యం మార్కెట్ వ్యాల్యుయేషన్లను అనుసరించి క్యాపిటల్ మారుతుంటుందని గమనించాలి.

## 4.5, 18 శాతం శ్లాబులకు ఒకే..

శ్లాబులు మాత్రమే ఉంచేందుకు మంత్రుల బృందం అంగీకారం తెలిపినట్లు బిహార్ ఉప ముఖ్యమంత్రి, రేటు హేతుబద్ధీకరణకు సంబంధించి జీవోఎం కన్వీనర్ సామ్రాట్ చౌధరి తెలిపారు.రేటు హేతుబద్ధీకరణకు సంబంధించి కేంద్రం చేసిన రెండు ప్రతిపాదనలకూ జీవోఎం ఆమోదం తెలిపినట్లు సామ్రాట్ చౌధరి మీడియాకు వెల్లడించారు. కేంద్ర ప్రతిపాదనలో అల్ట్రా లగ్జరీ, సిన్ గూడ్స్ (సిగరెట్లు వంటివి)పై 40 శాతం పన్ను విధించడం కూడా ఉందని యూపీ ఆర్థికమంత్రి సురేష్ కుమార్ ఖన్నా తెలిపారు. కార్లు, సిన్‌గూడ్స్ వంటి అల్ట్రా లగ్జరీ వస్తువులపై ప్రస్తుత పన్ను రేటు కొనసాగించేందుకు తమ రాష్ట్రం 40 శాతం జీఎస్టీ రేటుపై లెవీని ప్రతిపాదించిందని పశ్చిమబెంగాల్ ఆర్థిక మంత్రి చంద్రిమా భట్టాచార్య తెలిపారు. ఈ కొత్త జీఎస్టీ శ్లాబ్‌ల అమలు తర్వాత కేంద్రం, రాష్ట్రాలకు కలిగే ఆదాయ నష్టం గురించి కేంద్రం చేసిన ప్రతిపాదల్లో ప్రస్తావించలేదని ఆమె పేర్కొన్నారు. రేట్ల హేతుబద్ధీకరణకు సంబంధించి సామ్రాట్ చౌధరి నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల మంత్రుల బృందం గురువారం భేటీ అయ్యింది. ప్రస్తుతం నాలుగు శ్లాబుల స్థానే (5, 12, 18, 28 శాతం) రెండు శ్లాబులు మాత్రమే (5, 18) ఉంచేందుకు మంత్రుల బృందం అంగీకరించింది. దీంతో పాటు హానికర ఉత్పత్తులకు 40 శాతం జీఎస్టీ విధించేందుకు ఆమోదం తెలిపింది. జీఎస్టీ కౌన్సిల్‌లో తుది నిర్ణయం తీసుకోనున్నారు.



## సీఎం రేఖా గుప్తాపై దాడి..
### ఢిల్లీ పోలీస్ కమిషనర్‌పై బదిలీ వేటు

ఢిల్లీ: సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చిన జనం,కట్టుదిట్టమైన పోలీసు భద్రత నడుమ ఢిల్లీ సీఎం రేఖా గుప్తాపై ఓ అగంతకుడు దాడికి పాల్పడిన దేశ రాజధానిలో కలకలం సృష్టించింది.ఈ ఘటనపై ఢిల్లీ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీ కమిషనర్ ఎస్‌బీకే సింగ్‌ను తొలగించింది. ఆయన స్థానంలో ఢిల్లీ పోలీస్ కమిషనర్‌గా సతీష్ గోల్చాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.హోం గార్డ్స్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న ఎస్‌బీకే సింగ్ ఆగస్టు 1న ఢిల్లీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. స్వల్ప వ్యవధిలోనే సీఎం రేఖా గుప్తాపై నిందితుడు దాడికి పాల్పడడంతో ఢిల్లీ ప్రభుత్వం ఎస్‌బీకే సింగ్‌ను విధుల నుంచి తప్పించింది.

## జనరల్ మేనేజర్‌కు ఖరీదైన బైక్ గిఫ్ట్ ఇచ్చిన సీఈఓ

**జనంసాక్షి:**సాధారణంగా కొన్ని సంస్థలు ఉద్యోగులకు జీతాలు ఇస్తే చాలు అనుకుంటాయి. అయితే కొన్ని కంపెనీలు జీతాలు ఇవ్వడం మాత్రమే కాకుండా.. కంపెనీ లాభాలను పొందినప్పుడు..ఉత్తమ పనితీరును కనపరిచిన ఉద్యోగులకు కార్లు, బైకులు వంటివి గిఫ్ట్లు ఇస్తుంటారు. ఇటీవల కేరళకు చెందిన ఒక కంపెనీ సీఈఓ.. జనరల్ మేనేజర్‌కు ఖరీదైన బైక్ గిఫ్ట్ ఇచ్చాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కేరళకు చెందిన ఓ కంపెనీ చైర్మన్ అండ్ ఎండీ ఏకే షాజీ.. తన జనరల్ మేనేజర్‌కు రాయల్ ఎన్‌ఫీల్డ్ కాంటినెంటల్ జీటీ 650 బైక్ గిఫ్ట్ ఇచ్చాడు. జనరల్ మేనేజర్ కంపెనీ డీలర్‌షిప్ నుంచి బైకును తీసుకున్నాడు. సీఈఓ కొత్త బైక్ గిఫ్ట్ ఇచ్చినందుకు చాలా సంతోషించారు. బైక్ తీసుకునే సమయంలో వేగంగా వెళ్ళవద్దు, బాధ్యతాయుతంగా బైక్ రైడ్ చేయాలని సూచించారు. జనరల్ మేనేజర్ అపెక్స్ గ్రే కలర్ రాయల్ ఎన్‌ఫీల్డ్ కాంటినెంటల్ జీటీ 650 తీసుకున్నాడు. ఈ బైక్ ఎక్స్ షోరూమ్ ధర రూ. 3.46 లక్షలు. కాలికట్‌లో ఆన్ రోడ్ ధర రూ. 4.41 లక్షలు.రాయల్ ఎన్‌ఫీల్డ్ కాంటినెంటల్ జీటీ 650కాంటినెంటల్ జీటీ 650 అనేది 650 సీసీ విభాగంలో ఎంతోమందికి నచ్చిన బైక్. ఇది 648 సీసీ ఎయిర్ అండ్ ఆయిల్ కూల్డ్ ప్యారలల్ ట్విన్ ఇంజిన్ ద్వారా శక్తిని పొందుతుంది. ఇది 47 హార్స్ పవర్, 52 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. మంచి డిజైన్, రైడర్లకు కావలసిన అన్ని ఫీచర్లు ఇందులో ఉన్నాయి.



# జస్టిస్ సుదర్శన్ రెడ్డికి బిఆర్ఎస్ మద్దతు ఇవ్వబోమనడం దుర్మార్గం

- సిపిఐలో ట్రాన్స్‌జెండర్‌లకు సభ్యత్వం
- ఉప రాష్ట్రపతి ఎన్నికల కోసం బెదిరింపులు
- కుత్బుల్లాపూర్‌లో ఎరుపుమయమైన సిపిఐ మహాసభలు
- బిజెపి, బిఆర్ఎస్‌పై డాక్టర్ కె. నారాయణ విమర్శలు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 21 (జనం సాక్షి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో జరిగిన సిపిఐ రాష్ట్ర మహాసభలు రెండవ రోజు ఎరుపు జెండాలతో సభా ప్రాంగణం సందడిగా కనిపించింది. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జాతీయ నాయకుడు డాక్టర్ కె. నారాయణ, బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఇండియా కూటమి ప్రకటించిన ఉప రాష్ట్రపతి అభ్యర్థి, తెలంగాణ వాది జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి తెలంగాణ సెంటిమెంట్ కు ప్రాధాన్యమిచ్చే బిఆర్ఎస్ మద్దతు ఇవ్వకపోవడం అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని డాక్టర్ కె. నారాయణ విమర్శించారు. ఇండియా కూటమిలో లేనని ప్రకటించిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ సైతం జస్టిస్ రెడ్డికి మద్దతు ప్రకటించగా, బిజెపికి వ్యతిరేకమని చెప్పుకునే బిఆర్ఎస్ మద్దతు ఇవ్వకపోవడం కెటిఆర్ వైఖరి వీరోచిత పలాయనమని, సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. సిఎం రేవంత్ రెడ్డిని అడ్డం పెట్టుకుని బిఆర్ఎస్ ఎన్‌డిఎకు ఓటు వేయడం దివాళాకోరు వైఖరి అని విమర్శించారు. రేవంత్ రెడ్డికి ఉప రాష్ట్రపతి అభ్యర్థి ప్రకటనతో సంబంధం ఏమిటని ప్రశ్నించారు.

సమాజంలో గణనీయ సంఖ్యలో ఉన్న ట్రాన్స్‌జెండర్‌లకు సిపిఐలో సభ్యత్వం ఇవ్వాలని, వారి సమస్యలపై దృష్టి సారించాలని డాక్టర్ నారాయణ సూచించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయకపోతే ప్రజా సంఘాల మనుగడ కష్టమని, యువత, విద్యార్థులు, మహిళలను పార్టీలో ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. బిసిలకు 52 శాతం రిజర్వేషన్, రాజ్యాంగ హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ పూర్తి మద్దతు ఇవ్వాలని, ఈ పోరాటంలో కలిసి నడవాలని ఉద్ఘాటించారు.

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపి ప్రజాప్రతినిధులను బెదిరిస్తోందని నారాయణ ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, వైఎస్ఆర్‌సిపి సభ్యులు బిజెపి అభ్యర్థికి ఓటు వేయకపోతే జైలుకు వెళ్లాల్సి వస్తుందని, ఈడీ, ఐటీ దాడులతో ఎంపీలను బెదిరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్‌తో అవగాహన ఉన్నప్పటికీ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సిబిఐ, ఈడీ, న్యాయవ్యవస్థ, నీతి ఆయోగ్‌లను స్వతంత్రంగా పనిచేయనివ్వడం లేదని, రాష్ట్రపతి భవన్ ప్రధానమంత్రి కార్యాలయం ఆదేశాలకు లొంగిపోయిందని ఆరోపించారు. అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠను కాపాడడంలో మోదీ విఫలమయ్యారని, పార్లమెంటరీ వ్యవస్థను బలహీనపరిచి ఏకచ్ఛత్రాధిపత్య పాలన వైపు దేశాన్ని నడిపిస్తున్నారని విమర్శించారు. దేశాభివృద్ధి పేరుతో కార్పొరేట్ సంస్థలకు ప్రాధాన్యం ఇస్తూ, బిజెపిని వ్యతిరేకించే వారిని రాజకీయ కక్షతో జైల్లో పెడుతున్నారని, నక్సలైట్ల అంతం పేరుతో అటవీ, గిరిజన సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. 30 రోజుల జైలు శిక్షతో చట్టసభ సభ్యత్వం రద్దు చేసే చట్టం తీసుకురావాలని బిజెపి ప్రయత్నిస్తోందని, అలాంటి చట్టం వస్తే మొదట అమిత్ షా సభ్యత్వం రద్దు కావాలని డిమాండ్ చేశారు. రూ.22 లక్షల కోట్ల ఆదాయంలో సామాన్యుల, సంపన్నుల వాటా ఎంతో ప్రకటించడానికి కేంద్రం ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. అమెరికా బెదిరింపులకు భారత్ భయపడాల్సిన అవసరం లేదని, బిజెపి అలీన విధానానికి వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌కు మద్దతు ఇస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు

- కార్యకర్తలను గెలిపించే బాధ్యత మాది
- వచ్చే ఎన్నికల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలి
- త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ
- బీజేపీ,బిఆర్ఎస్ రెండూ కలిసి ఓట్ చోరీ చేశాయి
- రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం

**వేములవాడ (జనం సాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కార్యకర్తలను సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి పదవుల్లో గెలిపించే బాధ్యత తమదేనని వెల్లడించారు. మల్లికార్జున ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఇంచార్జ్ అద్దంకి దయాకర్, సిరిసిల్ల కాంగ్రెస్ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓట్ చోరీపై రాహుల్ గాంధీ ప్రసంగాన్ని కార్యకర్తలు వీక్షించారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. యూరియా సరఫరా విషయంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నట్లు విమర్శించారు. 10 సంవత్సరాల మంత్రి అనుభవంతో కూడిన కేటీఆర్ బద్దలు మాటలు మాట్లాడుతున్నారని, బిజెపిపై మాట్లాడకుండా కాంగ్రెస్‌ను బాధిస్తున్నట్లు ఆరోపించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపికి మద్దతు ప్రకటించిన కేటీఆర్ వైఖరిని ఆయన తప్పుపట్టారు.

అద్దంకి దయాకర్ మాట్లాడుతూ, రాజన్న సిరిసిల్ల జిల్లా రాజకీయ చైతన్యానికి ప్రతీకంగా నిలిచిందని అన్నారు. పిసిసి పదవుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1700 అప్లికేషన్లు వచ్చినా, సిరిసిల్లలో అత్యధికం ఉన్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కార్యకర్తలకు అవకాశాలు కల్పిస్తామని, మహిళలకు కూడా పదవుల్లో ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. 2018 ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ కలిసి ఓట్ చోరీ చేసినట్లు ఆరోపించారు. ఈ విషయంపై సుప్రీం కోర్టులో కేసు ఇంకా నడుస్తున్నట్లు పేర్కొన్నారు. కేసిఆర్ మోదీ అనుమతితో ఎన్నికలను ఒక సంవత్సరం ముందు నిర్వహించి ఓట్లు చోరినట్లు విమర్శించారు. బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షాలు బలంగా ఉన్న ప్రాంతాల్లో ఓట్లు చోరుతూ అనుకూల స్థితిని సృష్టిస్తోందని అన్నారు.

గత ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తల శ్రమతో అధికారం సాధించినట్లు గుర్తు చేస్తూ, కేంద్రంలో బిజెపి చంద్రబాబు, నితీష్‌తో కలిసి ప్రభుత్వం నడుపుతున్న వైఖరిని ఆయన విమర్శించారు. కేటీఆర్ కోట్ల రూపాయల చోరీపై మాట్లాడకుండా యూరియా కొరతపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నట్లు మండిపడ్డారు. తెలంగాణ పేరును తొలగించిన బిఆర్ఎస్ పార్టీ ప్రజలతో బంధం తెంచుకున్నట్లు, రాష్ట్రాన్ని విధ్వంసం చేసినట్లు ఆరోపించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ 10–20 సంవత్సరాలు అధికారంలో కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం అందరూ కలిసి ప్రయత్నించాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణ రైతాంగం కోసం బీఆర్ఎస్ దీక్షతో పోరాటం

**యూరియా కొరతపై కేంద్రంపై ఒత్తిడి పెంచుతున్నాం**



**ఢిల్లీ,(జనంసాక్షి):** తెలంగాణ భవన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం, ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ లోపల, బయట దీక్షల ద్వారా కృషి చేస్తోందని తెలిపారు. పార్లమెంట్ ప్రస్తుత సమావేశాల్లో బీఆర్ ఎస్ నలుగురు సభ్యులు రాష్ట్ర సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ లీడర్ కే.ఆర్. సురేష్ రెడ్డి కూడా పాల్గొన్నారు.


తెలంగాణలో నెలకొన్న యూరియా కొరత తీవ్రత గురించి ఈ నెల 12వ తేదీన కేంద్ర దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, మంత్రులను కలిసి వివరించినట్లు ఎంపీ రవిచంద్ర తెలిపారు. రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జే.పి. నడ్డాను ఈ రోజు కలిసి, రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవాలని 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. వెంటనే 10 వేల మెట్రిక్ టన్నులు, తర్వాత 15 వేల మెట్రిక్ టన్నులు, వారంలో 50 వేల మెట్రిక్ టన్నులు అందిస్తామని, మొత్తం 2 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేస్తామని నడ్డా హామీ ఇచ్చినట్లు వద్దిరాజు తెలిపారు.

తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పాలనలో 24 గంటల ఉచిత విద్యుత్, విత్తనాలు, ఎరువులకు కొరత లేకుండా ముందస్తు చర్యలతో ధాన్య దిగుబడి 3 లక్షల మెట్రిక్ టన్నులకు చేరినట్లు గుర్తు చేశారు. అయితే, కాంగ్రెస్ పాలనలో ఎరువులు, మంచి నీటి కోసం రైతులు క్యూలు కడుతున్న దృశ్యం పునరావృతమవుతోందని ఎద్దేవా వ్యక్తం చేశారు. పోలవరం (గోదావరి)–బనకచర్ల అక్రమ ప్రాజెక్టును బీఆర్ఎస్ పార్లమెంట్‌లో తీవ్రంగా వ్యతిరేకించినట్లు పేర్కొన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్యా, ఉద్యోగ రంగాల్లో 42% రిజర్వేషన్‌ను రాజ్యాంగ 9వ షెడ్యూల్‌లో చేర్చి అమలు చేయాలని బీఆర్ఎస్ పదిలంగా డిమాండ్ చేస్తోందని వద్దిరాజు పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాలు కొనసాగినా లేదా వాయిదా పడినా, ఎరువుల సమస్య పరిష్కారానికి కేంద్రంపై వత్తిడం పెంచి ఫలితం సాధిస్తామని వద్దిరాజు హామీ ఇచ్చారు.

# ఫీజుల పేరుతో విద్యార్థిని చితకబాదిన శ్రీకృష్ణవేణి ప్రైవేట్ హైస్కూల్

**గుర్తింపును రద్దు చేయాలి : విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్**





**గద్వాల నడిగడ్డ,ఆగస్టు 21 (జనం సాక్షి) :** ఐజ మండల కేంద్రంలోని ప్రైవేటు శ్రీ కృష్ణవేణి హై స్కూల్లో అక్రమ కోచింగ్ లో పేరుతో వ్యాపారం చేస్తూ పాఠశాలను నిర్వహిస్తూ ఫీజుల పేరుతో చరణ్ తేజ అనే విద్యార్థిని గురువారం తీవ్రంగా చితకబాదిన ఘటనపైన విద్యార్థి సంఘాలతో కలిసి స్కూల్ ఆవరణ లో నిరసన తెలిపారు. ఇది రెండోసారి గతంలో కూడా రెండవ తరగతి చదువుతున్న విరాట్ శంకర్ నాయక్ అనే విద్యార్థిని కూడా తీవ్రంగా చితకబాదిన ఘటన ఉందనీ,తక్షణమే మండల ఎంఈఓ డి రాములుని ఆ స్కూల్ యజమాని పైన ఎఫ్ఐఆర్ బుక్ చేసి చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకొని ఆ స్కూలు యొక్క గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేయడం జరిగిందనీ విద్యార్థి సంఘ నాయకులన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ పర్మిషన్ లేని కోచింగ్ సెంటర్‌ల పేరుతో భారీ దోపిడీ చేస్తున్నారని, ఫీజుల పేరుతో చిత్రహింసకు గురి చేస్తున్నటువంటి యజమాన్యంపై కఠినమైన చర్యలు తీసుకొని స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు యు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్ పల్లి రంగస్వామి, బిఆర్ఎస్‌వి రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు హాలీం పాషా, పివైఎల్ జిల్లా అధ్యక్షులు బీరెల్లి దానయ్య,బీఆర్ఎస్వి టౌన్ మాజీ ప్రెసిడెంట్ కె.వీరేష్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్



**కామారెడ్డి, ఆగస్టు 21 (జనం సాక్షి):** దొంగతనాలు, దృష్టి తిప్పే దొంగతనాలకు పాల్పడిన నలుగురు అంతరాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. 2025 ఫిబ్రవరి 26న భిక్నూర్ గ్రామంలో సాయంత్రం దాదాపు 4:30 గంటల సమయంలో భిక్నూర్ బాయ్స్ హై స్కూల్ సమీపంలోని దత్తాత్రీ బాంబు మర్చంట్ షాప్ వద్ద ఒంటరిగా ఉన్న మహిళపై దాడి చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఆమెను మోసం చేసి ఆకర్షణీయమైన మాటలతో 3 తులాల బంగారు పుస్తేలతాడును దొంగిలించారు. విచారణను ముందుకు తీసుకెళ్తూ భిక్నూర్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, అనేక మూల ఆధారాలను సేకరించారు. పిర్యాదిరాలు ఊరే లక్ష్మీ (52) భిక్నూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ఏఎస్పీ చైతన్య రెడ్డి పర్యవేక్షణలో భిక్నూర్ సీఐ, సిసిఎస్ ఇన్స్పెక్టర్, ఎస్ఐతో కలిసి ఐదు ప్రత్యేక బృందాలు విచారణ చేపట్టాయి. ఈ ప్రక్రియలో టోల్ గేట్ వద్ద ఒకరిని, కామారెడ్డిలో ముగ్గురిని సహా మొత్తం నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారి ఒప్పుకోల ఆధారంగా భిక్నూర్ కేసులో దొంగిలించిన 3 తులాల బంగారు పుస్తేలతాడు, రెండు కార్లు, నలుగురి మొబైల్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఈ నిందితులు 2025 జనవరి నుండి అదిలాబాద్, సిద్దిపేట, హైదరాబాద్, నిర్మల్, కామారెడ్డి జిల్లాల్లో 8 దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. ముఖ్య నిందితుడు ఆఫ్తాబ్ అహ్మద్ షేక్ (వయస్సు: 43, వృత్తి: డ్రైవర్, నివాసం: నాగ్పూర్) గతంలో తెలంగాణలో 60కు పైగా దొంగతనాలకు పాల్పడి జైలు శిక్ష అనుభవించినడని తెలిసింది. ఇతర నిందితులైన ఫహీమాబేగం (వయస్సు: 35, వృత్తి: గృహిణి), కబీరుద్దిన్ (వయస్సు: 43, వృత్తి: వ్యాపారం), దీపక్ కిసాన్ (వయస్సు: 54, వృత్తి: బంగారు పరీక్షల దుకాణం) కూడా ఈ ఘటనలో పాల్గొన్నట్లు తేలింది. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన భిక్నూర్ సీఐ ఎం. సంపత్ కుమార్, సిస్కేస్ ఇన్స్పెక్టర్ ఎన్. శ్రీనివాస్, ఎస్ఐ డి. ఆంజనేయులు, ఉస్మాన్, ఎస్ఐ వెంకట్రావ్, కానిస్టేబుల్ రజనీకాంత్, రాములు, కిషన్ గౌడ్, రవి, రాజేందర్, మైసయ్య, రమేష్ యాదవ్, మేకల నరేష్, జి. నరేష్ కుమార్ తదితరులను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు. ప్రజలకు మనవి చేస్తూ, అనుమానిత వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

## 30 రోజుల కస్టడీ బిల్లు..

# ప్రతిపక్షాలపై బీజేపీ కుట్ర

- అవినీతి వ్యతిరేకం కాదు.. విపక్షాలను అణచివేసే చర్య
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే కుట్రలను తిప్పికొట్టాలి
- కామ్రేడ్ దొంగల కోటయ్య సంస్మరణ సభలో సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం



**ఖమ్మం, (జనం సాక్షి):** కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణిని ప్రదర్శిస్తూ 30 రోజుల కస్టడీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం విమర్శలకు గురవుతోంది. ఈ బిల్లు అవినీతి వ్యతిరేక చట్టం కాదని, ప్రతిపక్షాలను అణచివేసే కుట్ర అని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఈ బిల్లు ప్రకారం, అవినీతి లేదా గంభీర నేరాల్లో నిందితులైన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు సహా ఎవరైనా 30 రోజుల పాటు బెయిల్ లేకుండా జైలులో ఉంటే పదవి నుంచి తొలగించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ చర్య ప్రజాస్వామ్యాన్ని ఆపాదించే ప్రయత్నమని, చట్టపరమైన విధానాలను తప్పించుకునే ఎత్తుగడలుగా బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు.

టేకులపల్లి గోశాల సమీపంలో గురువారం ఏర్పాటైన దొంగల కోటయ్య సంస్మరణ సభలో మాట్లాడుతూ, ఈ బిల్లు ప్రజలకు ఉపయోగపడే చట్టం కాదని, ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోయాలనే ఉద్దేశంతో తీసుకురావడం ఆగ్రహానికి కారణమన్నారు. బీజేపీ పార్టీలు ఏ రాష్ట్రంలో అధికారంలో లేని చోట కక్షతో వ్యవహరిస్తూ, ప్రజా సమస్యలపై పోరాడే నాయకులపై కేసులు నమోదు చేసేందుకు ఈ బిల్లును ఆయుధంగా ఉపయోగిస్తోందని ఆరోపించారు. తేజస్వీ యాదవ్ ఓటర్ లిస్ట్‌లో లేకపోవడం గమనార్హమని, ఎలక్షన్ కమిషన్ కూడా బీజేపీ ప్రభావంలో ఉందని ఆయన వ్యాఖ్యానించారు. పెట్టుబడిదారుల సహాయంతో ఈ బిల్లు తీసుకురావడం మోదీ ఆలోచనా ఫలితమో లేదా అమిత్ షా కుట్రయో, అది సుప్రీం కోర్టు గారడీ కాదని, 160 సంవత్సరాల క్రితం మార్క్స్ చెప్పిన లక్షణాలకు అనుగుణంగా ఉందని తమ్మినేని తెలిపారు. కమ్యూనిస్టులు పేద, ధనిక, కుల, మత, లింగ భేదాలు లేని సమానత్వ ధోరణిని పాటిస్తున్నారని, దొంగల కోటయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి. వెంకట్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై పోరాడిన నాయకులపై 30 రోజుల కస్టడీ కేసులు నమోదు చేసి అనర్థం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. పోడుభూమి, ఇండ్ల స్థలాల కోసం ఉద్యమించినా, యూరియా కోసం రైతులు రోడ్డెక్కినా ఈ చట్టం ద్వారా అణచివేసేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. అమెరికా విధానాలతో వ్యవసాయం, నిరుద్యోగం పెరిగే ప్రమాదం ఉందని, ఈ చట్టం ద్వారా ఉద్యమాలను అడ్డుకోవాలని బీజేపీ భావిస్తోందని తెలిపారు. ప్రజా ఉప్పెన లేస్తే మోదీ, బీజేపీ నిలువలేరని, దొంగల కోటయ్యకు నిజమైన నివాళులు ప్రజా, వర్గ పోరాటాల ద్వారా అర్పించాలని పిలుపునిచ్చారు. ఈ సభలో నవతెలంగాణ ప్రత్యేక సంచికను తమ్మినేని, ఎం. సాయిబాబు, పాలడుగు భాస్కర్ తదితరులు ఆవిష్కరించారు. సభలో పార్టీ నాయకులు ఎం. సాయిబాబు, పోతినేని సుదర్శన్ రావు, నున్నా నాగేశ్వర రావు, నాగరాజు, బుగ్గవీటి సరళ, బండి రమేష్, మచ్చా వెంకటేశ్వర్లు, రాజారావు, పొన్నం వెంకటేశ్వర రావు, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాస రావు, బండి పద్మ, దొంగల కోటయ్య కుమారుడు, తిరుపతి రావు, డాక్టర్ అల్లాడి నాగేశ్వర రావు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు న్యాయం చేయాలి

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి పోస్ట్ కార్డుల ద్వారా విన్నపం**

**మంథని, (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై దశాబ్ద కాలం దాటిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు ఇప్పటివరకు ఎలాంటి న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంలో అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారుల ఊసే లేకుండా పరిపాలన కొనసాగించిందని వారు గుర్తు చేశారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యమకారుల డిమాండ్లన్నీ నెరవేరుస్తామని హామీ ఇవ్వడం జరిగిందని వారు పేర్కొన్నారు. కానీ ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పాత్ర ఎంతో కీలకమైందని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి వద్ద ఎన్ని సార్లు గోడు వెళ్ళబోసుకున్న పట్టించుకోకపోవడంతో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి గురువారం పోస్టు కార్డుల ద్వారా వివరించినట్లు వారు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందుపట్ల సునీల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంథని విజయ్ కుమార్, నియోజకవర్గ ఇన్చార్జి గోగుల రాజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు గుర్రం దేవేందర్, దేవర్ల విజయకుమార్, ఎండి సర్వర్, కోసినేని రమేష్, కాజీపేట సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల, వసతి గృహాలపై ఫిర్యాదులు పరిష్కరించండి





## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పర్యటనలు

**పెద్దపల్లి, ఆగస్టు 21 (జనం సాక్షి):** జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం పెద్దపల్లి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి భూ సమస్యల పరిష్కారం, వసతి గృహాల పరిస్థితులను పరిశీలించారు. భూ భారతి పోర్టల్‌లోని కొన్ని మాడ్యూల్స్‌లో భూ సమస్యలను ఆర్డిఓ స్థాయిలో పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రకటన విడుదల చేశారు. మార్కెట్ విలువ 5 లక్షల కంటే తక్కువ ఉన్న మిస్సింగ్ సర్వే నెంబర్, భూ విస్తీర్ణ సవరణ, పట్టా పాస్‌పుస్తకం డిజిటల్ సైన్, పేరు సవరణ, పెండిరగ్ మ్యూటేషన్, సక్సేషన్, నాలా, కోర్ట్ కేసు పిపిబి, నాల నుండి అగ్రికల్చర్‌కు మార్పిడి వంటి సమస్యలను ఆర్డిఓ కార్యాలయంలోనే పరిష్కరించే అవకాశం ఉందని తెలిపారు. దీనితో, దరఖాస్తుదారులు అనవసరంగా కలెక్టరేట్‌కు వచ్చి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని సూచించారు.

కాల్వ శ్రీరాంపూర్ మండలంలో కూనారం, ఇదులాపూర్ గ్రామాల్లో మిస్సింగ్ సర్వే నెంబర్ పట్టాల కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కలెక్టర్, రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాఫర్ ఖాన్ పేట, ఇదులాపూర్‌లోని అప్పర్ ప్రైమరీ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలకు చదవడంతో పాటు గ్రహణశక్తిని పెంపొందించాలని సూచించారు. అంగన్వాడీల్లో పిల్లల హాజరు, ఆహార నాణ్యతను పరిశీలించారు.

పెద్దకల్వలోని ప్రభుత్వ బీసి బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, హస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలకు అందించే ఆహార నాణ్యతను క్రమంగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కామన్ డైట్ మెన్యూ అమలు చేయాలని తెలిపారు. ఈ పర్యటనల్లో తహసీల్దార్ జగదీశ్వర్ రావు, డి.టి. శంకర్, సర్వేయర్ రాజు సహా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో రూ. 25 లక్షల విలువైన నిషేధిత సిగరెట్లు, ఈ-సిగరెట్లు స్వాధీనం

**హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో భారీగా నిషేధిత విదేశీ సిగరెట్లు, ఈ–సిగరెట్లు పట్టుబడ్డాయి. అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ల నుంచి రూ. 25 లక్షల విలువ చేసే చట్టవిరుద్ధ వస్తువులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయి నుంచి అక్రమంగా తీసుకొచ్చిన ఈ సిగరెట్లను హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. స్మగ్లింగ్‌లో పాల్గొన్న వారిగా అబ్దుల్లా శెట్టి (ముంబై), మహమ్మద్ తజుద్దీన్ (మెహిదీపట్నం), మహమ్మద్ షమీ (గోల్కొండ), మహమ్మద్ సోహైల్ ఖాన్ (గోల్కొండ), ఖలీల్ అహమద్ (బోరబండ), మయాంక్ బైస్ (ఇండోర్)ను పోలీసులు గుర్తించారు.

# దొంగచాటుగా మాయమైతున్న గుట్టలు

- అక్రమంగా మొరం, తరలిస్తున్న జెసిబిలను సీజ్ చేసిన మైనింగ్ అధికారులు
- ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమంగా మట్టి తరలించి విక్రయిస్తున్నారు



**పెద్దపల్లి,ఆగస్టు 21(జనంసాక్షి) :** పెద్దపల్లి మండలం తురకల మద్దికుంట గ్రామంలోని ఏనా బోర్ల గుట్ట నుండి అక్రమంగా మొరం తరలిస్తున్నారన్న పక్క సమాచారం అందుకున్న మైనింగ్ అధికారులు సంఘటన స్థలాన్ని చేరుకోగానే మొరం తరలించే వ్యక్తులు జెసిబిలను వదిలేసి పరారయ్యారు తర్వాత ఎవరి ఆ జెసిబి లు అని అధికారులు ఆరా తీశాక గత్యంతరం లేక అక్కడకు వచ్చిన ఓనర్లు జెసిబి లో డీజిల్ లేదు అంటూ అధికారులకు జెసిబి ఓనర్లు రెండు గంటలసేపు చుక్కలు చూపించారు నానా తంటాలు పడి అధికారులు చివరికి రెండు జెసిబిలను సీజ్ చేసి పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ కి తరలించారు.ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమంగా దందా జరుపుతున్నారని కాచాపూర్, తురకల మద్దికుంట గ్రామస్తులు.మొరం మాఫియా కు అడ్డుకట్ట వేయాలని గ్రామ ప్రజలు కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో మైనింగ్ అధికారి ఆర్ఐ వెంకటగిరి పాల్గొన్నారు.

## పట్టుజారితే.. ప్రమాదమే



### పొలం పనులకు వెళ్ళలంటే వాగు దాటాల్సిందే

**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనం సాక్షి):** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నారాయణ పేట మండలం సింగారం వాగు పొంగి ప్రవహిస్తోంది. వ్యవసాయదారులు, కూలీలు పొలం పనులకు వెళ్ళలంటే చెక్ డ్యాం మీదుగా వాగు దాటాల్సిందే. చెక్ డ్యామ్ పై నాచు చేరడంతో గురువారం ఉదయం రైతులు, కూలీలు చెక్ డ్యాం పై నానా అవస్థలు పడుతూ వాగు దాటారు. ఒకరి చెయి ఒకరు పట్టుకుని మరో చేతిలో కర్రలు పట్టుకుని నెమ్మదిగా నడుస్తు అవతలి వైపుకు దాటారు.

## రోడ్లు,భవనాల శాఖ మంత్రి కలిసిన గద్వాల్ ఎమ్మెల్యే



**మల్దకల్ ఆగస్టు 21(జనంసాక్షి) :** రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో సమావేశమై గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. గురువారం హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లోరాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డితో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సమావేశమై గద్వాల నియోజకవర్గంలొ 200 కిలోమీటర్ల రోడ్ల పునర్నిర్మాణానికి ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రంను అందజేశారు, తక్షణమే రోడ్లను పునరుద్ధరించాలని భారీ వర్షాల కారణంగా రోడ్లు పాడైన కారణంగా తక్షణమే పునర్నిర్మించాలని కోరారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల గురించి,గద్వాల అభివృద్ధికి సహకరించాలని మంత్రిని ఎమ్మెల్యే కోరారు. మంత్రిసానుకులంగా స్పందించి త్వరలోనే జిల్లాలోని రోడ్ల మంజూరుఇచ్చి పునర్నిర్మానానికి,మిగతా సమస్యలను పూర్తి చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు.ఎమ్మెల్యే వెంట రమేష్,మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ మాజీ జెడ్పిటిసి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో పడకేసిన పారిశుధ్యం

### ప్రజా ప్రతినిధుల బిల్డప్ ఎక్కువ... పని తక్కువ మిద్దెల మల్లారెడ్డి



**శేరిలింగంపల్లి, ఆగస్టు 21 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం హాఫీజ్ పేట్ డివిజన్ మురికి, చెత్తాచెదారంతో నిండిపోయి అపరిశుభ్రంగా తయారైందని, ఇక్కడ అధికారులు, ప్రజా ప్రతినిధులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండడంతో శానిటేషన్ పూర్తిగా పడకేసిందని శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు మిద్దెల మల్లారెడ్డి ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పది రోజులుగా శేర్లింగంపల్లి ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురిసి లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతోపాటు రోడ్లపై ఎక్కడికక్కడ మురుగునీరు చేరిపోయిందని, అది హాఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాలలోని చెత్తాచెదారంతో కలిసి దుర్గంధ భరితంగా మారిందని అన్నారు. శేరిలింగంపల్లి మరియు హాఫీజ్పేట్ డివిజన్ ప్రజాప్రతినిధులు ప్రతిరోజు ఫోటోలకు ఫోజులిస్తూ నాలుగు వార్తలు రాయించుకుంటారని, చేసేది మాత్రం శూన్యమని మల్లారెడ్డి ఎద్దేవా చేశారు. ప్రసార మాధ్యమాలలో ఫోటోలపై ఉన్న శ్రద్ధ ఓట్లేసి గెలిపించిన ప్రజల ఆరోగ్యం, సంక్షేమంపై లేకపోవడం ఆఫీస్ పెట్ డివిజన్ చేసుకున్న దౌర్భాగ్యం అని ఆయన అభివర్ణించారు. ప్రజా ప్రతినిధులు సైతం తామేమి తక్కువ తినలేదని, ఏదో ఒక యాంగిల్ లో రోజు పేపర్లో వార్తల్లో నిలిస్తే చాలని భావిస్తున్నారని, ప్రజా ప్రతినిధులతో అంట కాగుతూ రాజకీయవాసనలను అందిపుచ్చుకొని తమ ఉద్యోగ ధర్మాన్ని తుంగలో తొక్కుతున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా డెంగ్యూ కేసులు ప్రభలుతుంటే పారిశుద్ధ్య నిర్వహణకు పాతరేస్తూ ఓవైపు ప్రజాప్రతినిధులు, మరోవైపు అధికారులు ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. హాఫీజ్ పేట్ డివిజన్ పరిధిలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పేరుతో

## మోడీ ప్రభుత్వంలో రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటున్నాం





### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

**చేవెళ్ల, ఆగస్టు 21 (జనంసాక్షి) :** నరేంద్ర మోడీ ప్రభుత్వంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. గురువారం చేవెళ్ల మండలంలోని చన్వెల్లి గ్రామంలో ప్రవస్ యోజన పల్లెకు పల్లెకు భాజపా కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్, చేవెళ్ల మాజీ శాసనసభ్యులు కేఎస్ రత్నంలతో కలిసి రైతు సమ్మేళనం, యువ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ....కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రైతుకు రూ.6 వేల చొప్పున ఇవ్వడం జరుగుతుందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం నిండా ముంచిందని, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులను పట్టించుకోవడంలేదని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రస్థాయిలో అమలు చేసే విధంగా చూడాలని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని అన్నారు. అరచేతిలో వైకుంఠం చూపించి పాలన చేస్తున్నారన్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీని పెంపొందించడానికి, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు ఇలా చేరుతున్నాయని విషయాన్ని తెలియజేసేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గ్రామీణ సమస్యలను తెలుసుకోవడం, ప్రజలతో నేరుగా మమేకం కావడం భాజపా లక్ష్యమని తెలిపారు. ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొని, ప్రజలతో ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని తెలిపారు. ఇప్పటివరకు బిఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వాలకు అధికారం ఇచ్చారని ఒక్కసారి బిజెపి పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. రైతులకు మేలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం అని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేసు రత్నం అన్నారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో పాలన కుంటుపడిందని, ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. అదేవిధంగా ఈ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహించి గెలిచినవారు ఈ ప్రాంతానికి ఏం చేశారో చెప్పాలన్నారు. ఈ జిల్లాను 10, 15 సంవత్సరాలుగా ఏలుతున్న రాజకీయ నాయకులు జిల్లా అభివృద్ధి చేయకుండా ఉన్నారని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేవెళ్లలో బస్ డిపో కోసం ఏర్పాటు చేసేందుకు కృషి చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గుండన్నగారి వెంకట్ రెడ్డి, చేవెళ్ల మండల అధ్యక్షుడు మున్నూరు శ్రీకాంత్, చేవెళ్ల మాజి ఎంపిపి విజయలక్ష్మిరమణా రెడ్డి, చేవెళ్ల మండల మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి, యువ నాయకులు డా.మల్గారి వైభవ్ రెడ్డి, నాయకులు గౌండ్ల కృష్ణ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, పత్తి సత్యనారాయణ, వెంకట్ రామ్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, పిసరి శ్రీకాంత్ రెడ్డి, అశోక్, జయసింహ రెడ్డి, మల్లారెడ్డి గణేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జియోటస్ నుంచి పర్పెచువల్ ఫ్యూచర్స్

### జీరో ట్రాన్సాక్షన్ ఛార్జెజ్ ఆఫర్
### జియోటస్ సీఈవో విక్రమ్ సుబ్బురాజ్ వెల్లడి

ఖైరతాబాద్, ఆగస్టు 21 (జనం సాక్షి) : దేశంలోని ప్రముఖ క్రిప్టో ఎక్స్ఛేంజ్ జియోటస్ కొత్తగా ట్రేడర్ల కోసం పర్పెచువల్ ఫ్యూచర్స్ తన ఫ్లాట్ ఫారంలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జియోటస్ సీఈవో విక్రమ్ సుబ్బురాజ్ గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఈ సేవలు తమ 12 లక్షల మంది ఇన్వెస్టర్లకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. భారతీయ క్రిప్టో ఇన్వెస్టర్ల పెట్టుబడి అవసరాలకు అనుగుణంగా అవసర మైన ఉత్పత్తులను తీసుకురావటాని ప్రయత్ని స్తున్నట్లు తెలిపారు. కొత్తగా ఫ్యూచర్స్ ప్రవేశపెడు తున్న క్రమంలో ప్రారంభ ఆఫర్ కింద సెప్టెంబర్ 30 వరకు ట్రాన్సాక్షన్లు ఉచితంగా ఎలాంటి ఛార్జీలు లేకుండా అందుబాటులో ఉంటాయని వెల్లడించా రు. ఇన్వెస్టర్ల ఎక్స్ పీరియన్స్ పెంచేందుకు జియో టస్ కొత్తగా పర్పెచువల్ ఫ్యూచర్స్ అందుబాటు లోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా ఇన్వెస్టర్లు తమకు నచ్చిన క్రిప్టో కాయిన్స్ రియల్ టైంలో ట్రేడింగ్ చేసేందుకు అవకాశం కల్పిస్తున్నా మన్నారు. కేవలం రూ.100 కనీస పెట్టుబడి నుంచి దీనిని ప్రారంభించవచ్చని తెలిపారు. లైవ్ మార్కెట్ అప్ డేట్స్, సురక్షితమైన బ్యాకెండ్ ఇన్ ఫ్రాతో వీటిని జియోటస్ లాంచ్ చేస్తోందన్నారు. ఇది పెట్టుబడిదారులు కొత్త ఉత్పత్తులను అధిక నమ్మ కంతో ట్రేడింగ్ చేసేందుకు వీలు కల్పించనుందని పేర్కొన్నారు.

## వర్షాల వలన దెబ్బతిన్న ప్రాంతాలు

### పరిశీలించిన రాష్ట విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్

**భూత్పూర్, ఆగస్టు 21 (జనంసాక్షి) :** గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలో ప్రాణ ఆస్తి నష్టం లేకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి సమన్వయంతో చర్యలు తీసుకుందని రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లో(కలెక్టరేట్)లో వి.సి కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్.పి.డి జానకి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అధనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులతో శాఖల వారీగా వరదల వల్ల జరిగిన నష్టాలు, నివారణ సహాయక చర్యలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జూన్ నుండి ఇప్పటి వరకు 336.9 మి.మీ.సాధారణ వర్ష పాతం కు గాను 618.3 మి.మీ. వర్ష పాతం నమోదైందని,రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కన్నా అత్యధికంగా వర్ష పాతం నమోదైన జిల్లా లలో రెండవ స్థానంలో ఉందని,83.5 శాతం అధికంగా నమోదైందని అన్నారు.ఇంకా నెల రోజుల పాటు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని,మళ్ళీ అల్పపీడనం కారణంగా అత్యధిక వర్షపాతం నమోదు జరిగే అవకాశం ఉందని, ఎక్కువ వర్షపాతం క్లౌడ్ బరస్ట్ జరిగితే జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండి అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని,ఆస్తి,ప్రాణ నష్టం లేకుండా జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## తారుమారవుతున్న మునుగోడు రాజకీయం

- ఫ్లెక్సీతో వేడెక్కిన రాజకీయం
- సీఎం ఫోటో లేకుండా వెలిసిన ఫ్లెక్సీలు
- ప్రోటోకాల్ పాటించని కోమటిరెడ్డి సేన




**మర్రిగూడ,ఆగస్టు 21(జనంసాక్షి) :** మునుగోడు నియోజకవర్గంలో రాజకీయం రోజురోజుకు రసవత్తంగా మారుతుంది. కారణం ఏదైనా సరే, సిఎం వర్సెస్ కోమటిరెడ్డి అన్నట్లుగానే తయారైంది కొన్ని సంఘటనలు చూస్తుంటే. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి రాకపోవడానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కారణమని మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా తీవ్రంగా చర్చనడుస్తుంది. మునుగోడు వ్యాప్తంగా ఏదో ఒక సందర్భంలో నాయకులు కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆక్రోషం వెళ్ళగక్కుతూనే ఉన్నారు. రాజన్నకు మంత్రి పదవి ఇవ్వకుండా అడ్డుపడుతున్న నాయకులపై, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఆయా వేదికలపై తనకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూనే ఉన్నారు. దీనినే కార్యకర్తలు కూడా తూచా తప్పకుండా పాటిస్తున్నారనేదే అక్షరసత్యం. ఇక అసలు వివరాలలోకి వెళ్తే నల్లగొండ జిల్లా, మర్రిగూడ మండలం పరిధిలోని యరగడ్లపల్లి గ్రామంలో, గురువారం బోనాల పండుగ సందర్భంగా, కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో లేకపోవడంతో, రాజకీయంగా తీవ్రదుమారం రేపుతున్నాయి. మునుగోడు ఎమ్మెల్యే వెంట ఉండే లీడర్లు, కనీసం ముఖ్యమంత్రి విషయంలో ప్రోటోకాల్ పాటించటం లేదన్న విషయం, హాట్ టాపిక్గా మారింది. ఫ్లెక్సీలలో కాంగ్రెస్ ఆధిపతులు, అగ్రనేతలు, మంత్రులు, స్థానిక నాయకుల ఫోటోలు ఉన్నాయి కానీ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఫోటో లేకపోవడంతోనే మండల వ్యాప్తంగా తీవ్రచర్చ నడుస్తుంది. ఈ పరిణామాలు దేనికి దారి తీస్తాయో వేచి చూడాల్సి ఉంది?

## ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

- వైద్యం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం
- ఇంజక్షన్లు, హెవీ ఆంటీబయాటిక్, పెయిన్ కిల్లర్స్,స్టీరాడ్స్ ఇవ్వరాదు
- జిల్లాలో 10 టీములుగా ఏర్పడి తనిఖీలు నిర్వహిస్తాం.
- ఇటీవల వైద్యం వికటించి మరణించిన బేబీ వివరాలు కలెక్టర్ కి నివేదిక పంపుతాం
- జోగులాంబ గద్వాల జిల్లా వైద్య అధికారి డాక్టర్ సిద్ధప్ప





**గద్వాల నడిగడ్డ,ఆగస్టు 21 (జనం సాక్షి) :** వచ్చి రాని వైద్యం తెలు మంత్రం రాకపోయినా పాము మంత్రం చేసినట్లు ఆర్ఎంపి ఒక నిండు చిన్నారి ప్రాణాన్ని బలి తీసుకున్నాదని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం తమ వైద్య బృందం వెళ్లి విచారణ చేపట్టారాని ,అసలు ఆర్.ఎం.పి లు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని అలా చేయని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జోగులాంబ గద్వాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ సిద్దప్ప అన్నారు. ఈ సందర్భంగా సిద్ధప్ప మాట్లాడుతూ జిల్లాలో 450 పైగా ఆర్ఎంపీలు ఉన్నారని,వారు ప్లస్ మార్క్ గుర్తును కూడా వాడకూడదని, క్లినిక్ అనే బోర్డులు పెట్టుకోకూడదని, ఎటువంటి మందులు ఇవ్వకూడదని, ఇంజక్షన్లు,ఫ్లూయిడ్స్ ఎక్కించరాదని, వారు ఉండే ప్రదేశంలో క్లినిక్ షట్అఫ్ ఉండకూడదని, హెవీ ఆంటీబటిక్స్, పెయిన్ కిల్లర్లు, స్టెరాట్స్ లాంటివి ఇవ్వరాదని ఒకవేళ అవి ఎక్కువ మోతాదులో ఇస్తే ఇమ్యూనిటీ పవర్, కిడ్నీలు చెడిపోవడం, ఇతరత్ర రోగాలకు నిలయంగా మారుతుందని అలాంటి వారిపై ఉపేక్షించేది లేదని ఆర్ఎంపీలు ఏ చిన్న తప్పు చేసిన ప్రతి పౌరుడు వారి మీద ఫిర్యాదు చేయవచ్చని వాళ్లు కేవలం ప్రథమ చికిత్సకు మాత్రమే అర్హులని ఈ సందర్భంగా ఆయన అన్నారు. త్వరలోనే జిల్లాలో తమ ఆధీనంలను 10 టీములుగా ఏర్పడి ఆర్ఎంపీలు చేసే వైద్యాన్ని తిప్పికొట్టే ప్రయత్నం చేస్తామని ఇటీవల వారి ఆగడాలు ఎక్కువయ్యాయని మాకు ఫిర్యాదులు కూడా అందుతున్నాయని ఫిర్యాదు వచ్చిన తక్షణమే స్పందించి అక్కడ తనిఖీ చేస్తున్నామని, కానీ ఇప్పటినుండి మా సిబ్బంది నిరంతర ప్రక్రియగా తనిఖీలు నిర్వహిస్తామని డిఎం అండ్ హెచ్ఓ అన్నారు.

**జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించాం**

జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఆలూరు గ్రామంలో 5 సంవత్సరంల పాపకు జ్వరం వచ్చిందని స్థానిక ఆర్.ఎం.పి నరసింహ చికిత్స కేంద్రానికి వెళితే హై పవర్ కలిగిన యాంటిబటిక్ ఇంజక్షన్ ఇవ్వడంతో చనిపోయినట్లు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో విచారణ చేపట్టినట్లు మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం అధికారిని పిసిపిఎన్ బిటి నోడల్ అధికారి డాక్టర్ జి .ప్రసన్న రాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గట్టు మండలం తుమ్మలచెరువు గ్రామానికి చెందిన పల్లెన్న, కృష్ణవేణి కుమార్తె జ్వరం కోసం ఆలూరు గ్రామంలో ఆర్ఎంపీ నరసింహ దగ్గరికి వెళ్లగా ఆయన పరిధి దాటి, అధిక మోతాదులో మోనోసిఫ్ అనే యాంటీబయాటిక్ ఇంజక్షన్ నరముకు ఇవ్వడంతో డైరెక్ట్ గుండె మీద దాని ప్రభావం చూపించిందని, హార్ట్ బీట్ తక్కువ కావడంతో మెరుగైన చికిత్స కోసం గద్వాలకు తరలించగా, మళ్లీ అక్కడ నుండి కర్నూలుకు తరలించినట్లు అక్కడ ఆమె చనిపోయిందని ఈ విషయాన్ని జిల్లా వైద్యాధికారి ద్వారా జిల్లా కలెక్టర్ నివేదిక పంపిస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సిద్దప్పతోపాటు, పిసిపి ఎన్డిటి నోడల్ అధికారి డాక్టర్ జి. ప్రసన్న రాణి, ఎన్సిడి ప్రోగ్రాం అధికారిని డాక్టర్ జె.సంధ్య కిరణ్మయి పాల్గొన్నారు.

## ఐటీబీపీ జవాన్లకు గౌరవం, సౌకర్యాలు

### కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హామీ



**ఇటానగర్ (జనంసాక్షి) :** అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌లో గురువారం పర్యటించిన కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) జవాన్ల ధైర్యం, త్యాగాలను ప్రశంసించారు. వారి సేవలు భారతీయుల హృదయాల్లో ఎప్పటికీ సజీవంగా నిలిచి పోతాయని, వారి కష్టాలను మరువలేనని అన్నారు. దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జవాన్లకు గౌరవం, మర్యాదలతో పాటు అత్యాధునిక నిఘా పరికరాలు, రవాణా మాధ్యమాలు, కమ్యూనికేషన్ సదుపాయాలను కల్పించి సౌకర్యాలు అందించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ఆహ్వానంపై ఆయనతో మర్యాదపూర్వక భేటీ అయ్యారు. ఈరోజు పెమా ఖండూ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పపుంపుర జిల్లాలోని యుపియా గ్రామంలోని ఐటీబీపీ 31వ బటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించిన బండి సంజయ్, అమరవీరుల ఘాట్ వద్ద పూలమాల వేసి వీరమరణం పొందిన జవాన్లకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఐటీబీపీ సిబ్బంది ఆయనకు గౌరవ వందనం ఘటించారు. అనంతరం 31వ బటాలియ న్‌కు సంబంధించి నిర్మించిన ఏఎస్ఐ మెస్ (భవనం-45), యానిమల్ ట్రైనింగ్ స్కూల్, లోహిత్ పూర్‌లో అధికారుల, సబ్ఆర్డినేట్ అధికారుల నివాస సముదాయం, పరిపాలనా భవనం, అధికారుల మెస్, 10 పడకల ఆసుపత్రి, 49వ బెటాలియన్ ఏఎస్ఐ మెస్, నివాస సముదాయాలను ప్రారంభించారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరు జైలుకు

### 78 మందికి జరిమానాలు.

### పట్టణ సీఐ జీ. సంతోష్ కుమార్.

**తాండూరు అగస్టు 21(జనంసాక్షి) :** మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరు జైలుకు పంపించామని పట్టణ సీఐ జీ. సంతోష్ కుమార్ తెలిపారు. గురువారం సిఐ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన గొర్ల స్టాలిన్ కు 3 రోజులు జైలు శిక్షతో పాటు రూ.3వేలు జరిమానా విదించారు. అదేవిధంగా తాండూరు మండలం ఎల్మకన్నె గ్రామానికి చెందిన నడిమింటి శ్రీనివాస్‌కు 2 రోజుల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమాన విధించారని తెలిపారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన మరో 78 మందికి రూ. 1లక్ష 14వేలు జరిమాన జిల్లా అసిస్టెంట్ కలెక్టర్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ హర్ష చౌదరి విధించారని వేల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరిత్య చర్యలు తప్పవన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా రోడ్లపైకి వస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## నిండుకుండలా నాగార్జునసాగర్..



### 26 గేట్లు ఎత్తివేత

**నల్గొండ బ్యూరో, జనంసాక్షి :** ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా నదికి వరద పోటెత్తింది. జూరాల గేట్లు ఎత్తడంతో.. దిగువన ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు కృష్ణమ్మ పరుగులు పెడుతుంది. కృష్ణా నది ఉధృతంగా ఉరకలేస్తుండడంతో నాగార్జున సాగర్ నిండు కుండలా మారింది. ఈ క్రమంలో ప్రాజెక్టు 26 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఒకేసారి 26 గేట్లు ఎత్తడంతో.. నీటి ప్రవాహం పాల పొంగును తలపిస్తోంది. ఈ అద్భుత దృశ్యాలను తిలకించేందుకు నాగార్జున సాగర్‌కు పర్యాటకులు పోటెత్తారు. సాగర్ అందాలను చూసి మురిసిపోతున్నారు.

ప్రస్తుతం ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 3,92,997 క్యూసెక్కులు కాగా, ఔట్‌ఫ్లో 4,73,053 క్యూసెక్కులుగా ఉంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 583 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 291.66 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం జలాశయానికి కూడా వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి వరద భారీగా వచ్చి చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 4,98,022 క్యూసెక్కులు కాగా, ఔట్ ఫ్లో 5,13,540 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30 వేల క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 29,595 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

10 స్పిల్ వే గేట్లను 18 అడుగులు ఎత్తి 4,18,630 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 881.60 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 197.01 టీఎంసీ లుగా ఉంది.

జనంసాక్షి www.janamsakshi.org | శుక్రవారం 22 ఆగస్టు 2025

# క్యూలైన్‌లో చెప్పల వరసలు

**యూరియా కోసం కొనసాగుతున్న రైతుల ఆందోళనలు..**

- క్యూలైన్లు.. చెప్పల వరసలు
- పడిగాపులు కాస్తున్న రైతులు
- కొరత లేదని చెబుతున్న కలెక్టర్లు
- అయినా అందని వైనం
- సరిపడా పంపిణీ కేంద్రాలకు రాకపోవడంతో ఇబ్బందులు


చిలప్‌చేడ్ మండలంలోని చిట్కుల్ చౌరస్తా వద్ద రైతులతో ధర్నాకు దిగిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**చిలప్‌చేడ్ /మహబూబ్ నగర్ బ్యూరో/ చేర్యాల, ఆగష్టు 21: (జనం సాక్షి) :** రైతులకు సకాలంలో యూరియా అందకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. రోజంతా పంపిణీ కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. మరో వైపు కలెక్టర్లు యూరియా కొరత లేదని చెబుతున్నారు. కేంద్రం సరిపడా రాష్ట్రానికి రావాల్సిన వాటా రాకపోవడం.. ఇటీవల వర్షాలకు యూరియా వాడకం పెరగడం వెరసి రైతులు ఆగమాగమవుతున్నారు.

చిలప్‌చేడ్ మండలంలోని చిట్కుల్ చౌరస్తా వద్ద రైతులు నిర్వహిస్తున్న ధర్నాకు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మండల కేంద్రం నుండి రైతులతో కలిసి చిట్కూల్ చౌరస్తా వరకు రైతులతో బయలుదేరి ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. చిలప్ చేడ్ మండలంలో ఉన్న ఒక్క సొసైటీకి మాత్రమే యూరియా సరఫరా చేస్తున్న అధికార యంత్రాంగం మరి మండలంలో ఆగ్రో రైతు సేవ కేంద్రాలకు ఎందుకు యూరియాను సరఫరా చేస్తారని అన్నారు. ధర్నాలో భాగంగా ఆగ్రో రైతు సేవ కేంద్రాన్ని సందర్శించి ఆగ్రో రైతుసేవ ప్రోపరేటర్ను మీరు ఎందుకు యూరియా తేవడం లేదని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అడిగారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు అశోక్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ మాజి చైర్మన్ చంద్ర గౌడ్, జిల్లా కో ఆప్షన్ సభ్యులు మన్సూర్, సొసైటీ వైస్ చైర్మన్ రామచంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### క్యూలో చెప్పులు

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సహకార మార్కెటింగ్ సోసైటి కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు గురువారం తెల్లవారుజాము నుంచి పడిగాపులు కాస్తున్నారు. వారం రోజుల నుంచి సహకార సంఘ కార్యలయం కి సరిపడా యూరియా రావడం లేదు. ఈ క్రమంలో గురువారం లారీ లోడ్ వచ్చి సొసైటీ కార్యాలయం వద్ద దించుతున్నారని సమాచారం తెలుసుకున్న రైతులు భారీగా తరలివచ్చారు. ఉదయం 4 గంటల నుంచి రైతులు చెప్పులను లైన్ లో పెట్టి నిలిచి ఉన్నారు.

చేర్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం బారులు తీరుతున్నారు. రైతులు రోజు తెల్లవారంగానే వ్యవసాయ కేంద్రం వద్దకు చేరుకుని యూరియా సరఫరా కోసం ఎదురుచూస్తుండడం బాధాకరమైన సంఘటన చోటు చేసుకుంది.


మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సహకార మార్కెటింగ్ సోసైటి కార్యాలయం వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు


చేర్యాలలో కాగితాలను వరుసలో పెట్టి రైతుల పడిగాపులు

# దళితులపై దాడులు చేస్తే కేసులు కట్టరా?

**150 ఎకరాల ఎస్సీల అసైన్డ్ భూమి నాశనమైతే చూస్తూ కూర్చుంటారా?**



- పెద్దధన్వాడ రైతులపై ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం చేసిన దాడులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి
- ఈ ఘటనపై వెంటనే ఏటీఆర్ పంపించండి
- గద్వాల డీఎస్పీకి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య ఆదేశాలు
- గద్వాల కలెక్టర్, ఎస్పీలకు సైతం నోటీసులు

**దళితులపై దాడులు చేస్తే కేసులు ఎందుకు నమోదు చేయలేదని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య ప్రశ్నించారు. పెద్ద ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ బాధితులు, దాడికి గురైన దళితులు గురువారం హైదరాబాద్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్యను కలిసి తమపై జరిగిన దాడి గురించి విన్నవించారు. ఈ మేరకు స్పందించిన కమిషన్ చైర్మెన్ పెద్దధన్వాడ రైతులపై ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం చేసిన దాడులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి బాధ్యులను శిక్షించాలని, వెంటనే ఏటీఆర్ పంపించాలని గద్వాల డీఎస్పీకి ఆదేశాలు జారీ చేశారు. గద్వాల కలెక్టర్, ఎస్పీలకు సైతం నోటీసులు పంపారు.**

– హైదరాబాద్ (జనంసాక్షి) :

గ్రామస్తుల ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద ధన్వాడలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరి యాజమాన్యం గాయత్రి రెన్యూవబుల్ అల్లాయిడ్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ వారు గత జూన్ 3న కంపెనీ సీఈవో, ప్రయివేటు బౌన్సర్ల సాయంతో పనులు ప్రారంభించడానికి వచ్చారని జూన్ 4న పెద్ద ధన్వాడ గ్రామస్తులంతా ఫ్యాక్టరీ వద్దంటూ శాంతియుతంగా రోడ్డుపై ధర్నాకు దిగారు. సీఈవో బి.మంజునాథ్, ప్రయివేటు బౌన్సర్లు గ్రామస్తుల వద్దకు వచ్చి తమ కులం పేరు తెలుసుకుని, కులం పేరుతో దుర్భషలాడుతూ బౌన్సర్ల సాయంతో దాడికి దిగారని, కట్టెలతో దాడి చేయడంతో తలలు పగిలాయని, 10 కుట్లు పడ్డాయని మరియమ్మ అనే దళిత మహిళ తన గోడు వెళ్లబోసుకుంది. హాస్పిటల్‌లో చూపించుకున్న అనంతరం రాజోలి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టానని, 60 రోజులవుతున్నా చర్యలు తీసుకోకుండా తిరిగి గ్రామ రైతులపైనే కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజోలి పోలీస్ స్టేషన్‌లో దళితులమైన తమకు న్యాయం దొరకలేదని, తమపై దాడికి దిగిన సీఈవో మంజునాథ్‌పై, బౌన్సర్లపై కేసులు నమోదు చేసి న్యాయం చేయాలని కమిషన్ చైర్మెన్‌కు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందించిన వారిలో మరియమ్మతోపాటు బాధితులు జి. భాస్కర్, మోషన్న, ఎన్.మోషన్న, ఎం.రాజ్‌కుమార్ ఉన్నారు. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కూడా బాధితుల సమ న్యలపై ఆ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

బాధితుల గోడు విన్న కమిషన్ చైర్మెన్ వెంటనే స్పందించారు. ఈ ఘటనపై ఇంత వరకు తీసుకున్న యాక్షన్ టేకెన్ రిపోర్టు పంపాలని కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీలను ఆదేశించారు. రైతుల పక్షాన నిలబడకుండా పోలీసులు ఏకపక్షంగా కంపెనీ యాజమాన్యం వైపు నిలబడటమేంటని ప్రశ్నించారు. దాదాపు 150 ఎకరాల దళితుల అసైన్డ్‌మెంట్ భూమి నాశనమవుతుంటే ఎందుకు పట్టించుకోలేదని, రైతులంతా ధర్నా చేస్తుంటే పట్టించుకోకపోగా వారిపైనే కేసులు నమోదు చేయడమేంటని దీనిపై వెంటనే వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.



# నేటి నుంచి తెలంగాణవ్యాప్తంగా పనుల జాతర

- రూ. 2198.83 కోట్లతో నూతన పనులకు శ్రీకారం
- సచివాలయంలో పనుల జాతర-2025 పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, ఆగస్టు 21 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, ఉపాధి కల్పన, పల్లెల్లో మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా "పనుల జాతర%-%2025" శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒకేసారి ఈ కార్యక్రమాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ గంగారం మండలంలోని పుట్టల భూపతి గ్రామంలో పనుల జాతరను పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దినసరి అనసూయ సీతక్క లాంఛనంగా ప్రారంభిస్తారు. "ప్రజలకు ఉపాధి కల్పనతో పాటు గ్రామీణాభివృద్ధి బాటలో ఈ పనుల జాతర కీలక మైలురాయిగా నిలుస్తుంది. ఇది రాజకీయాలకు అతీతమైన పండుగ. ఎమ్మెల్యేలంతా ఈ పనుల జాతరలో పాలుపంచుకోవాలి" అని మంత్రి సీతక్క ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక లేఖలు రాసి, తమ తమ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సచివాలయం వేదికగా పనుల జాతర పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క, పనుల జాతర లో భాగంగా చేపట్టి పనుల వివరాలను వెల్లడించారు. ఈ జాతరలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు అమలు చేయనున్నారు. పశువుల పాకలు, గొర్రెల షెడ్లు, చెక్‌డ్యాములు, ఊటకుంటలు, ప్లాస్టిక్ వెస్ట్ యూనిట్లు, గ్రామీణ రహదారులు, కమ్యూనిటీ టాయిలెట్లు, అంగన్వాడీ, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం పాఠశాలల్లో మరుగుదొడ్లు వంటి పనులను చేపడతారు.

### మేడారం మహా జాతరను మహా వైభవంగా నిర్వహిస్తాం

ఆదివాసీ గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సమ్మక్క సారలమ్మ మహా జాతర కోసం ఎన్నడు లేని విధంగా ఈ దఫా రూ.150 కోట్లు ఖర్చు చేసిన్నట్లు మంత్రి సీతక్క స్పష్టం చేశారు. హైదరాబాద్ సచివాలయంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మీడియా సమావేశం నిర్వహించారు. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర జాతర వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, వచ్చే ఏడాది మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర జనవరి 22 నుండి 31 వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంలో ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్నడూ లేని విధంగా రూ.150 కోట్ల నిధులు విడుదల చేసిందని వెల్లడించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ..సమ్మక్క - సారలమ్మ గత జాతరకు 105 కోట్లు కేటాయిస్తే... ఈసారి 150 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఆదివాసి పూజారులు కోరిన విధంగా జాతర పనులు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గత ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖను పట్టించుకోలేదనీ.. అయితే ప్రజా ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి పెద్ద బిడ్డ వేస్తోందని తెలిపారు. అదేవిధంగా పంచాయతీరాజ్ శాఖ తరపున 'పనుల జాతర 2025 పోస్టర్' ను మంత్రులు ఆవిష్కరించారు.

### తెలంగాణ గ్రామీణాభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలి

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ సచివాలయం నుండి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలు సజావుగా జరుగుతోందని, కేంద్రం నుంచి మరింత సహకారం అవసరమని అన్నారు. ప్రధానమంత్రి కృషి సించాయి యోజనలో భాగంగా కేంద్రం కేటాయించిన రూ.368.7 కోట్లలో ఇప్పటివరకు రూ.129.64 కోట్లు (35%) వినియోగించామని, మిగిలిన నిధులను నవంబర్ లోపు పూర్తిగా ఖర్చు చేస్తామని తెలిపారు. దక్కన్ పీఠభూమి నేలల ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, ఈ పథకానికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి సీతక్క విజ్ఞప్తికి కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందించారు. వచ్చే సెప్టెంబర్ 4, 5 తేదీల్లో రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి మంత్రుల "చింతన్ శివిర్" జరుగనుందని, అందులో తెలంగాణ అవసరాలపై ప్రజెంటేషన్ ఇవ్వాలని సూచించారు. తెలంగాణలో అమలవుతున్న వినూత్న పథకాలను ఆ వేదికపై ప్రదర్శించాలని సూచించారు.

# ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఊహించని ఫలితాలుంటాయ్..

- తెలుగు ఎంపీలంతా సుదర్శన్ రెడ్డికే మద్దతు ఇవ్వాలి..
- విలేఖరుల సమావేశంలో ఎంపీ మల్లు రవి కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** త్వరలో జరగబోయే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఊహించని ఫలితాలు ఉంటాయని.. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి వ్యాఖ్యానించారు. తెలుగు ఎంపీలంతా ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్ రెడ్డికే మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సుదర్శన్ రెడ్డి గురువారం నాడు నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఎంపీ మల్లు రవి ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేఖరులతో మాట్లాడారు. 'సుదర్శన్ రెడ్డికి ఏ పార్టీలో సభ్యత్వం లేదు. రాజ్యాంగ పరిరక్షణ కోసమే ఇండియా కూటమి సుదర్శన్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది. ఆయన గెలుపు కోసం తెలుగు ఎంపీలంతా కృషి చేయాలి. సుదర్శన్ రెడ్డి త్వరలోనే పలు రాష్ట్రాల్లో పర్యటిస్తారు. తనకు మద్దతు ఇవ్వాలని వివిధ పార్టీలను, ఎంపీలను కోరతారు. ఈ ఎన్నికల్లో విప్ ఉండదు. కాబట్టి ఎంపీలు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం ఉంటుంది. ఈ అవకాశాన్ని సుదర్శన్ రెడ్డి గెలుపు కోసం వినియోగించుకుంటారని ఆశిస్తున్నాము' అని మల్లు వివరించారు.

'సుదర్శన్ రెడ్డి త్వరలో ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్తారు. యూపీలో అఖిలేష్ యాదవ్, బెంగాల్‌లో మమతా బెనర్జీ, తమిళనాడులో స్టాలిన్ మద్దతు కోరతారు. అలాగే ఇండియా కూటమి ఎంపీల మద్దతు కోరతారు. తెలంగాణ ఎంపీల ఫోరం కన్వీనర్‌గా నేను కూడా సుదర్శన్ రెడ్డి గెలుపు కోసం ఎంపీల మద్దతు కోరతాను' అని మల్లు రవి స్పష్టం చేశారు.

'ఎన్టీఆర్-చంద్రబాబు మధ్య పార్టీ గుర్తు కోసం కేసు నడిచిన సమయంలో సుదర్శన్ రెడ్డి సుప్రీం కోర్టులో న్యాయమూర్తిగా ఉన్నారు. ఇప్పుడు చంద్రబాబు కృతజ్ఞత చూపాల్సిన సమయం వచ్చింది. సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని మేము అన్ని పార్టీలను, ఎంపీలను విజ్ఞప్తి చేస్తున్నాం. ఆయన జడ్జిగా ఉన్నప్పుడు ఎన్నో కీలక తీర్పులను చెప్పారు. ఆయన ఎప్పుడూ ప్రజల కోణంలో ఆలోచించే వ్యక్తి' అని మల్లు రవి వ్యాఖ్యానించారు.

'పార్లమెంట్‌లో ఉభయ సభలను నిర్వహించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలం అయ్యింది. ప్లాన్ ప్రకారం సభల్లో గందరగోళ పరిస్థితులు సృష్టించారు' అని మల్లు రవి విమర్శించారు. అలాగే తెలంగాణ ఎంపీలంతా కలిసి కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసినట్టు వివరించారు మల్లు రవి. విభజన సమస్యల పరిష్కారం, సెమీకండక్టర్ యూనిట్స్, తెలంగాణలో ఎయిర్‌పోర్టులు, మూసీ నదీ ప్రక్షాళన వంటి అంశాలపై సంబంధిత మంత్రులకు లేఖలు రాసినట్టు వెల్లడించారు.

# విద్యుత్ షాక్ ఘటనలు దురదుష్టకరం

- కేబుల్‌వైర్లతో కరెంట్ లైన్లపై ఒత్తిడి : ముషారఫ్ అలీ



**హైదరాబాద్, ఆగస్టు21 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో విద్యుత్ షాక్ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ విచారం వ్యక్తం చేశారు. విద్యుత్ షాక్‌తో ఏడుగురు చనిపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో సీఎండీ ముషారఫ్ అలీ మాట్లాడుతూ.. టీవీ కేబుల్స్, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్స్ రెగ్యులర్‌గా కరెంట్ వైర్లకు దగ్గరగా పెట్టడంతో వర్షా కాలంలో ఇబ్బందులు తలెత్తే.. ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ అంశంపై గ్రేటర్ పరిధిలోని కేబుల్ ఆపరేటర్స్‌తో చాల సార్లు సమావేశం ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయినా వాళ్ళు మారడం లేదన్నారు. అందువల్లే కేబుల్స్ కట్ చేయాల్సి వస్తుందని స్పష్టంచేశారు. టీజీఎస్పీడీసీఎల్ సూచించిన ప్రమాణాల ప్రకారం కేబుల్ వైర్లు, సర్వీస్ ప్రొవైడర్లను వాడడం లేదన్నారు. ప్రస్తుతం వర్ష కాలంలో సాధ్యమైనంత వరకు జాగ్రత్తగా ఉండాలంటూ నగర వాసులకు ఆయన కీలక సూచన చేశారు. కేబుల్స్ కట్ చేయడం వల్ల ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయం చూడాలని ఇప్పటికే కేబుల్స్ ఆపరేటర్స్‌కు సూచించామన్నారు. అయితే కేబుల్స్ కట్ చేయడంపై తెలంగాణ హైకోర్టు కొన్ని కీలక సూచనలు చేసింది.. ఆ క్రమంలో కోర్టు వివరణ ఇచ్చిన తర్వాత.. తదుపరి యాక్షన్ ఉంటుందని సీఎండీ ముషారఫ్ అలీ వెల్లడించారు. కృష్ణాష్టమి సందర్భంగా హైదరాబాద్‌లోని రామాంతాపూర్‌లో భక్తులు యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో కరెంట్ షాక్ తగిలి ఆరుగురు యువకులు మరణించారు. అలాగే మరో ప్రాంతాల్లో కరెంట్ షాక్ తగిలి మరో ఇద్దరు మరణించారు. అలాగే వినాయకుడి విగ్రహం తీసుకు వెళ్తూ మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో విద్యుత్ స్తంభాలకు ఉన్న ఇంటర్నెట్ కేబుల్లను తొలగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించింది. దీంతో నగరంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ దీపాలకు ఉన్న కేబుల్ వైర్లను తొలగించారు. దీంతో ప్రభుత్వ చర్యలను కేబుల్ ఆపరేటర్లు ఖండించారు. ఆ క్రమంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీతో కేబు ల్ ఆపరేటర్లు బుధవారం సమావేశమయ్యారు. వీరి మధ్య జరిగిన చర్చలు సఫలమైనట్లు వార్త కథనాలు వెల్లడించిన విషయం విదితమే.

# కేటీఆర్.. నీ అహంకారం తగ్గించుకో

- మండిపడ్డ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



కేటీఆర్ అహంకారం తగ్గించుకుంటే మంచిదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన కాంగ్రెస్ పార్టీని దర్టీ పార్టీ అని మాట్లాడడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనమరని, తెలంగాణ ఇచ్చిన పార్టీ నీకు థర్డ్ గ్రేడ్ పార్టీలా కనిపిస్తుందా..? అని ప్రశ్నించారు. 'నీ తండ్రి కేసిఆర్,నువ్వు నీ కుటుంబం తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ దగ్గర గ్రూప్ ఫోటో దిగింది మర్చిపోయారా..? మా పార్టీ పెట్టిన ఉప రాష్ట్రపతి అభ్యర్థిని దేశం మొత్తం హర్షిస్తుంది. సుదర్శన్ రెడ్డి సుప్రీం కోర్టు జడ్జిగా ఉంటూనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం గళం ఎత్తిన న్యాయ కోవిదుడు. తెలంగాణ బిడ్డ ఉప రాష్ట్రపతి అవ్వడం మీకు ఇష్టం లేదు..మీ తెలంగాణ వాదం పై సందేహాలు తలెత్తుతున్నాయి. తెలంగాణ బిడ్డ ను వ్యతిరేకించిన మిమ్మల్ని తెలంగాణ ప్రజలు క్షమించరు. లక్షల కోట్ల అవినీతి చేసి ఆ డబ్బు ఉందని కళ్ళు నెత్తికెక్కి కాంగ్రెస్ పై మాట్లాడుతున్నావ్. అహంకారపూరితమైన మాటలు ఇక మాట్లాడకు.. దేశం కోసం త్యాగం చేసిన గాంధీ కుటుంబం పై చులకనగా మాట్లాడడం..అమెరికాలో చదివిన నీ చదువు విజ్ఞతకు వదిలేస్తున్న. నాడు ప్రపంచలోనే ద బెస్ట్ పిఎం అనిపించుకున్నారు రాజీవ్ గాంధీ.. రాజకీయంతో సంబంధం లేకుండా దేశ ఐక్యత కోసం భారత్ జోడో యాత్ర చేశారు రాహుల్ గాంధీ.. యూరియా ఎందుకు రావట్లేదో నీకు అంత మాత్రం తెలియదా?' అని ప్రశ్నించారు. కేంద్రం ఇవ్వాల్సింది ఇవ్వకుండా చేస్తుంటే నువ్వు అది మాట్లాడక పోగా.. అజ్ఞానంతో మాట్లాడుతున్నావని ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఇస్తే దానిపై క్యాబినెట్ లో చర్చించామని, అవినీతి చేయకుంటే ఢిల్లీ నుండి లాయర్లను తెప్పించి హైకోర్టుకు ఎందుకు వెళ్లారని, అవినీతి ప్రజల ముందు పెడతాం..మీకు ఏ శిక్ష వేయాలో ప్రజలే నిర్ణయిస్తారని తెలిపారు. జగదీష్ రెడ్డి గురించి మాట్లాడే స్థాయికి తాను దిగజారలేదని, విద్యాశాఖ మంత్రిగా ఉన్న ఒక్కనాడు మహాత్మగాంధీ యూనివర్సిటీ కి పోలేదు..నేను ఇప్పుడు లా, ఫార్మసీ కోర్సులు కొత్తగా తెచ్చానని, వైటీపీఎస్ మీద విచారణ జరుగుతోందని ఆయన వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో తేలుస్తామని తెలిపారు. 'ఉత్తంకుమార్ రెడ్డి గురించి, నా గురించి మాట్లాడేంత స్థాయా? నల్గొండకు ఏం చేసామో ప్రజలకు తెలుసు.. త్వరలోనే నీ బాగోతం బయటపడుతుంది' అని హెచ్చరించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370